ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
శుక్రవారం 6, డిసెంబరు 2024



గిద్దలూరు సమీపంలో వాలిపోయి నీటిలో ఉన్న వరి పైరు

ముసురు పట్టి..


కనిగిరి ప్రాంతంలో వర్షం కారణంగా నీట మునిగిన పొగాకు చేను

10,336 హెక్టార్లలో పంట నష్టం

వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా



ఒంగోలు కలెక్టరేట్ : జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లింది. వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 103 గ్రామాల్లోని 6,750 మంది రైతులకు చెందిన 10,336 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. అందులో శనగ 5,506 హెక్టార్లు, వరి 676, పొగాకు 1,333, వరిగ 114, మినుము 1,902, కందులు 85, నువ్వు 176, పెసర 24, అలసంద 133, మొక్కజొన్న 48, జొన్న 56, ఉలవ 283 హెక్టార్లు ఉంది. కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, వెలిగండ్ల, సీఎస్‌పురం, పామూరు, పీసీపల్లి మండలాలు, గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, కొమరోలు, గిద్దలూరు, బేస్తవారపేట, రాచర్ల మండలాల్లోని 103 గ్రామాల్లో 12 రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఆమేరకు ప్రభుత్వానికి ప్రాథమికంగా నివేదిక పంపారు.

జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు రైతులను కుంగదీస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమై గురువారం కూడా కొనసాగాయి. నాలుగు రోజుల్లో సగటున 62.30 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో పంట పొలాలు మునిగిపోయాయి. 50వేల ఎకరాల్లో వివిధ రకాల పైర్లు నీటిలోనే ఉండిపోయాయి. వాటిలో ఎక్కువ శాతం ఉరకెత్తే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 10,336 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక పంపారు. తాజా వర్షాలకు రోడ్లు మరింత ఛిద్రమయ్యాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. గురువారం కనిగిరి మండలంలో కుండపోత వాన కురిసింది. కొద్ది గంటల వ్యవధిలో ఏకంగా 130.20 మి.మీ వర్షపాతం నమోదైంది. వాగులు పొంగడంతో కొన్నిచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇతర ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఇంకా కొనసాగితే పంటలు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉండటంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

'ముంచె'త్తి!

నాలుగు రోజుల్లో 62.30 మి.మీ సగటు వర్షపాతం

- వేలాది ఎకరాల్లో పంటలు మునక
- కొనసాగుతున్న వర్షాలు
- ఆందోళనలో రైతులు
- తాజాగా కనిగిరిలో కుండపోత
- అధ్వానంగా పారిశుధ్యం.. ఛిద్రమైన రోడ్లు

ఒంగోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ముసురుపట్టింది. తెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గడిచిన నాలుగు రోజుల్లో సగటున 62.30 మి.మీ వర్షపాతం నమోదైంది. తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని కొన్ని మండలాల్లో 150నుంచి 200 మి.మీ కురిసింది. గురువారం తెల్లవారుజామున పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. సాధారణంగా ఇది అంతగా వర్షాలు కురిసే సమయం కాదు. ఈనెల మొత్తం మీద సగటు వర్షపాతం 43.45 మి.మీ కాగా, ప్రస్తుతం ఊహించని రీతిలో విస్తారంగా కురుస్తున్నాయి.

కనిగిరిలో అత్యధికంగా 208.6మి.మీ వర్షపాతం

తొలుత ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని భావించారు. అయితే ఆ ముప్పు తప్పింది. ఇక వర్షాలు లేవు అనుకుంటున్న తరుణంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి వర్షం ప్రారంభమైంది. అప్పటి నుంచి విడతల వారీగా కురుస్తూనే ఉంది. జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ 62.30 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఈ నాలుగు రోజుల్లో కనిగిరి మండలంలో అత్యధికంగా 208.6 మి.మీ కురిసింది. సీఎస్‌పురం మండలంలో 173.6, వెలిగండ్లలో 156.6, హనుమంతునిపాడులో 163.7, పీసీపల్లిలో 138.20, పామూరులో 117.6, కొమరోలులో 111.1, కొండపిలో 122.4, పొన్నలూరులో 99.0, గిద్దలూరులో 104.20 మి.మీ వర్షపాతం నమోదైంది. సంతనూతలపాడు, ఒంగోలు, కొండపి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లోనూ భారీగానే పడింది. ఇతర ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి

నీటిలోనే పంటలు

ముసురు పట్టి కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీట మునుగుతున్నాయి. ప్రధానంగా తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో వేసిన లేత పొగాకు తోటలు, శనగ పంటలతో పాటు వరి

మిగతా 6లో...


జలమయమైన ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్


కనిగిరి సమీపంలోని కొత్తూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


108 వాహనంలో తరలిస్తున్న కుశాల్ మృతదేహం

విషాదం


గాయాలతో జ్యోతి

ఒకే ఇంజనీరింగ్ కళాశాలలో కొడుకు విద్యార్థిగా, తల్లి ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగానే వారిద్దరూ ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయల్దేరారు. మార్గమధ్యంలో ఆగి ఉన్న ఇటుకల ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో కొడుకు పిల్లి కుశాల్ (18) మృతి చెందాడు. తల్లి తలకు తీవ్ర గాయమైంది. ఒంగోలులోని దక్షిణ బైపాస్ సమీపంలో గురువారం ఈ విషాదం చోటుచేసుకుంది.

- వివరాలు 6వ పేజీలో

- విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికుల మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- ఒక బోరు నుంచి మరో బోరుకు వైరు లాగుతుండగా ప్రమాదం

మృత్యుతీగ

కొనకనమిట్ల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 5 : కరెంటు తీగ యమపాశమైంది. ఇద్దరు కార్మికుల ఉసురుతీసింది. వారి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. ఈ ఘటన కొనకనమిట్ల మండలం చినారికట్లలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రమైన పెద్దారవీడుకు చెందిన కార్మికులు సంకుల రంగారావు, ఒంటేరు నాగరాజు, మస్తాన్, ఖాసిం, పెదనాగూర్ మీరావలి చినారికట్ల గ్రామంలో ఉన్న నిమ్మతోటలో విద్యుత్ తీగలు లాగేందుకు వచ్చారు. ఒక బోరు నుంచి మరో బోరుకు తీగను లాగేందుకు పట్టుకున్న వెంటనే ప్రమాదవశాత్తూ కరెంటు సరఫరా అవడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. గుర్తించిన నిమ్మతోట యాజమాని ఆటోలో వారిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఒంటేరు నాగరాజు (31), సంకుల రంగారావు (30) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. నాగరాజు, రంగారావులకు ఒక్కో కుమార్తె, ఒక్కో కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.


నాగరాజు, రంగారావు మృతదేహాలు


విలపిస్తున్న కుటుంబ సభ్యులు

3 వేల బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఉప్పుగుండూరులో స్వాధీనం

6



ఒకే వేదికపైకి తల్లిదండ్రులు, గురువులు

- రేపు ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక సమావేశాలు
- పాఠశాల, విద్యార్థి ప్రగతిపై చర్చ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై కూటమి సర్కారు దృష్టి సారించింది. అందుకోసం ఓ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్ని ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. అందుకోసం శనివారం పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాల నిర్వహణకు ఆదేశించింది. విద్యాపరమైన అంశాలను చర్చించి బడులను మరింత బలోపేతం చేయాలన్న సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాపట్ల జిల్లాలో శనివారం లాంఛనంగా ప్రారంభించనుండగా జిల్లావ్యాప్తంగా ఉన్న 2,407 ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరూ సమావేశాల్లో పాల్గొనేలా ఇప్పటికే వారికి హెచ్ఎంలు ఆహ్వానాలను పంపారు.

పాఠశాల సమగ్ర అభివృద్ధికి దిశానిర్దేశం

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ప్రత్యేక సమావేశాల్లో పలు అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్ల సమగ్రాభివృద్ధికి దిశానిర్దేశం చేయనున్నారు. ఏటా పాఠశాల స్థాయిలో ఏర్పాటుచేసే తల్లిదండ్రుల సమావేశాలకు భిన్నంగా ఈసారి నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. అందుకు అవసరమైన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. పాఠశాలల అభివృద్ధికి అవసరమైన సామగ్రి కొనుగోళ్ల బడ్జెట్, సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయుల అంతర్గత సమస్యలు, మంచినీరు ఇతర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. విద్యార్థుల ప్రగతి, వారి ఆరోగ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు అంటే శారీరక, మానసిక, కంటి సంబంధ సమస్యలు, పౌష్టికాహార లోపం వంటివి సిద్ధం చేశారు. కొన్నిచోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇంటి వద్ద

మిగతా 6లో...

రూ.49.16 లక్షలు మంజూరు

ప్రత్యేక సమావేశాల నిర్వహణకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాకు రూ.49.16 లక్షలు ఇచ్చింది. దీన్ని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేటాయించారు. మరోవైపు పాఠశాల పూర్వ విద్యార్థులను కూడా సమావేశాలకు ఆహ్వానించారు. వారిద్వారా విద్యార్థులకు సూచనలు ఇప్పించనున్నారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అంశాలపై కూడా వారితో చర్చించనున్నారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- మంత్రి స్వామి ఆదేశం
- నేటి నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులపై అధికారులతో సమావేశం



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం స్థానిక ప్రకాశం భవన్‌లో శాసనసభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మీకోసంకు వచ్చే అర్జీలలో 70నుంచి 90శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ఉంటున్నాయన్నారు. ఈనేపథ్యంలో వీటి శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ సదస్సులను ఆగస్టులోనే నిర్వహించాలనుకున్నా అధికారుల బదిలీలు, వరదల నేపథ్యంలో జాప్యం జరిగిందన్నారు. చుక్కలు, 22(ఎ) భూముల జాబితాలో ఉన్న భూములపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లలో అక్రమాలను కూడా ఈ సదస్సుల ద్వారా గుర్తించి బాధ్యులపై కఠిన

మిగతా 6లో...

ఆలోచనలు ఆవిష్కృతం

ఒంగోలులోని దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి పాలిఫెస్ట్ గురువారం ఘనంగా మొదలైంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి, మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆలోచనలు కళ్ల ముందు ఆవిష్కృతమయ్యాయి. వారు ప్రదర్శించిన ప్రాజెక్టులు వావ్! అనిపించాయి. 13 పాలిటెక్నిక్ కాలేజీల నుంచి మూడు వందల మంది హాజరై 72 ప్రాజెక్టులను ప్రదర్శించారు.

- వివరాలు 7వ పేజీలో


ఒంగోలు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు

నీచ రాజకీయాలకు పాల్పడుతున్న వైసీపీ నాయకులు

● జగన్ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3వేల కోట్ల బకాయిలు
● మంత్రి డాక్టర్ స్వామి ధ్వజం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో ఉన్నా వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ.స్వామి మండిపడ్డారు. ఒంగోలులోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు నీచ రాజకీయాలు చేశారని, అధికారం కోల్పోయినా కూడా అదేవిధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయంలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను రూ.3వేల కోట్లు పెట్టారన్నారు. వైసీపీని ప్రజలు చీత్కరిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్టిన బకాయిలను ఇప్పుడు తాము తీరుస్తున్నామని మంత్రి తెలిపారు. జగన్ పాలనలో అనేక మంది విద్యార్థులు పరీక్షలు రాయకుండానే ఆగిపోయారన్నారు. తమ ప్రభుత్వంలో పరీక్షలు రాయకుండా ఇబ్బంది పెడితే చర్యలు తీసకుంటామని జిల్లా కలెక్టర్లు ఆదేశాలు కూడా ఇచ్చారని తెలిపారు. విద్యార్థుల పక్షాన ఎప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఉంటుందన్నారు. జగన్ హయం లోనే ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి భారం మోపారని ఆరోపించారు. జగన్ చేసిన పాపమే ఇప్పుడు విద్యుత్ చార్జీల పెంపునకు కారణమైందన్నారు. అయినా ప్రజలపై ఎలాంటి భారాలు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రెవెన్యూశాఖలో వైసీపీ ప్రభుత్వ హయాంలో రకరకాల కుంభకోణాలు జరిగాయని మండిపడ్డారు. భూ అక్రమాలకు పాల్పడిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని మంత్రి స్వామి వెల్లడించారు.

ఒకే వేదికపైకి తల్లిదండ్రులు, గురువులు

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులను ఎలా పర్యవేక్షించాలి, సెల్‌పోన్, టీవీలు, ట్యాబ్‌లు ఇతర సామాజిక మాధ్యమాల వినియోగంపై నియత్రణ ఎలా ఉండాలన్న అంశాలపై కూడా తల్లిదండ్రులతో చర్చించనున్నారు.

పండుగ వాతావరణంలో సమావేశాలు : కలెక్టర్

విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించడంతోపాటు పేరెంట్స్‌టీచర్ల మధ్య సంబంధాలను మరింత పెంచేందుకు శనివారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2,407 పాఠశాలల్లో చదువుతున్న 1,90,410 మంది విద్యార్థుల ఆసక్తి, ఆరోగ్య, విద్యా సంబంధ విషయాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఇస్తామన్నారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విలేకరుల సమావేశం లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఈవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముసురు పట్టి.. 'ముంచె'త్తి!

(5వ పేజీ తరువాయి)

నాట్లు ఇంచుమించు 50వేల ఎకరాల్లో నీటిలో ఉండిపోయాయి. అవన్నీ 15 రోజుల నుంచి 20 రోజుల లోపు వేసినవి కావడంతో ఉరకెత్తిపోయే ప్రమాదం ఉంది. ముదురు పొగ తోటలు, మిర్చి, వరి, కంది పైర్లకు కూడా అపార నష్టం వాటిల్లే అవకాశం కనిపిస్తోంది. వర్షం తెరపి ఇచ్చి కాస్తంత ఎండ వచ్చి భూమి ఆరేకొద్దీ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు, చెరువుల్లోకి నీటి ప్రవాహం పెరిగింది. పలుచోట్ల వాగులు పొంగి రవాణాకు కూడా ఆటంకం ఏర్పడింది.

అధ్వానంగా రోడ్లు, పారిశుధ్యం

గత వైసీపీ పాలనలో పట్టించుకోకపోవడంతో గోతులమయంగా మారి అంతంతమాత్రంగా ఉన్న పలు ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు తాజా వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. రాకపోకలకు జనం అవస్థ పడుతున్నారు. ఇక గ్రామాల్లో అంతర్గత రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ముసురు వర్షంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎటుచూసినా మురుగు కనిపిస్తోంది. దీంతో ఇప్పటికే ఉధృతంగా ఉన్న సీజనల్ వ్యాధుల దాడి మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు

దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తాం

మార్టూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవం సందర్భంగా గురువారం మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు నియోజకవర్గ అధ్యక్షుడు గద్దె అశోక్ అధ్యక్షత వహించారు. అనంతరం మరో ముఖ్య అతిథి మార్టూరు పట్టణ అధ్యక్షులు కామినేని జనార్దన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు పెన్షనును రెట్టింపు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో తొండెపు ఆదినారాయణ, నీలజోష్ బాబు, గోగిన ఆదిశేషు, షేక్ రహమాన్, షేక్ మున్నేపల్లి కాలేషావలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంగన్వాడీ సూపర్ వైజరు పద్మజ

పిల్లలను కేంద్రాలకు పంపించాలి

జె.పంగులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలలో బాలలకు అందించే విద్య ప్రాముఖ్యతను తల్లులు గుర్తించి రోజూ కేంద్రానికి పిల్లలను పంపించాలని ముప్పవరం అంగన్‌వాడీ సెక్టారు సూపర్ వైజర్ పద్మజ అన్నారు. గురువారం మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈడే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రంలో బాలలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీచర్లు శీలక్ష్మి, అనిత, పలువురు పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

నాడు వీఆర్వోల తప్పులు.. నేడు రైతులకు శాపాలు

» భూమి అనుభవంలో ఉన్న వారి స్థానంలో వేరే పేర్లు » నిజమైన లబ్ధిదారులకు ఆన్‌లైన్ చేయడంలో చిక్కులు
» ఏళ్ల తరబడి పరిష్కారం కాక ఇక్కట్లు » అవసరాలకు భూమి అమ్మినా స్వాధీనం చేయలేని పరిస్థితి

అద్దంకి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాటి వీఆర్వోలు చేసిన తప్పులు.. నేడు రైతులకు శాపంగా మారాయి. భూమి తమ ఆధీనంలో ఉన్నా... రెవెన్యూ రికార్డులలో మాత్రం వేరే రైతుల పేర్లు ఉండడంతో అసలు చిక్కు వచ్చింది. గతంలో కొందరు వీఆర్వోలు ఉద్దేశపూర్వకంగా .. మరి కొందరు పొరపాటున భూములను ఆన్‌లైన్ చేసే క్రమంలో అనుభవంలో ఉన్న రైతుల పేర్ల స్థానంలో వేరే రైతుల పేర్లను నమోదు చేశారు. ఎప్పుడో బ్యాంక్ రుణాలు అవసరమైనప్పుడో, అవసరాలకు భూమి వి క్రయించే క్రమంలో ఆన్‌లైన్‌లో చూసుకొని అవాక్కు అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆలస్యంగా మేల్కొన్న రైతులు హడావుడి పడుతున్నా పని జరగక ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. అద్దంకి మండలంలోనే సుమారు 25 నుంచి 30 మంది రైతులు ఈ సమస్యతో సతమతమవుతున్నారు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 100 మంది రైతులకు పైగానే ఉన్నట్లు అంచనా. అద్దంకి మండలంలోని చినకొత్తపల్లికి చెందిన మానం మురళీమోహన్‌దాస్ వెంపరాల రెవెన్యూ పరిధిలో దశాబ్ద కాలం కిందట ఎకరం భూమిని కొనుగోలు చేశారు. ఏడాది కిందట ఆ భూమిని వేరే వ్యక్తులకు అమ్మారు. తీరా ఆన్‌లైన్‌లో తన పేరుకు బదులు వేరే వారి పేర్లు ఉన్నాయి. దానిని మార్పు చేసేందుకు ఏడాదిగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇక కొంగపాడుకు చెందిన కమ్మ నాగేశ్వరరావు కు పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తి ఉంది. అయితే వైసీపీ పాలనలో ఓ నేత ఒత్తిడితో నాగేశ్వరరావుకు చెందిన భూమిలో కొంత భాగాన్ని వైసీపీ నేత సూచించిన వ్యక్తి పేరుతో అప్పటి వీఆర్వో ఆన్‌లైన్‌లో ఎక్కించారు. విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు ఇప్పటికే పదుల సంఖ్యలో అధికారులకు అర్జీలు ఇచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇలా భూ సమస్యలతో రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణ లు చేస్తూనే ఉన్నారు. అయితే జరిగిన తప్పులు, పొరపాట్లను రైతులకు రెవెన్యూ అధికారులు చెప్పకుండా కాలయాపన చేస్తున్నారు. ఆ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న రైతులు ఏమి చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు. రైతులు అర్జీలను తహసీల్దార్ కార్యాలయంలో అందిస్తే ఆన్‌లైన్‌లో పేరు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో పేరు ఉన్న రైతులు వచ్చి భూమి తమది కాదని తహసీల్దార్ సమక్షంలో సంతకాలు చేస్తే సదరు భూమిని అసలు రైతు పేరుతో తిరిగి ఆన్‌లైన్‌లో తహసీల్దార్ లాగిన్‌లో మార్పు చేస్తారు. అయితే అత్యధిక శాతం రైతులు మాత్రం భూమి తమది కాకపోయినా వచ్చి సంతకాలు చేసేందుకు ఇష్టపడడం లేదు. దీంతో సమస్య ఉత్పన్నమవుతోంది. అలాంటి పరిస్థితులలో ఆర్డీవో, జాయింట్ కలెక్టర్‌కు మాత్రమే అధికారం ఉంటుంది. ఆన్‌లైన్‌లో భూములు ఎక్కించిన తరువాత తొలగింపు, రైతుల పేర్లు మార్పు తహసీల్దార్ పరిధిలో లేకపోవడంతో ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంత దూరం రైతులు వెళ్లలేక, వెళ్లినా ఆలస్యం అయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి ప్రతి మండలంలో ప్రత్యేకంగా ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అదే సమయంలో ఉద్దేశపూర్వకంగా అధికారులు తప్పులు చేసినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో తప్పులు చేయకుండా ఉండే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఏడాదిగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదు



వెంపరాల రెవెన్యూ పరిధిలో గతంలో కొనుగోలు చేసిన ఎకరం భూమి ని కుటుంబ అవసరాల కోసం అమ్మాను. అయితే ఆన్‌లైన్‌లో వేరే రైతుల పేరుతో ఉన్నాయి. దీంతో ఇప్పటికీ పరిష్కారం కాక అమ్మిన భూమిని రిజిస్ట్రేషన్ చేసే వీలు లేకుండా పోయింది. తమ పరిధిలో లేనందున ఆర్డీవో వద్దకు వెళ్లమని చెప్తున్నారు.

- మానం మురళీమోహన్‌దాస్, రైతు, చినకొత్తపల్లి, అద్దంకి మండలం

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భూ ఆక్రమణల నిరోధానికి పటిష్టమైన చట్టాన్ని కూడా ప్రభుత్వం తెచ్చిందన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు గ్రామాల వారీ షెడ్యూల్ కూడా రూపొందించినందున స్థానికులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

మండలానికి ఒక నోడల్ అధికారి నియామకం : కలెక్టర్

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 826 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. వీటిల్లో రెవెన్యూ సదస్సుల కోసం తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒకటి, డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాస్థాయి అధికారులను కూడా మండలాలకు ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ రెవెన్యూ సదస్సులలో అర్జీలు ఇచ్చిన ప్రజలకు అప్పటికప్పుడే రసీదు ఇవ్వడంతోపాటు అదేరోజు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే విధంగా శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు. మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వాస్తవ అసైన్డ్‌దారులకు న్యాయం చేసేందుకు ఇది మంచి అవకాశమన్నారు. సత్వర నిర్ణయం తీసుకొని బాధితుల తరఫున నిలబడాలన్నారు. మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయ భూములు దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయ్యాయని సమావేశం దృష్టికి తెచ్చారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

అక్రమాలకు పాల్పడిన అధికారులను దూరంగా ఉంచాలి : ఎమ్మెల్యే ఉగ్ర

సమావేశంలో కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ గతంలో అవకతవకలకు పాల్పడిన అధికారులను ఈ రెవెన్యూ సదస్సులకు దూరంగా ఉంచాలన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు స్థానికంగా సదస్సులు జరిగే రోజు ఉపాధి హామీ పథకం పనులు నిర్వహించకుండా ప్రజలంతా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ వాస్తవ భూయజమానులకు, వాస్తవ అసైన్డ్‌దారులకు న్యాయం చేసేలా అధికారులు పనిచేయాలని కోరారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పుల్లలచెరువు మండలం మానేపల్లిలో కొండపోరంబోకు భూముల ఆక్రమణపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మేయర్ గంగాడ సుజాత, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.స్వరూప్ (టీడీపీ), డీఎస్ క్రాంతికుమార్ (వైసీపీ), బి.రాజశేఖర్ (బీజేపీ), రసూల్ (కాంగ్రెస్), సుదర్శనరావు (ఆప్), టి.వెంకటస్వామి (బీఎస్పీ)తో పాటు పలుశాఖల అధికారులు, రైతు సంఘాల నాయకులు, ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు వీరే..

జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులను పర్యవేక్షించేందుకు మండలానికి ఒక్కో నోడల్ అధికారిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు (అర్ధవీడు), గిద్దలూరు మునిసిపల్ కమిషనర్ డి.వెంకటదాసు (బేస్తవారపేట), డీఎస్‌వో పద్మశ్రీ (కంభం), సర్వే శాఖ ఏడీ గౌస్ బాషా (దోర్నాల), జడ్పీ సీఈవో బి.చిరంజీవి (గిద్దలూరు), జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు (కొమరోలు), మార్కాపురం మునిసిపల్ కమిషనర్ నారాయణరావు (మార్కాపురం), మార్కెటింగ్‌శాఖ ఏడీ ఉపేంద్ర (పెద్దారవీడు), వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌డీసీ శివరామిరెడ్డి (పుల్లలచెరువు), జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్ (రాచర్ల), విజిలెన్స్ ఎస్‌డీసీ ఎ.కుమార్ (తర్లుబాడు), ఏపీఎంఐపీ పీడీ రమణ (త్రిపురాంతకం)ను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

వీరితోపాటు మార్కాపురం ఎస్‌డీసీ సత్యనారాయణ (వైపాలెం), కేవోఆర్‌జీపీ ఎస్‌డీసీ సునీల్ కుమార్ (సీఎస్ పురం), హౌసింగ్ పీడీ పి.శ్రీనివాసప్రసాద్ (దర్శి), ఏపీఐఐసీ జీఎం మదన్‌మోహన్ (దొనకొండ), ఒంగోలు డీఆర్డీ ఏడీఏ వెంకటరావు (హెచ్‌ఎంపాడు), కనిగిరి ఏడీఏ రమణ (కనిగిరి), జిల్లా రిజిస్ట్రార్ ఎ.బాలాంజనేయులు (కొనకనమిట్ల), జిల్లా ఆడిట్ అధికారి ఎల్.శంకర నారాయణరెడ్డి (కురిచేడు), పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ రవి (మర్రిపూడి), కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రీదేవి (పీసీపల్లి), దేవదాయశాఖ ఏసీ పానకాలరావు (పామూరు), జిల్లా ఫైర్స్ అధికారి రాజశేఖర్ (పొదిలి), కనిగిరి డీఐవోఎస్ రాజేంద్రప్రసాద్ (పొన్నలూరు), బీపీసీఎల్ ఎస్‌డీసీ శ్రీదేవి (వెలిగండ్ల) ప్రత్యేకాధిరులుగా వ్యవహరిస్తారు.

డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ (చీమకుర్తి), ఒంగోలు డీఐవోఎస్‌లు ఎస్.శ్రీనివాసరావు (కొండపి), పరిశుద్ధరావు (కొత్తపట్నం), డీఆర్‌డీఏ పీడీ వసుంధర (మద్దిపాడు), మత్స్యశాఖ అధికారి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి (ముండ్లమూరు), జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.బేబిరాణి (నాగులుప్పలపాడు), ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు (ఒంగోలు), కేఆర్‌సీసీ ఎస్‌డీసీ ఎస్.వరకుమార్ (సంతనూతలపాడు), డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు (సింగరాయకొండ), సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ (టంగుటూరు), ఐసీడీఎస్ పీడీ ఎం.మాధురి (తాళ్లూరు), ఒంగోలు డీఐవోఎస్ యు.భాస్కర్(జరుగుమల్లి) ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.

జ్వర బాధితుల గుర్తింపునకు సర్వే

● డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామాల్లో జ్వర బాధితులను గుర్తించేందుకు ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'వామ్మో జ్వరం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె వివరణ ఇచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతలు ఫీవర్ సర్వేను నిర్వహించామని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 3,289 డెంగ్యూ అనుమానితులకు పరీక్ష చేయగా 326 మందికి పాజిటివ్ అని తేలిందన్నారు. మలేరియా కేసులు 23, గున్యా కేసులు ఏడు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆమె చెప్పారు.

కనులపండువగా అయ్యప్పస్వామి నగరోత్సవం

వేటపాలెం,చీరాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : అణుమల్లిపేటలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నగరోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రికి భిక్ష వితరణ జరిగింది. కార్యక్రమంలో దీక్షధారులు, భక్తులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకుడు మృతి

మార్టూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు దొడ్డా వీరబ్రహ్మానందం (75) అనారోగ్య కారణంగా గురువారం మధ్యాహ్నం విద్యానగర్‌లోని స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.ఆయన మృతదేహానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల బాపయ్యతోపాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్‌హెచ్ 216ను నాలుగులేన్ల రోడ్డుగా విస్తరించాలి

● కేంద్ర మంత్రికి ఎంపీ కృష్ణప్రసాద్ వినతి



కేంద్రమంత్రి గడ్కరీకి వినతిపత్రాన్ని అందిస్తున్న ఎంపీ

చీరాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీని బుధవారం ఢిల్లీలో లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్ కలసి వినతి పత్రం అందజేశారు. నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి అమరావతి ఓఆర్‌ఆర్‌కు ప్రత్యక్ష కనెక్టివిటీ, మచిలీపట్నం ఓడరేవు, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్, ఓడరేవు, చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమను ఎన్‌హెచ్ 16కు కలుపుతూ ఎన్‌హెచ్ 216ను నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరణ ఆవశ్యతను ఆ వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఎంపీ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

ఉప్పుగుండూరులో భారీగా రేషన్ బియ్యం పట్టివేత

● ఓ రైస్‌మిల్లుపై అధికారుల మెరుపు దాడి
● భారీగా దాచిన బియ్యం నిల్వలు
● సీజ్ చేసిన ఆర్డీవో లక్ష్మీప్రసన్న
● అర్ధరాత్రి వరకు కొనసాగిన సోదాలు



అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

నాగులుప్పలపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో భారీగా రేషన్ బియ్యాన్ని అధికారులు ఆకస్మికంగా దాడి పట్టుకున్నారు. గ్రామంలోని గంగమ్మ హోటల్ సెంటర్ వద్ద మట్టిగుంట రోడ్డులోని ఓ రైస్‌మిల్‌లో అక్రమంగా పెద్ద ఎత్తున దాచి ఉంచిన రేషన్ బియ్యం బస్తాలను ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది గురువారం అర్ధరాత్రి దాడులు చేసి స్వాధీనం చేసుకొన్నారు. రైస్ మిల్లు నిర్వాహకులు మిల్లు తాళాలు తీసేందుకు సహకరించకపోవడంతో రెవెన్యూ సిబ్బంది తాళాలు పగులగొట్టారు. అనంతరం ఆర్డీవో, ఇతర అధికారులు రైస్‌మిల్లులోని గదులలోకి ప్రవేశించారు. అక్కడ గోతాలు మార్చిని సుమారు 3వేలకు పైగా రేషన్ బియ్యం బస్తాలు నిల్వలు గుర్తించారు. మరో గదిలో పాలీష్ చేసి ఉంచిన లూజు బియ్యం నిల్వలను పరిశీలించి ఆర్డీవో సీజ్ చేశారు. సదరు రేషన్ మిల్లులో రేషన్‌బియ్యాన్ని పాలీష్ చేసి తరలిస్తున్నట్లుగా అధికారులు గుర్తించి అర్ధరాత్రి వరకు సోదాలు కొనసాగాయి. పట్టుబడిన బియ్యం విషయాన్ని కలెక్టర్‌కు సమాచారం అందించినట్లు ఆర్డీవో తెలిపారు.



రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

● తీవ్ర గాయాలతో మృత్యువుతో పోరాడుతున్న తల్లి
● ఆగి ఉన్న ట్రాక్టర్‌ను స్కూటర్‌తో ఢీకొనడంతో ఘటన



దక్షిణ బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదం దృశ్యం

ఒంగోలు(క్రైం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కూటర్‌పై ప్రయాణిస్తూ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతి చెందగా అతని తల్లి తీవ్ర గాయాలతో మృత్యువుతో పోరాడుతోంది. ఈ ఘటన ఒంగోలు నగరం దక్షిణ బైపాస్‌రోడ్డులో సంఘమిత్ర ఆసుపత్రి సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన పిల్లి కుశాల్ (18) ఒంగోలులోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో కుశాల్ తల్లి జ్యోతి ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. దీంతో ఇరువురు లింగంగుంట నుంచి కళాశాలకు స్కూటర్‌పై బయలుదేరారు. ఈక్రమంలో మార్గమధ్యలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఇటుకల లోడు ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో కుశాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. జ్యోతి తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న తాలుకా ఎస్ఐ కృష్ణపావని ఘటనా స్థలానికి చేరుకుని జ్యోతిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. అయితే ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే కుశాల్ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎర్రచందనంతో పట్టుబడ్డ స్మగ్లర్లు

18 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

గిద్దలూరుటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. ఇద్దరిని అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో డీఎస్పీ జి.బాలిరెడ్డి, కడప సబ్‌కంట్రోల్ ఆర్ఐ చిరంజీవి, ఆర్ఎస్ఐ పి.నరేష్‌లలు గిద్దలూరు డివిజన్ చింతలపల్లె ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. కనుమబావి రస్తా వద్ద కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారు పారిపోతుండగా, ఇద్దరు పట్టుబడ్డారు. ఆ సమీపంలో తనిఖీ చేయగా 18 ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగలతోపాటు ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ అధికారులు పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

మద్దిపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై బుధవారం అర్ధరాత్రి వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అయితే అతని తలపై నుంచి వాహనం టైర్లు వెళ్లడంతో గుర్తించలేని విధంగా ముఖం నుజ్జునుజ్జుగా మారింది. మద్దిపాడు పోలీసులు మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కాగా మృతుడి జేబులో ఉన్న పెన్‌డ్రైవ్‌ను పోలీసులు పరిశీలించగా రెండు ఫొటోలు లభించాయి. ఇందులో ఒకటి యూరో స్కూలుకు చెందిన పాప ఫొటో కాగా, మరొకటి పెళ్లి జరిగిన ఫొటో ఉంది. అయితే మృతుడు ఐదు అడుగులు ఎత్తు, నల్లప్యాంటు, నల్ల టీ షర్టు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎవరైనా తమ బంధువులు తప్పిపోతే వారు రిమ్స్‌లో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి నిర్ధారించుకోవాలని పోలీసులు కోరారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కారు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని గుండ్లాపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగింది. అన్నంగి గ్రామానికి చెందిన రామారావు వెల్లంపల్లిలోని సిమెంటు పైపుల కంపెనీలో పని చేస్తున్నాడు. ఆయన ఫ్యాక్టరీ నుంచి గుండ్లాపల్లి వైపు బైకుపై ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో రామారావుకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

హత్యా.. ప్రమాదమా?

» అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తి మృతి
» విజయనగర్ కాలనీ వద్ద కాలువలో మృతదేహం

చీరాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయగనర్ కాలనీ సమీపంలోని ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కన్పించింది. అయితే తూటికాడకు ఇరుక్కుని మృతదేహం నీళ్లపై తేలియాడుతుండడం గమనించిన స్థానికులు ఈపూరుపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై చంద్రశేఖర్ చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరి యా వైద్యశాలకు తరలించారు. అతని తలకు బలమైన రక్త గాయం ఉంది. ఈక్రమంలో ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ కదిలే రైలులో ప్రయాణిస్తు ప్రమాదవశాత్తు జారిపడ్డాడా? లేక ఎవరైనా హతమార్చి కాలువలో పడివేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నాలుగు రోజుల కిందట ఈ ఘటన జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. అతని వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చినగంజాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన వివరాల మేరకు.. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని లారీ ఆటోని ఢీకొట్టింది. ఈ సంఘటనలో 7 గురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని క్రిస్టియన్‌పేటకు చెందిన రేపూరి సుమలత (37)కు తీవ్రగాయాలు కావడంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో సుమలత చికిత్స పొందుతూ గురువారం వేకువజామున మృతి చెందింది. గుంజి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన షేక్ మస్తానీ పరిస్థితి విషమం ఉంది.

జీవనం కోల్పోయిన కుటుంబం

రోడ్డు ప్రమాదంలో సుమలత మృతి చెందడంతో కుటుంబం జీవనాధారం కోల్పోయింది. సుమలతకు భర్త పీటర్‌పాల్, ముగ్గురు కుమారులు ఉన్నారు. పీటర్‌పాల్ పెయింటర్‌గా పనిచేస్తుండగా, సుమలత రొయ్యల ఫ్యాక్టరీలో పనికి వెళ్తుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్దకుమారుడు జైశంకర్‌బాబు డిగ్రీ మొదటి సంవత్సరం, రెండవకుమారుడు జగదీష్‌బాబు ఇంటర్, మూడవ కుమారుడు పదో తరగతి చదువుతున్నారు. భార్య మృతితో కుటుంబ పోషణ ఎలా అని భర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనిగిరిలో గురువారం కుండపోత వర్షం కురిసింది. పట్టణంలోకి వచ్చే నాలుగు ప్రధానమార్గాల్లో ఉన్న వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. కొత్తూరు అభయాంజనేయ స్వామి దేవాలయం సమీపంలోని వాగు చప్టాపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. బైక్‌పై వెళుతున్న ఇద్దరు వరద ధాటికి కొట్టుకుపోతుండగా వాహనాన్ని వదిలేసి ప్రాణాలను కాపాడుకున్నారు. హైదరాబాద్, బెంగళూరులాంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయివేటు, ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులు వేకువజామునుంచి పామూరు రోడ్డులోని కొత్తూరు వద్ద నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గొల్లపల్లి రిజర్వాయర్ నిండి తూమునుంచి నీరు బయటికి వస్తోంది. దీంతో కరకట్టకు ప్రమాదం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఫలితంగా తమ పొలాలు మునిగిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఆర్టీసీ డిపో డౌన్ వద్ద వరద నీరు చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

కనిగిరిలో కుండపోత

- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- రాకపోకలకు అంతరాయం
- మెట్టపైర్లను ముంచెత్తిన వర్షం
- శివారు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే
- సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు, ఇరిగేషన్ అధికారులు

కనిగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుండపోత వర్షాలతో రెండు దశాబ్దాల తర్వాత కనిగిరి పెద్దచెరువుకు నీరు చేరింది. పెద్దచెరువు పైనుంచి నిర్మాణం చేపట్టే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులకు ఆటంకం ఏర్పడింది. చేపట్టిన పనుల గుంతల్లోకి వరద నీరు చేరింది. దీంతో కాంట్రాక్టర్ వరద నీటికి ఎక్స్‌కవేటర్ ద్వారా కట్టవేసి చెరువుకు మళ్లించే ఏర్పాటు చేశారు. నాగులచెరువుకు వర్షపునీరు చేరి జలకళ సంతరించుకుంది. నాగులచెరువును ఆనుకుని ఉన్న ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి. కాశీనాయన గుడి చుట్టుపక్కల ఇళ్లను ముంచెత్తాయి. కనిగిరిలో డ్రైనేజీలన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. పట్టణంలోని బోయపాలెం, పాతూరు, కాశీనాయనగుడి, ఎన్జీవో కాలనీ, తదితర ప్రాంతాల్లోకి కొండవాగుల నుంచి వరద నీరు ఇళ్లను, రోడ్లను ముంచెత్తింది. కనిగిరి దొరువు వర్షపు నీటితో నిండిపోయి సమీప ఇళ్లలోకి చేరింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పర్యటన

వరద నీరు ముంచెత్తిన శివారు కాలనీలైన ఎన్జీవో కాలనీ, శివనగర్ కాలనీ, కాశినాయనగుడి ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. కొండ, వాగు, చెరువు ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇకనుంచి కనిగిరిలో అక్రమ వెంచర్లకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు అధైర్య పడొద్దని, ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటానని చెప్పారు. కొత్తూరు వాగు ఉధృతిని పరిశీలించారు. కనిగిరి పెద్దచెరువు, నాగులుచెరువు ప్రాంతాలను పరిశీలించారు. చెరువుల కరకట్టలను సంరక్షించి నీరు పోకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

కొత్తూరు చప్టాపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించటంతో సీఐ ఖాజావలి, ఎస్ఐ టి.శ్రీరాం, మాధవరావు, పోలీసు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రయాణికులను ఎక్స్‌కవేటర్‌ల ద్వారా చేరవేశారు. ఇరిగేషన్ అధికారులు గొల్లపల్లి రిజర్వాయర్ తూము కట్టలను సంరక్షించే ఏర్పాట్లు చేపట్టారు.



మెట్టపైర్లను ముంచెత్తిన వాన

కనిగిరి ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో వేసిన మెట్ట పైర్లు వర్షంతో మునిగిపోయాయి. ఇప్పటివరకు ఆశాజనకంగా ఉన్న పొగాకు తోటల్లోకి నీరు చేరడంతో మొక్కలు నీట మునిగాయి. రెండు రోజుల క్రితం సాధారణ జల్లులతో వేసిన పొగాకు నారు కుళ్లిపోయి నష్టం వాటిల్లింది. వేరుశనగ, పప్పుశనగ, మినుము, బొబ్బర పంటలన్నీ నీట మునిగాయి. కంది చేలల్లోకి వర్షపు నీరు చేరి ఉరకెత్తటంతో పాటు పూతంతా రాలిపోయింది. వరి చేలల్లోకి మోకాలు లోతు నీరు చేరింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


భారీ వర్షానికి నేలకొరిగిన కంది చేను


నాగులచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి (ఇన్‌సెట్లో) పాతూరు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



రీజినల్ పాలిటెక్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న మంత్రి స్వామి, వేదికపై మారిటోరియం బోర్డు చైర్మన్ సత్య, మేయర్ గంగాడ సుజాత తదితరులు

యువత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

మంత్రి స్వామి
ఒంగోలులో ఘనంగా పాలిటెక్ ఫెస్ట్
ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టులు

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని దామచర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన రీజనల్ పాలిటెక్ ఫెస్ట్-2024 కార్యక్రమాన్ని మంత్రి స్వామి, ఆంధ్రప్రదేశ్ మారటోరియం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రీజనల్ పాలిటెక్ ఫెస్ట్ ద్వారా విద్యార్థుల సృజనాత్మకతతో ఆలోచనలకు అనుగుణంగా వివిధ ప్రాజెక్టులను ఆచరణ రూపంలోకి తీసుకురావడం ఎంతో సంతోషమన్నారు. జిల్లాలో విద్యా రంగానికి, కళాశాలల స్థాపనలకు మాజీ మంత్రి, కీర్తిశేషులు దామచర్ల ఆంజనేయులు చేసిన కృషి ఎనలేనిదన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ లేని రంగం లేదని, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి ప్రభుత్వ శాఖకు సాంకేతికతను జోడించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అనిఅన్నారు. వ్యవసాయరంగంలో కూడా సాంకేతికతను అభివృద్ధి పరిచి డ్రోన్‌ల సహాయంతో పురుగు మందులవాడకం, వరదలు, తుపాను సమయాల్లో పంట నష్టం , వాటి వివరాలు సేకరించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమ ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే ఉపాధి రంగాల్లో మంచి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆదిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. స్వయం ఉపాధి కల్పించేది పాలిటెక్నిక్ విద్య అని మంత్రి అన్నారు. నేడు సమాజానికి, ప్రజలకు ఉపయోగపడేలా స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంతో ప్రతి విద్యార్థి మంచి ప్రాజెక్టుల రూపకల్పనకు కృషి చేయాలన్నారు. స్వయం ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాటు దామచర్ల పాలిటెక్నిక్ కొన్ని కోర్సులు కావాలని కోరడం జరిగిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అదనపు కోర్సులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థి దశ నుంచే వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ముందుకెళ్లాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. మారటోరియం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మంచి వాతావరణంలో కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన భవనం, వసతులు, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నేటి యువత జీవితాన్ని నిర్దిష్ట లక్ష్యంతో ముందుకెళ్లాలని, విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అతిథులు ప్రదర్శనలో ఉంచిన ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ జేడీ పద్మారావు, డీఏ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్. శివప్రసాద్, కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు, వివిధ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలోచనలకు అర్థం చెప్పారు..!

- సృజనాత్మకతను ప్రదర్శించిన విద్యార్థులు
- పాలిటెక్ ఫెస్ట్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులంటే కళాశాల కబుర్లు.. పాఠ్య పుస్తకాలతో కుస్తీలు.. కాసేపు స్నేహితులతో సరదాలు.. కుదిరితో ఇష్టమైన హీరో సినిమా చూసేందుకు పరుగులు. ఇదీ నేటి కాలంలో కాలేజి విద్యార్థుల లైఫ్ స్టైల్ అయితే అందులోనూ కొందరు విద్యార్థులు చదువుకుంటూనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకున్నారు. తమలో దాగి ఉన్న ఆలోచనలకు పదును పెట్టారు. సృజనాత్మకతను వెలికితీసి ఆచరణలో చేసి చూపించారు. యువ శాస్త్రవేత్తలుగా మారిన పాలిటెక్నిక్ విద్యార్థులు పలు రకాల ప్రాజెక్టులతో అందరినీ ఆకట్టుకున్నారు. ఒంగోలులోని దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి ఫెస్ట్ ఘనంగా ప్రారంభం అయింది. ఈ సందర్భంగా జిల్లాలోని 13 పాలిటెక్నిక్ కాలేజీల నుంచి మూడు వందల మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరై 72 ప్రాజెక్టులను ప్రదర్శించారు.


ప్రదర్శనలను తిలకిస్తున్న విద్యార్థులు

వ్యర్థాలతో విద్యుత్, బయోగ్యాస్..

ఒంగోలు నగరంలో ప్రతి రోజూ 126 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, వాటి నుంచి విద్యుత్, బయో గ్యాస్ ఉత్పత్తి తయారు చేసేలా రూపొందించిన ప్రాజెక్టు ఆకట్టుకుంది. సతీష్, గణేష్, గోపీనాథ్‌లు తడి, పొడి చెత్తను వేరు చేసి, పొడి చెత్తతో విద్యుత్ ఉత్పత్తి, తడి చెత్తతో బయోగ్యాస్ చేసేలా తయారు చేశారు. దీని ద్వారా నగరాలు మరింత అభివృద్ధిచెందుతాయని వారు వెల్లడించారు.

- దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజి విద్యార్థులు



స్మార్ట్‌తో మరింత ప్రయోజనం

నేడు అంతా డిజిటల్ యుగంగా మారింది. అన్నింటికీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. అందుకోసం స్మార్ట్ వాతావారణ కాలుష్యం, సేఫ్టీ ట్రాఫిక్, డిజిటల్ హెల్త్, స్మార్ట్ హోమ్, స్ట్రీట్ లైటింగ్, వ్యర్థాల సేకరణ అంతా స్మార్ట్‌గా మార్చుకోవచ్చని యశశ్విని, రేష్మిత, లికిత, మేర్సిరాణి తెలిపారు. తద్వారా సమయంతోపాటు, డబ్బు కూడా ఆదా అవుతుందని, రాబోయే రోజుల్లో స్మార్ట్ విధానంతో మరింత ప్రయోజనం ఉంటుందని వివరించారు.

- యశశ్వని, రేష్మిత, లికిత, మేర్సి రాణీ, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ పాలిటెక్నిక్



వ్యవసాయంలో ఆధునికత

వ్యవసాయంలోనూ పోటీతత్వం పెంచేలా ప్రాజెక్టు రూపొందించామని సామ్యేల్ జార్జి పాలిటెక్నిక్ కాలేజి విద్యార్థులు వెల్లడిస్తున్నారు. ఐఓటీ బేస్డ్ విధానం ద్వారా భూమిలో తేమ, సెన్సార్ లైటింగ్, విత్తనాలు చల్లడం, మందులు వేయడం, కోత యంత్రాలను సైతం ఆధునిక యంత్ర పరికరాలతో చేయడం ద్వారా ధాన్యం నిల్వల కెపాసిటీని తెలియజేస్తుంది. దీంతో సమయం ఆదా సులభతరం వ్యవసాయం అందించవచ్చని అచ్యుత నారాయణ, శ్రీవాణి, లోహిత, రాజేష్‌లు వెల్లడిస్తున్నారు.


- అచ్యుత నారాయణ, శ్రీవాణి, లోహిత, రాజేష్, సామ్యూల్ జార్జ్ పాలిటెక్నిక్ కాలేజ్, మార్కాపురం

కాయిన్ బేస్డ్-చార్జర్

కాయిన్ బేస్డ్ చార్జర్ విధానంతో మొబైల్‌చార్జింగ్ భవిష్యత్‌లో అందుబాటులోకి వస్తుందని పేస్ పాలిటెక్నిక్ కాలేజి విద్యార్థులు వెల్లడిస్తున్నారు. దీని ద్వారా కాయిన్ బరువును బట్టి మొబైల్ చార్జర్ పర్సంటేజ్ పెరుగుతుంది. అలాగే ఇతరత్రా చార్జింగ్ పరికరాలకు ఈ విధానం ద్వారా మరింత ఉపయోగంగా ఉంటుందని వెల్లడిస్తున్నారు. అయితే బరువు ఆధారంగా చార్జింగ్ పెట్టే విధానం అమలులోకి వస్తే ఉపాధి కూడా లభిస్తుందని వీరు వెల్లడిస్తున్నారు.

- జాఫర్, కరీముద్దీన్, వైష్ణవి, యమున, పేస్ పాలిటెక్నిక్ కాలేజ్, వల్లూరు



దివ్యాంగుల కోసం పరికరం



పెడల్ యాక్సా ద్వారా చేతులు లేని వారు సైతం వడ్రంగి వృత్తి పనుల్లో కాళ్లతో సులువుగా వడ్రంగి పనిచేసుకోవచ్చు. అంతే కాకుండా సాధారణమైన వ్యక్తులు కూడా ఈ పెడల్ యాక్సా ద్వారా పనిచేయడం వలన వ్యాయామం చేసినట్లుగా ఉంటుంది. ఒకరకంగా ఇది మల్టీబుల్ విధానం అందరికీ సులువైన మార్గం. చేతులతో పనిలేకుండా కాళ్లతో సులువగా చేసుకోవచ్చు. ఈ విధానం అమలులోకి వస్తే అటు వికలాంగులకు, ఇటు సామాన్య ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ మెకానికల్ విద్యార్థులు వెల్లడిస్తున్నారు.

- వరుణ్, మోహన్, లోకేష్, ప్రేమ్‌కుమార్, వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ పాలిటెక్నిక్, చీరాల

ఆధునిక ఫ్లోర్ క్లీనర్

నేడు ప్రతి ఇంటిలో, ఆఫీస్, ఇతర వ్యాపార సంస్థల్లో శుభ్రత ప్రాముఖ్యమైనది. అయితే ఆధునిక ఫ్లోర్ క్లీనర్ ద్వారా చెత్తను అదే సేకరించడంతోపాటు, అవసరమైతే అక్కడే మిగిలిపోయిన చెత్త ఉన్నట్లయితే సెన్సార్ విధానం ద్వారా తెలియజేసేలా అలారం మోగుతుంది. ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీని వలన ఇంటిలో మహిళలు మరింత సులభంగా, శ్రమలేకుండా పనిచేసుకోవచ్చు. వృద్ధులు, పిల్లలు కూడా ఈ మిషిన్‌తో పనిచేసుకునే వీలు ఉంటుందని విద్యార్థినులు వెల్లడిస్తున్నారు.


- జ్ఞానేశ్వరి, సీహెచ్. కరుణశ్రీ, బి. హర్షిత, జి.శివహర్షిణి, సెయింట్ ఆన్స్ పాలిటెక్నిక్ కాలేజ్, చీరాల

గృహాలకు కలుషిత నీరు పరఫరా

● ఇబ్బందిపడుతున్న ప్రజలు



గృహాలకు వస్తున్న కలుషితనీరు

ఒంగోలు(రూరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులో గల పలు కాలనీలకు సరఫరా చేస్తున్న నీరు కలుషితంగా ఉంటోంది. పైపులైన్ల ద్వారా వచ్చే నీరు మట్టిరంగులో ఉండటంతో ప్రజలు ఆ నీటిని వాడుకోలేని పరిస్థితి ఏర్పడింది. పది రోజుల క్రితం పైపులైన్‌ల మరమ్మతుల కోసం కుళాయిలకు నీటిసరఫరాను కార్పొరేషన్ అధికారులు నిలుపుదల చేశారు. ఈక్రమలో పైపులైన్‌ల పనులు పూర్తి చేశారు. కానీ పలు కాలనీలకు మాత్రం నీటిసరఫరా జరగటం లేదు. కొన్ని ప్రాంతాలకు వస్తున్న నీరు మట్టి వాసనతో ఎర్రగా ఉండటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టిలో మాణిక్యాలు ఏకేయూ క్రీడాకారులు : వీసీ



మహేష్‌ను అభినందిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు విద్య, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మట్టిలో మాణిక్యాలు ఆంధ్ర కేసరి యూనివర్శిటీ క్రీడాకారులని వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. స్థానిక యూనివర్శిటీ సెమినార్‌లో గురువారం సాయంత్రం జరిగిన సన్మాన సభకు ఫిజికల్ ఎడ్యుకేటర్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఐ.దేవీవరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ డిగ్రీ కళాశాల విద్యార్థి మహేష్ సౌత్, వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్యపతకం సాధించడంతో ఘనంగా సత్కరించారు. మహేష్ భవిష్యత్తులో జాతీయస్థాయిలో రాణించాలని వీసీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, కోచ్ శేషగిరిరావు, బెల్లంకొండ విద్యా సంస్థల అధినేత మద్దుల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గంటా సాయి సురేష్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు అడపాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగతోటలలో వర్షపు నీరు



ఒంగోలు సమీపంలోని పొలాల్లో చేరిన నీరు

ఒంగోలు(రూరల్), డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో సాగు చేసిన పొగతోటలలో వర్షపు నీరు వచ్చి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో లోతట్టు పొగాకు తోటలు జలమయం అయ్యి మొక్కలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఈ పొగాకు వేలంకేంద్రం పరిధిలో సుమారుగా 80హెక్టారులలో లోతట్టు పొలాలలో సాగు చేసిన పొగాకు పంట దెబ్బతినే పరిస్థితి నెలకొందని వేలం నిర్వహణాధికారి సత్యశ్రీనివాస్ గురువారం తెలిపారు. అందువల్ల రైతులు చేలల్లోని నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని చెబుతున్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

● ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ



మాట్లాడుతున్న రాహుల్‌దేవ్‌శర్మ

ఒంగోలు(క్రైం), డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా విక్రయాలు జరగకుండా ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గల గెలాక్సీభవన్‌లో గురువారం ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎక్సైజ్‌శాఖ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ నాటుసారా, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. మద్యం షాపులలో ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా చూడాలని కోరారు. పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీసీ కె.హేమంతనాగరాజు, ఏసీ కె.విజయ, ఎస్‌టీఎఫ్ విజయవాడ ఏసీ సుధాకరరెడ్డి, అధికారులు ఖాజామోహిద్దీన్, జి.దేవదత్తు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాఉత్సవ్ పోటీలు





మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్బారావు, నృత్యం చేస్తున్న విద్యార్థిని

సంతనూతలపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో కళాఉత్సవ్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన నాటక కళ, సంప్రదాయనృత్యం, దృశ్యకళలు వంటి వాటిని తొలి రోజు విద్యార్థులు అభినయించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా మురళీక్రిష్ణ, మల్లికార్జున, మాధవీలతలు వ్యవహరించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి



మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతి మూడేళ్లకోసారి తమ పొలాల్లోని మట్టిని పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూమిలోని లోపాలను గుర్తించి సరి చేసుకోవచ్చని ఏవో వెంకట్రావు సూచించారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా మద్దిరాలపాడులో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటలు బాగా పండి అధిక దిగుబడులు సాధించాలంటే నేల స్వభావం ప్రధానమన్నారు. అందుకోసం తమ వ్యవసాయ భూములను సారవంతంగా మార్చుకోవాలని చెప్పారు. భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువులతో భూసారాన్ని పెంపొందించుకోవచ్చని చెప్పారు. రసాయన ఎరువులతో భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు. తొలకరి వర్షాలు పడిన వెంటనే పచ్చిరొట్ట ఎరువులైన జనుము,జీలుగ, పిల్లిపెసర సాగు చేసి కలియదున్నాలని సూచించారు. ఇటీవల భూసార పరీక్ష లు చేయించుకొన్న రైతులకు ఫలితాల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..

మద్దిపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో గురువారం కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. గ్రామంలో ప్రధాన వీధుల వెంట డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచి తటాకాలను తలిపిస్తున్నాయి. ఇస్లాంపేట, వైపాలెం, ఎస్సీకాలనీ తదితర ప్రాంతాలు, ప్రధాన జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లపై వర్షపు నీరు మూడు అడుగుల మేర చేరింది. అలాగే మండల పరిషత్ కార్యాలయం ఆవరణం జలమయం అయ్యింది. దీంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు హాజరయ్యే ఉద్యోగులు ఇబ్బందిపడ్డారు.



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపునీరు



గాంధీరోడ్డులో నిలిచిన వర్షపునీరు



చెరువులా మారిన రహదారి

ఒంగోలులో కుండపోత !

● నగర వీధులన్నీ జలమయం

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వానకు తడిసి ముద్దయ్యింది. ప్రధాన వీధుల్లో వర్షం నీరు ఏరులై పారాయి. శివారు కాలనీలు చెరువులను తలపించాయి. దీంతో వంటవారికాలనీ, నెహ్రూ కాలనీ, బిలాల్ నగర్, నేతాజీకాలనీలలో పలు గృహాలు నీరు నిలిచి ఉండటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రగతిభవన్, ఇరిగేషన్ ఆఫీస్, భాగ్యనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో నీరు నిలిచి వాహన రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఉదయం 9-30 గంటల నుంచి మొదలైన వాన 10-30 వరకు దంచికొట్టింది. ఆ తర్వాత కొంతమేర తెరపించినా, సాయంత్ర 7గంటల సమయంలో గంటసేపు కురిసిన కుండపోతకు నగరమంతా జలమయం అయింది. ఉదయం ఓ గంటసేపు కురిసిన వాన తర్వాత తెరపించగా, సాయంత్రం 7గంటల నుంచి గంటసేపు కుండపోత వానకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, నగర ప్రధాన రహదారుల్లో మోకాళ్ళ లోతున నీరు నిలబడి చెరువులను తలపించాయి. భాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరుపోయే మార్గం లేకపోవడంతో పరిస్థితి మరింత జఠిలమైంది. ఇదిలా ఉండగా దారావారితోట, దేవుడు చెరువు, శర్మాకళాశాల, బాపూజీమార్కెట్ కాంప్లెక్స్ ఆర్టీసీ డిపో ఆవరణం, ఏకలవ్యనగర్, మస్తాన్‌దర్గా సెంటర్‌లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

విధుల్లో ఉన్నా చార్జిమెమోలు ఇస్తున్నారు

● కలెక్టర్‌కు వీఆర్వోల సంఘం ఫిర్యాదు



కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో పనిచేసే గ్రామ రెవెన్యూ అధికారులకు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు చార్జి మెమోలు ఇస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వైపీ.రంగయ్య, ఏసీ.ఆదిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులో కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఇటీవల పామూరు పంచాయతీ కార్యదర్శి మెమో ఇచ్చిన అంశంతో పాటు జిల్లాలో పలు మండలాల్లో వివిధ హోదాల్లో వీఆర్వోలకు ఇచ్చిన మెమోల అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. జిల్లాలో వీఆర్వోలు అనేక రకాల విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని రకాల పనులను సకాలంలో చేస్తున్నా తమపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏకరువు పెట్టారు. వీఆర్వోలను రెవెన్యూ పరమైన విధులకే పరిమితం చేయాలని కోరారు. ప్రధానంగా పంచాయతీరాజ్, మునిసిపల్‌శాఖ నిర్వహించే వివిధ సర్వేల నుంచి వీఆర్వోలను మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా అంశాలపై స్పందించిన కలెక్టర్, వెంటనే జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవితో ఫోన్‌లో మాట్లాడారు. వీఆర్వోలకు ఎంపీడీవోలు నోటీసులు ఇచ్చే అంశంపై మాట్లాడారు. ఇటువంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయా అంశాలపై జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కె.జానయ్య, వెంకట రామయ్య, సురేష్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా హైకమిషన్ సభ్యులతో మాగుంట భేటీ



ఆస్ట్రేలియా హైకమిషన్ ప్రతినిధులతో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా హై కమిషన్ ప్రతినిధులతో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యులు భేటీ అయ్యారు. గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ సభ్యులతో కలిసి ఆస్ట్రేలియాహై కమిషన్ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన పలువురు టీడీపీ పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల పరిరక్షణపై ప్రశ్న

దేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అంతరించిపోతున్న వన్యప్రాణులు, అరణ్యాల రక్షణ, వాటి నివాసాల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర పర్యావరణశాఖ సహాయక మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ సమాధానం ఇస్తూ వన్యప్రాణుల రక్షణ చట్టం 1972 కింద అంతరించిపోతున్న వన్యప్రాణుల రక్షణ, పరిరక్షణకు జాతీయ ప్రకృతి ఉద్యానవనాలు, అభయారణ్యాలు, పరిరక్షణ కేంద్రాలు తదితర రక్షిత ప్రాంతాలను ప్రభుత్వం సృష్టిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 2020-21నుంచి 2024-25 వరకు రాష్ట్రంలోని రాజమండ్రి, కర్నూలు, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో అంతరించిపోతున్న 18 జాతుల వేట, అక్రమ వ్యాపారం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా 3,682 పులులు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 63, అలాగే 13,874 చిరుత పులులు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 569 ఉన్నాయని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

హమ్మయ్యా అనుకుంటే.. వర్షం ముంచింది!

● తుఫాన్ పోయాక కురిసిన భారీ వర్షం

● వర్షపు నీటిలో శనగ, పొగాకు పంటలు

● పల్లపు పొలాల్లో కదలని నీరు

● నిండిన పలు కుంటలు



కొండపిలో శనగ చేలోకి చేరిన వర్షపునీరు

కొండపి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొండపి ప్రాంతంలో బుధవారం రాత్రి, గురువారం వేకువ జాము నుంచి కురిసిన భారీ వర్షంతో పొగాకు, శనగ పంటలు నీటమునిగాయి. ఫెంగల్ తుఫాన్ పోయిందని తేరుకునేలోపు మళ్లీ కురిసిన వర్షం రైతులను నానా ఇబ్బందులు పెడుతోంది. ప్రస్తుత వర్షంతో కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు, టంగుటూరు మండలాల్లో పొలాలు కుంటలను తలపిస్తోంది. ఇప్పటికే పొలాల్లో తేమశాతం అధికంగా ఉంది. తాజా వర్షంతో పొగ మొక్కలు, శనగ నీటిలో మునిగిపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. వాతావరణం కూడా ఎండ లేకుండా మబ్బులు పట్టి ఉండటంతో నీరు, తేమ అధికమై పొలాల్లోకి కాలుపెట్టే వీలు లేదని వాపోతున్నారు. పొలాల నుంచి నీటిని వెలుపలకు పంపే కార్యక్రమాలు కూడా సాగడం లేదని చెబుతున్నారు. పల్లపు ప్రాంతాల్లోకి చేరిన వర్షపు నీరు కొంత సమయం గడిస్తేగాని ఆరిపోదని అప్పటికీ పొగామొక్కలు, శనగ మొక్కలు కుళ్లిపోతాయని ఆవేదన చెందుతున్నారు.

వేలంకేంద్రం సిబ్బంది పర్యటన

కొండపి పొగాకు వేలం కేంద్రం వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ కొండపి మండలంలోని పెట్లూరు, కోయవారిపాలెం, జాళ్లపాలెం, పెదకండ్లగుంట, పెరిదేపి, ముప్పవరం మర్రిపూడి మండలంలోని ధర్మవరం, జువ్విగుంట గ్రామాల్లో పర్యటించారు. పొగాకులో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని రైతులకు సూచనలు చేశారు. క్యూరింగ్‌లో ఉన్న పొగాకును, పొగాకు తోటలను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్ల పరిశీలన



మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, ఎన్ఆర్ఐ రాఘవేంద్రప్రసాద్

సంతనూతలపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని జడ్పీ హైస్కూలులో ఈనెల7వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల కబడ్డీ పోటీల ఏర్పాట్లను కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, సూదనగుంట ఫౌండేషన్ నిర్వాహకులు ఎన్ఆర్ఐ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు మాట్లాడుతూ ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడల ప్రారంభోత్సవానికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, తేనేటి క్రిష్ణప్రసాద్, సినీ నటుడు మురళీమోహన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సూదనగుంట క్రిష్ణమూర్తి, వేణుబాబు, కబడ్డీ అసోసియేషన్ నాయకులు చంద్రశేఖరరెడ్డి, ఎస్.రంగరావు, నిర్వాహకబృందం పాల్గొన్నారు.

నగరంలో భారీ చోరీ

● రూ.15 లక్షల సొత్తు అపహరణ

ఒంగోలు(క్రైం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో భారీ చోరీ జరిగింది. సుమారు రూ.15 లక్షల సొత్తును అపహరించారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక అన్నవరప్పాడు మొదటి లైన్‌లో నివాసం ఉంటున్న సూరేపల్లి వెలుగొండరావు ఇంటికి తాళం వేసి బయలకు వెళ్లారు. దీంతో బుధవారం రాత్రి దొంగలు ఇంటి తాళాన్ని బ్లేడుతో కోసి లోపలికి చొరబడ్డారు. బీరువా పగులగొట్టి సుమారు 200 గ్రాముల బంగారం, 5 కిలోల వెండి, రూ.1.5లక్షలు నగదు దొంగలు తస్కరించారు. వాటి విలువ సుమారు రూ.15 లక్షలు విలువ ఉంటుందని టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తెలిపారు. బాధితుడు వెలుగొండరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

జిల్లాలో 17.2 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 17.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కనిగిరి మండలంలో అత్యధికంగా 130.2 మి.మీ, అత్యల్పంగా మార్కాపురం మండలంలో 1.2 మి.మీ వర్షం కురిసింది. ఇక హనుమంతునిపాడు 93.0, కొండపి 46.8, పీసీపల్లి 46.4, టంగుటూరు 38.4, సీఎస్‌పురం 34.2, గిద్దలూరు 31.2, వెలిగండ్ల 27.6, పామూరు 26.4, రాచర్ల 25.6, కొమరోలు 24.2, పుల్లలచెరువు 20.0, సంతనూతలపాడు 14,4, కొత్తపట్నం 14.4, పొన్నలూరు 14.4, తాళ్లూరు 13.4, మర్రిపూడి 12.4, సింగరాయకొండ 12.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా మరో ఏడెనిమిది మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

నాగులుప్పలపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామపభలను నిర్వహిస్తుందని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. 6న బి.నిడమానూరు, 7న హనుమాపురం, కావూరివారిపాలెం, 9న పోతవరం, 10న నాగులుప్పలపాడు, 11న ఓబన్నపాలెం, 12న మాచవరం, 13న కనపర్తి, 16న వినోదరాయునిపాలెం, దాసరివారిపాలెం, 17న కుక్కలవారిపాలెం, చిన్నంగారిపట్టపుపాలెం, 18న అమ్మనబ్రోలు, 19న చీర్వానుప్పలపాడు, టి.అగ్రహారం, 20న చదలవాడ, కేసినేనివారిపాలెం, 21న తిమ్మసముద్రం, 23న ఉప్పుగుండూరు, 24న ఈదుమూడి, 26న మట్టిగుంట, 27న మద్దిరాలపాడు, 28న చేకూరపాడు, 30న ఎం.ముప్పాళ్ల, 31న కండ్లగుంట, జనవరి 2న ఒమ్మెవరం, 3న కొత్తకోట, 4న టి.తక్కెళ్లపాడు, 6న రాపర్ల, మెట్టువారిపాలెం, 7న చవటపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంతనూతలపాడు: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరగనున్నట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే సదస్సుల్లో ప్రజలు తమ సమస్యలు తెలపవచ్చని పేర్కొన్నారు.

నేడు శ్రీవారి నామాల ప్రతిష్ఠ

నాగులుప్పలపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి వారి శంకు, చక్ర, నామ చరణాల ప్రతిష్ఠోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఆరోగ్య కార్యకర్తల తొలగింపు తగదు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ పరిధిలో పనిచేసే పురుష ఆరోగ్యకార్యకర్తలను తొలగించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కె.జగన్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ విధానాల వల్ల గత 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల ప్రభుత్వం వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు.

ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు విద్య, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో నాన్ డిస్ట్రక్టివ్‌పై రెండురోజుల వర్క్‌షాపు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ భాస్కర్‌పటేల్ మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త పరిశ్రమ నైపుణ్యాలతో సన్నద్ధం చేసేందుకు సినర్జెమ్ కన్సల్టెన్సీ ప్రైవేటు లిమిటెట్ సహకారంతో ఈ వర్క్‌షాపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లిక్విడ్‌పెనెట్రేల్, మాగ్నెటిక్, ఆర్‌టీఎఫ్‌ఐ, యూటీటెస్ట్‌పై ఆచరణాత్మక పరిజ్ఞానం అందిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌వోడీలు ఆర్.సంజయ్‌కుమార్, రవిచంద్ర, ఎం.రాజేష్ తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, డీన్ ఎం.రూపాస్‌కుమార్, ఎఫ్‌వో షేక్‌మీంరావళి, అసోసియేట్ డీన్ శివాంజనేయులు, దిలీప్, సీఏప్రియ, కె.అరుణశాంతి, సి.ఆనంద్, పి.మనోజ్ పాల్గొన్నారు.

8న పూర్వ విద్యార్థుల సమావేశం

ఒంగోలు విద్య, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 8వతేదీన పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీకే.గీతాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూర్వ విద్యార్థుల సమావేశం వల్ల గురు, శిష్యపరంపరం కొనసాగడమే కాకుండా విద్యాలయానికి, విద్యార్థులకు మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడుతుందన్నారు. పూర్వ విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, వివరాలకు 9951091988 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొండపి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : కొండపికి చెందిన భాస్కరుని సుధాకర్‌రావు అనే యువకుడు మోటార్ సైకిల్‌పై నుంచి గాయపడ్డాడు. సుధాకర్ కొండపి నుంచి నూతలపాడు వైపు వెళ్తుండగా కోల్డ్‌స్టోరేజ్ దగ్గర జింక మోటార్‌సైకిల్‌కు అడ్డంగా రావడంతో ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో తలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితుడిని కొండపిలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రంగయ్యకు నివాళి

టంగుటూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొందూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దివంగత పమిడి రంగయ్య దశదిన కర్మ సందర్భంగా రంగయ్య చిత్రపటానికి ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య గురువారం నివాళులర్పించారు. రంగయ్య పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బెల్లం జయంత్‌బాబు, సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుండ్లాపల్లిలో అవగాహన ర్యాలీ



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఏవో వెంకట్రావు

మద్దిపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలో మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్ ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ సాయిల్ డే సందర్భంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసారపరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మినుము, శనగ, మొక్కజొన్న వేసిన రైతులు ఈ నెల 15వ తేదీలోగా, వరి రైతులు 31వ తేదీలోగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని కోరారు కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోకు సత్కారం



సుబ్బారావును సత్కరిస్తున్న వాకర్స్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ డిప్యూటీ జిల్లా విద్యాశాఖాధికారిగా ఉద్యోగోన్నతి పొందిన సామా సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఒంగోలు వాకర్స్ జిమ్ ఆధ్వర్యంలో గురువారం పయనం మల్లికార్జునరావు, ఏలూరి కొండలరావు ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు కట్టపై సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు శ్యామ్, చలపతి, హుస్సేన్, హెచ్ఎం వెంకట్రావు, వెంకటేశ్వర్లు, న్యాయవాది శిరిగిరి రంగారావు, పోకూరి శేషయ్య, కొప్పోలు శ్రీనివాస్, శరత్ బాబు, శ్రీదేవి, భారతి, రమ, ప్రసాద్, ప్రసన్న, వెంకటసుబ్బయ్య, ఝాన్సీ ఆంజనేయులు, షాలిని తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

నేలను కాపాడుకుందాం

● ఏవో జవహర్‌లాల్ నాయక్



మట్టి నమూనా పత్రాలను అందజేస్తున్న ఏవో జవహర్‌లాల్ నాయక్

పెద్దదోర్నాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేల ప్రకృతి అందించిన అమూల్యమైన సహజవనరు అని నేలను పరిక్షించుకుందామని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాటాడుతూ, ప్రస్తుతం విధాలుగా నిస్సారమవుతోందని, ప్రధానంగా రైతులు రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడడంతో నేలఆరోగ్యం పాడవుతోందన్నారు. తద్వారా జీవరాసుల ఆరోగ్యం కూడా దెబ్బతింటోందన్నారు. భూసార పరీక్షల ద్వారా పంటలు సాగు చేయడం, ఏటా పంట మార్పిడి చేయడం, పశువుల ఎరువుల వాడకం పెంచడం, జీలుగ, పెసర, అలసంద వంటి పచ్చిరొట్టల పెంపకం ద్వారా నేల సారవంతం చేయాలన్నారు.రైతులు ప్రతి మూడు సంవత్సరాల కొకసారి మట్టి పరీక్షలు చేయించాలన్నారు.భూసారం పెంపొందించేందుకు తీసుకోవాలసిన పలు సూచనలు చేశారు. అనంతరం మట్టి పరీక్షలు చేయించుకున్న రైతులకు నమూనా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో చైతన్య కుమార్, వీపీఏ ఎం విశ్వనాథ్, పీ శివా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

పుల్లలచెరువు : రైతులు భూముల్లో రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోని పర్యవరణ సమతుల్యం పాటించాలని ఏవో పి. నిర్మలాదేవి అన్నారు. బుధవారం పుల్లలచెరువు సచివాలయంలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయక ఎరువుల వినియోగంతో భూమి భౌతిక లక్షణాలు మారిపోయి దిగుబడులు తగ్గుతాయన్నారు. సేంద్రియ కర్బనం నేలకు అందించి భూమిలో పోషకాల లభ్యతను పెంచుకోవాలన్నారు. రైతులు పకృతి వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మేడికొండ రాధాకృష్ణ, వీఏఏలు ఎం.బ్రహ్మయ్య రైతులు పాలొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ సురేష్

గిద్దలూరుటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అర్బన్‌సీఐ కె.సురేష్ అన్నారు. పట్టణంలోని సూర్య విద్యానికేతన్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అర్బన్ సీఐ సురేష్ మాట్లాడుతూ బ్యాంక్ అధికారులంటూ అపరిచిత వ్యక్తులు ఫోన్‌కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగించడం చట్టరీత్యానేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బ్రహ్మానందరెడ్డి, ఎస్సై ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో..

మార్కాపురం రూరల్ : సైబర్ నేరాలు, మత్తు పదార్థాల అనర్థాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం టూటౌన్ ఎస్‌ఐ రాజమోహన్‌రావు విద్యార్థులకు సూచించారు. మండలం లోని రాయవరం గ్రామపరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడతూ, ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు అధికమయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా బాలికలు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలపై వేదింపులకు గురిచేసిన వారిపై ఫోక్సో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన దస్తగిరి

కంభం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న లారీని ద్విచక్ర వాహనదారుడు తప్పించబోయి అదుపుతప్పి ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలైన ఘటన కందులాపురంలో చోటు చేసుకొంది. ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం అర్బన్‌కాలనీకి చెందిన దస్తగిరి ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ మార్కాపురం వైపు నుంచి కంభం వస్తున్న లారీని బలంగా ఢీకొన్నాడు. దీంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలయ్యాయి. దస్తగిరిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వణికిస్తున్న వానలు

● సాగులో ఉన్న పైర్లపై తీవ్ర ప్రభావం ● శనగ పొగాకు, వరికి తీవ్ర నష్టం ● లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షం నీరు



కొమరోలు మండలంలో పొగాకు చేలో నిలిచిన వర్షంనీరు

గిద్దలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ప్రాంత రైతులను తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న అధిక వర్షాలు రైతాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికి అందివచ్చిన వరిపైరు పొలంలోనే నేలకొరిగి వర్షంనీటిలో తడిచి ముద్దయింది. కొమ్మదశకు వచ్చిన పప్పు శనగ వర్షం నీటిలోనే కుళ్లి పోయే పరిస్థితి వచ్చింది. తుఫాను ప్రభాంతో తొలిరోజు కురిసిన వర్షం పైర్లకు జీవం పోయగా, రెండవరోజు వర్షం నష్టాన్ని చేకూర్చలేదు. అయితే బుధ, గురు వారాల్లో కురిసిన వర్షం పైర్లకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. గిద్దలూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో గురువారం సాయంత్రం వరకు అందిన సమాచారం మేరకు 5215 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 67 గ్రామాల పరిధిలో 5547 మంది రైతులు పంట నష్టపోయారు. అత్యధికంగా 2800 హెక్టార్లలో శనగ, 1225 హెక్టార్లలో పొగాకు, 360 హెక్టార్లలో వరి, 246 హెక్టార్లలో మినుము, 264 హెక్టార్లలో ఉలవలు, 86 హెక్టార్లలో వరిగ, 36 హెక్టార్లలో అలసంద, 43 హెక్టార్లలో జొన్న, 131 హెక్టార్లలో నువ్వు, 24 హెక్టార్లలో రాగి పంటలు దెబ్బతిన్నాయి. మండలాల వారిగా పరిశీలిస్తే గిద్దలూరు మండలంలో 1664 హెక్టార్లు, రాచర్ల మండలంలో 410 హెక్టార్లు, కొమరోలు మండలంలో 1530 హెక్టార్లు, బేస్తవారపేట మండలంలో 1611 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. పొగాకు విషయానికి వస్తే అత్యధికంగా గిద్దలూరు మండలంలో 700 హెక్టార్లలో రైతులు నష్టపోగా బేస్తవారపేట మండలంలో 405 హెక్టార్లలో, కొమరోలు మండలంలో 120 హెక్టార్లలో రైతులు నష్టపోయారు. పప్పుశనగ, కొమరోలులో అత్యధికంగా 1100 హెక్టార్లలో, గిద్దలూరు మండలంలో 700 హెక్టార్లు, బేస్తవారపేట మండలంలో 590 హెక్టార్లు, రాచర్ల మండలంలో 410 హెక్టార్లు నష్టపోయారు. వరి పంట బేస్తవారపేట మండలంలో అత్యధికంగా 250 హెక్టార్లలో పంటనష్టం చోటుచేసుకోగా కొమరోలు మండలంలో 60 హెక్టార్లు, గిద్దలూరు మండలంలో 50 హెక్టార్లలో పంట నష్టం చోటుచేసుకొంది. మొత్తం మీద తుఫాన్ వర్షం రబీ సీజన్‌లోని రైతులను నట్టేట ముంచింది. ఉద్యానవన పంటల్లో మిరప పంట కూడా చాలా వరకు దెబ్బతిన్నది. ఖరీఫ్ సీజన్‌లో సాగైన కంది పూత దశలో ఉండగా 30 శాతంమేర ఇప్పటికే పూత రాలినట్లు సమాచారం అందుతుండగా కంది రైతుల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం పంట నష్టపోయిన వైనంపై వెంటనే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

గిద్దలూరు : తుఫాన్ కారణంగా నాలుగు రోజులుగా విడవకుండా వర్షం కురుస్తుండడంతో, పట్టణంలోని చాలా ప్రాంతాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న కాలనీలను వర్షం నీరు చుట్టుముట్టింది. ఈ కాలనీలకు సరైన రోడ్లు కానీ, డ్రైనేజీ వ్యవస్థకాని లేదు. దీంతో వర్షంపు నీరంతా రోడ్లపైన, ఇళ్ల పక్కన పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో నిలిచి ఉంటోంది. పట్టణ శివార్లలోని వివేకానంద కాలనీ, నల్లబండ బజారులో వర్షపునీరు బయటకు పోవడం లేదు. అర్బన్ కాలనీ తదితర ప్రాంతాలలో కూడా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరంతా రోడ్లపైన ఇళ్లపక్కనే ఉంటోంది. దీంతో ప్రజలు నానా అగచాట్లకు గురవుతున్నారు.





గిద్దలూరులో ఇళ్లచుట్టూ చేరిన వర్షపునీరు, సోమిదేవిపల్లి-పాలకవీడు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పగిడివాగు

పగిడివాగుకు భారీగా వర్షపునీరు

గిద్దలూరు : తుఫాన్ కారణంగా రాచర్ల మండలం లోని పగిడివాగుకు భారీగా నీరు చేరుతోంది. నీటిఉధృతి పెరిగి పాలకవీడు- సోమిదేవిపల్లి గ్రామాల మధ్యన ఉన్న రోడ్డుపైకి నీరు ప్రవహిస్తోంది. దీంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్సై పి.కోటేశ్వరరావు ఈరోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు వేసి గురువారం సాయంత్రం నుంచి రాకపోకలను నిలిపివేశారు. వాగుకు ఇరువైపుల ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

గిద్దలూరు టౌన్ : నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగర పంచాయతీ పరిధిలోని మిట్టమీదిపల్లి సమీపంలో చెట్టు నేలకొరిగింది. దీంతో ఆ గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ ఏఈ నారాయణరెడ్డి, లైన్‌మెన్ రహీమ్ ఆప్రాంతానికి చేరుకుని నేలకొరిగిన చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరద్దురించారు.

కొమరోలు : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో సాగుచేస్తున్న శనగ, పొగాకు, మొక్కజొన్న, జొన్న, వరి పైర్లు దెబ్బతిన్నాయి. శనగ, ఇంచుమించు సుమారు 5వేల ఎకరాల్లో సాగుచేయగా, ఇంచుమించు రూ.15కోట్లు పూర్తిగా నష్టం వాటిల్లిందని ప్రాథమిక సమాచారం. మండల వ్యవసాయ శాఖ అధికారు గతంలో 21 గ్రామాల్లో 1200మంది రైతులు సాగుచేస్తున్న 3825ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఆయా పంటలను తిరిగి సాగు చేయాల్సిన పరిస్థితి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఆ మేరకు రైతుసేవా కేంద్రాల ద్వారా నూరుశాతం రాయితీపై విత్తనాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

కలెక్టర్‌కు ఎరిక్షన్‌బాబు వినతి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గ వ్యాప్తంగా భూ వివాదాలు ఎక్కువగా ఉన్నాయని వాటి పరిష్కారంపై దృష్టిసారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు కోరారు. గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రకాశం భవన్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఏరిక్షన్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూ సర్వే పేరిట భూదందా చేసినట్లు తెలుస్తోందన్నారు. వాటిపై దృష్టి సారించి అసలైన లబ్ధిదారులకు భూమి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజవర్గ పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బంది కొరత లేకుండా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. వాటితో పాటు నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

సేవారత్న అవార్డులు



అవార్డు అందుకుంటున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ప్రాంతానికి చెందిన మేము న్నాము సేవాసమితి, చిన్ని సేవా సంస్థలకు మదర్ థెరిస్సా సేవారత్న అవార్డులు లభించాయి. కడప జిల్లా పోరుమామిళ్లలో అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా మదర్‌థెరిస్సా ఫౌండేషన్ చైర్మన్ చిత్త రవిప్రకాశ్‌రెడ్డి వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టిన స్వచ్ఛంద సంస్థలకు సేవారత్న అవార్డులు అందచేశారు. మేమున్నాము సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్‌లను సన్మానించి మదర్‌థెరిస్సా సేవారత్న అవార్డులు అందజేశారు. ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా గురువు బి.ఎస్. నారాయణరెడ్డికి సైతం మదర్‌థెరిస్సా సేవారత్న అవార్డును అందజేశారు.

ఆర్‌అండ్‌బీ దారిలో అడుగేస్తే బురదే

● నిత్యం రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

● సింగుపల్లి వద్ద వాహనదారులు నరకం



సింగుపల్లి వద్ద రహదారిపై నిలిచిన బురద

పుల్లలచెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ముటుకుల టూ మర్రివేముల రహదారిలో ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఈ రోడ్డు సీసీ రోడ్డే అయినప్పటికీ, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. ఆ రోడ్డులో సింగుపల్లి వద్ద సీసీ రోడ్డుపై 300 మీటర్ల మేర నిత్యం బురద నిల్వ ఉంటోంది. దీంతో వాహనదారులు నిత్యం జారీ పడుతున్నారు. వర్షంతో సంబంధం లేకుండానే ఇక్కడ మురుగు రోడ్డుపైకి చేరుతోంది. రోడ్డుకు ఇరువైపులా సైడ్ కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగుతోపాటు అక్కడే వున్న ప్రభుత్వ బోరు నుంచి నిత్యం నీళ్ల రోడ్డుపైకి చేరుతున్నాయి. దీంతో నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రయాణికులు తరచూ గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డుపై బురదను తొలగించి శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సారా బట్టీలపై అధికారుల దాడి

● 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

పుల్లలచెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కాపుకాస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. మంగళవారం ఎక్సైజ్ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పెద్ద పీఆర్‌సీ తాండ సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు చేశారు. సారా కోసం నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



విరాళాన్ని అందజేస్తున్న మాజీ సైనికులు

కంభం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు సేకరిస్తున్నట్లు కంభం మండల మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు శెట్టం వేణుగోపాల్ తెలిపారు. ఏటా సేకరించినట్లుగానే ఈ ఏడాది విరాళాలు సేకరించి 7న జిల్లా సైనికాధికారి రజనీకుమార్ సమక్షంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పుల్లయ్య, అంకయ్యగౌడ్, ప్రసాద్, గోపాల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన బీసీసెల్ నాయకులు



సీఎంకు సమస్యను వివరిస్తున్న బీసీ నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అమరావతి లోని రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం నాయకులు నలగాటి మల్లికార్జున నాయుడు గురువారం మార్యాద పూర్వకంగా కలిశారు. ఎర్రగొండపాలెం పట్టణంలో బీసీ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపు భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే నియోజవకర్గంలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించినట్లు మల్లికార్జుననాయుడు తెలిపారు.

గ్రామాలలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని చీతిరాల కల్యాణ మండపంలో అర్ధవీడు, కంభం మండలాల నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను వారి ద్వారా అడిగి తెలుసుకున్నారు గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. గత వైసీపీ పాలనలో జరిగిన నష్టాన్ని అధిగమించి అభివృద్ధి దిశగా ముందుకు పోవాలన్నారు. ప్రతి టీడీపీ కార్యకర్త గ్రామ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో అర్ధవీడు, కంభం మండలాల అధ్యక్షులు అంజనేయులు, శ్రీనివాసులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం

ఎర్రగొండపాలెంరూరల్ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎర్రగొండపాలెం నియోజవర్గ కౌన్సిల్ సమావేశాన్ని ఎర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యాదర్శి ఎంఎల్.నారాయణ హాజరవుతార న్నారు. ఈ కౌన్సిల్ సమావేశానికి నియోజ.కవర్గ పరిధిలోని సీపీఐ సీనియర్ నాయకులు, సహాయ కార్యదర్శులు, మండల కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

గిద్దలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో భాగంగా నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న ఉదయం అంబవరం, మధ్యాహ్నం వెంగలరెడ్డిపల్లి, 7వ తేదీ వెల్లుపల్ల, జయరాంపురం, సుగాలితాండ, 9న మోడంపల్లి, 10న చట్రెడ్డిపల్లి, మిట్టమీదిపల్లి, మధ్యాహ్నం కొండపేట, 11న కే.ఎస్.పల్లి, ఉప్పలపాడు, అక్కలరెడ్డిపల్లి, 12న దిగువమెట్ట, తాండా, పెద్దచెరువు, 13న కొత్తకోట, తాళ్లపల్లి, 16న కొమ్మునూరు, ఎగ్గెన్నపల్లి, వేములపాడు, 17న బ్రాహ్మణపల్లి, నల్లగట్ల, 18న సంజీవరాయునిపేట, అంకిరెడ్డిపల్లి, దొడ్డంపల్లి, 19న ఓబులాపురం, తాండా, 20న గడికోట, విరాముసురు పల్లి, తుమ్మళ్ళపల్లి, 21న దేవనగరం, పరమేశ్వర నగర్, 23న ఉయ్యాలవాడ, అంకనాంపల్లి, శింగంపల్లి, సూరే పల్లి, లింగాపురం, 24న ఆదిమూర్తిపల్లి, జమ్ముళ్లపల్లి, 26న గిద్దలూరు, 27న కొత్తపల్లి, పాములపల్లి, 28న తిమ్మాపురం, 30న తంబళ్లపల్లి, త్రిపురాపురం, 31న పొదలకొండపల్లి, జనవరి 2న నరవ, ఎస్.బయనపల్లి, 3న నరసింహానిపల్లి, కొంగళవీడు, 4న కంచిపల్లి, కె.బయనపల్లి, ఉప్పరపల్లి, 5న రాజుపేట, 6న ముండ్లపాడు, 7న బురుజుపల్లి, తాండా, 8న వెంకటాపురం, సుగాలి తాండాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న దృష్ట్యా సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

పొదిలి : డిసెంబరు 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులు మండలంలోని గ్రామాల వారీగా శుక్రవారం మల్లవరం గ్రామంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సదస్సుల్లో రెవెన్యూశాఖకు సంబంధించిన అన్ని సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. రైతుల పొలానికి సంబంధించిన సమస్యలు వచ్చిన అర్జీలను బట్టి పరిష్కరిస్తామన్నారు. 6న మల్లవరం, 10 కంభాలపాడు, 11 దాసర్లపల్లి, 12 ఓబులక్కపల్లి, నందిపాలెం, 13 సూదనగుంట, 16 పాములపాడు, 17 ఉప్పలపాడు, 18 తలమళ్ల, 19 ఏలూరు, 20 ఆముదాలపల్లి, చింతగుంట, 21 తహశీల్దార్ కార్యాలయం పొదిలి, 24 అక్కచెరువు, 26 ఈగలపాడు, 27 మాదిరెడ్డిపాలెం, 28 దొండ్లేరు, జనవరి 2 కొండాయపాలెం, మూగచింతల, 3 తుమ్మగుంట, 4 సల్లూరు, 7 అన్నవరం, రాములవీడు, 8 నిమ్మవరంతో సదస్సులు ముగుస్తాయని ఆయన తెలిపారు. షెడ్యూలు ప్రకారం ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూశాఖకు సంబంధించిన ఎలాంటి సమస్యనైనా అర్జీల రూపంలో తెలియజేయాలన్నారు. సదరు అర్జీలను నిర్ణీత గడువు లోగా సమస్యను పరిష్కరిస్తారన్నారు. ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాని కోరారు.

కంభం : కలెక్టర్ ఆదేశాల మేరకు కంభం మండలంలో రెవెన్యూ సమస్యలపై పరిష్కారం కోసం ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ గురువారం ఒక ప్రకటనలలో తెలిపారు. 6న కంభం, 9న తెల్లదిన్నె, లింగోజీపల్లి, 10న లింగోజీపల్లి కాలనీ, సూరేపల్లి, 11న రావిపాడు, 12న హజరత్‌గూడెం, కాగితాలగూడెం, 13న పోరుమామిళ్ళపల్లి, 16న చిన్నకంభం, 17న దేవనగరం, గోవిందాపురం, దర్గ, 18న లింగాపురం, 19న పెద్ద నల్లకాల్వ, 20న తురిమెళ్ళ, 21న మదారుపల్లి, 23న యర్రబాలెం, అనంతపల్లి, 24న చిన్ననల్లకాల్వ, నరవ కిందిపల్లి, 26న జంగంగుంట్ల, 27న కందులాపురం, సైదాపురం, 28న నడింపల్లి, 30న ఔరంగబాద్ గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తారని, రైతులందరూ పాల్గొని వారి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అదేశాలతో మండల పరిధిలో శుక్రవారం నుండి రెవెన్యూ సదస్సులు ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ ఏ.బాలకిషోర్ అన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో సభలు నిర్వహించే షెడ్యూలను వెల్లడించారు. 6న మిల్లంపల్లిలోని పంచాయితీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 10వ తేది వెంకటాద్రిపాలెం పంచాయితీ కార్యాలయం, 12న గుర్రపుశాల, 17న అమానిగుడిపాడు, 18న గురిజేపల్లి, 20న గోళ్లవిడిపి ఎంపీయూపీ పాఠశాలో నిర్వహించనున్నారు. 24న రామచంద్రాపురం ఎస్సీ కాలనీలోని బాపనపల్లి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నారు. 27న ఎర్రగొండపాలెం-1 సచివాయంలో, 28న రాయవరం ఎంపీయూపీ స్కూల్‌లో నిర్వహించనున్నారు. 31న కొలుకుల (కటారువానిపల్లి), జనవరి 2025 4న లింగంవానిపల్లి 9గంటల నుండి 1గంటల వరకు తమ్మడపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తారు. జనవరి 6న బోయలపల్లి, 8న లాలాపురం కాగా గంగాపాలెంలోని పంచాయితీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీలలో జరిగే రెవెన్యూ సదస్సులో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. ఆయా గ్రామ ప్రజలు ఈ సదస్సులలో పాల్గొని వారి సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని అన్నారు.

కొమరోలు : మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 6న నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. రెవెన్యూ సదస్సులో రెవెన్యూ సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించి రైతులకు మేలు చేసే కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పట్టా అందుకుంటున్న ఆదిత్యకిశోర్

పామూరు విద్యార్థికి డాక్టరేట్ ప్రదానం

పామూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు, టీడీపీ నాయకుడు మోరబోయిన హుసేన్‌రావు యాదవ్ కుమారుడు ఆదిత్యకిశోర్‌కు గురువారం భువనేశ్వర్‌లో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఏజీ బీఎస్సీలో పీహెచ్‌డీ చేసిన కిశోర్‌కు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఒరిస్సా డిప్యూటీ సీఎం, వైస్‌చాన్సలర్ చేతులమీదుగా డాక్టరేట్ పట్టాను అందుకొన్నారు. పామూరు విద్యార్థికి డాక్టరేట్ రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

వెలిగండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాటిపల్లి గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 8మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు. మండలంలోని గుడిపాటిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 8మందిని అదుపులోకి తీసుకొని రూ. 5370 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడికి రిమాండ్

పీసీపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మద్యంబాటిళ్లు తెచ్చి విక్రయిస్తూ బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి 14రోజులు రిమాండ్ విధిస్తూ కనిగిరి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి భరత్‌చంద్ర గురువారం ఆదేశాలు ఇచ్చారు. ఎస్సై జి.కోటయ్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తురకపల్లి గ్రామంలో కంసాని వెంకటకొండయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో బుధవారం రాత్రి గ్రామానికి వెళ్లి తనిఖీ చేయగా 21 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గురువారం కనిగిరి కోర్టులో హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఆదేశాలు ఇచ్చారు.

ఆక్రమణలు తొలగించాలి

పామూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పు కట్టకిందపల్లి గ్రామంలో ఆక్రమణలు తొలగించాలని పంచాయతి కార్యదర్శి మహేష్ గురువారం నోటీసులు అందజేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 524లోగల 1.03 ఎకరాల బండి దారి భూమిని ఆక్రమించి హోటల్, టెంపుల్, పార్టీ కార్యాలయం, రేషన్ షాపు నిర్మించి ఆక్రమణలకు పాల్పడ్డారు. వీటిని తొలగించాలని కోరుతూ గ్రామానికి చెందిన అల్లు మాలకొండరాయుడు, కె.జయరాములు, నీరుకట్టు మనోహర్ గతనెల 25న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

మారని ప్రభుత్వ భవనాల బోర్డులు

వెలిగండ్ల, డిసెంబరు 5: వెలిగండ్ల మండల అధికారులు నేటికీ గత ప్రభుత్వమే ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రైతు సేవా, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలుగా మార్చింది. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్ పేరిట ఉన్న బోర్డులు మార్చుచేయలేదు. జిల్లాలోని అన్ని మండలాల్లో వాటి పేర్లు మార్చినప్పటికీ వెలిగండ్లలో మాత్రం అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలు, 12 వెల్‌నెస్ కేంద్రాల పేర్లుగా మార్చు చేయకపోవడంపై ఇంత నిర్లక్ష్యమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పశుపోషకులకు ప్రయోజనకరం..

గోకులం షెడ్లు

- ఉపాధి నిధులతో చేపట్టేలా ప్రభుత్వం చర్యలు
- ముమ్మరంగా నిర్మాణాలు
- ఆసక్తి చూపుతున్న లబ్ధిదారులు



ఎర్రబాలెం గ్రామంలో నిర్మాణమవుతున్న గోకులంషెడ్

దొనకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో నిర్మాణాలు జరుగుతున్న మినీ గోకులం షెడ్లు పశుపోషకులకు ఎంతో ప్రయోజనకరంగా రూపొందుతుండటంతో గ్రామాల్లో మినీ గోకులం షెడ్ల నిర్మాణాల పట్ల పాడిరైతుల్లో ఆశక్తి పెరిగింది. దీంతో అర్హులైన పాడిరైతులు షెడ్ల నిర్మాణాల మంజూరు కోసం అధికారులు, పాలకుల చుట్టూ తిరుగుతున్నారు.

దొనకొండ మండలానికి 28 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. వీటికోసం 48 మంది పాడి రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. జాబ్ కార్డు కలిగి సొంత స్థలం ఉన్న చిన్న, సన్న కారు రైతులైన 28మందిని అధికారులు ఎంపిక చేశారు. షెడ్డుకు రూ. 2.30 లక్షల నిర్మాణ వ్యయం కాగా లబ్ధిదారుడు తమ వంతు పది శాతం వాటా చెల్లిస్తే ఉపాధి హామీ నిధులతో నిర్మాణాలు చేపట్టేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం మండలంలో 25 గోకులం షెడ్ల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతుండగా మూడు పూర్తి దశకు చేరాయి.

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో పాడి రైతుల శ్రేయస్సును గుర్తించి గోకులం షెడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గోకులం షెడ్ల నిర్మాణాల పట్ల నిర్లక్ష్యధోరణిగా వ్యవహరించి పశుపోషకుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో గోకులం షెడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పశుపోషణ, గొర్రెలు, మేకలు పెంపకానికి, పాడిపరిశ్రమకు ఎంతగానో దోహదపడేలా మెరుగైన వసతితో మినీ గోకులం పేరట షెడ్ల నిర్మాణాలు శ్రీకారం చుట్టింది.

టీడీపీ కూటమి ప్రభుత్వం పాడిపరిశ్రమను ప్రోత్సహించేలా గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టి పశుపోషకుల్లో ఆనందం నింపిందని పలువురు పశుపోషకులు తెలుపుతున్నారు.

పాడి పరిశ్రమకు పోత్సాహం

- పోతిపోగు చెన్నయ్య, లబ్ధిదారుడు, ఎర్రబాలెం



టీడీపీ కూటమి ప్రభుత్వం తమకు మంజూరు చేసిన గోకులం షెడ్డు తమ పశువుల సంరక్షణకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. గ్రామాల్లో పాడిపరిశ్రమను ప్రోత్సహించేలా టీడీపీ ప్రభుత్వం చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణాల చేపట్టింది. తద్వార పశుపోషకుల్లో ఆనందం నింపింది.

నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు

- తగరం దేవయ్య, ఏపీవో



దొనకొండ మండలానికి మంజూరైన గోకులంషెడ్ల నిర్మాణాలు డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన నిర్మాణాలు చేస్తున్నాం.

చినుకు పడితే చిత్తడి

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా విద్యుత్ ఆఫీస్ కాలనీ రోడ్డు

పామూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే పామూరులో పలు అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ఒకవైపు ఉగ్ర మంజూరు చేయించిన రూ, 5 కోట్లతో అంతర్గత రోడ్లు సీసీ రోడ్లుగా అభివృద్ధి చెందుతున్నాయి. మరోవైపు పలు ప్రాంతాలు కనీసం రోడ్ల నిర్మాణాలకు కూడా నోచుకోవడంలేదు.



గుంతల్లో నిలబడి ఉన్న వర్షపు నీరు

గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మాయాయి. సీఎస్‌పురం రోడ్డులోగల విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనీ వీధి ప్రధాన రోడ్డును విస్మరించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆదిత్య కాలేజి ఎదురుగల హస్పిటల్స్ ఏరియా రోడ్డులో పది అడుగుల మేర ఉన్న మట్టి రోడ్లపై గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలువ చేరి ఉంది. తూర్పువీధిలోగల వైఎస్సార్ రోడ్డులో సైడు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తుంది.

విరువూరు రోడ్డులోని పలు వీధుల్లో సక్రమైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతి పాలకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

ముండ్లమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి జరిగే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. జనవరి 8 వరకు ఈ సదస్సులు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూపరమైన సమస్యలతో పాటు ప్రజల అవసరాలు ఎలాంటివి ఉన్నా దరఖాస్తు తీసుకొని ఆయా శాఖల అధికారులకు పంపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. గ్రామ సభల్లో వీలైనన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సభల్లో గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనే విధంగా చూడాలని వీఆర్‌వోలను ఆదేశించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామాల్లో సిబ్బంది ఉండి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. సమావేశంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏ.స్రవంతి, ఆర్‌ఐ పీవీఎస్‌ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ పి.శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.



ముండ్లమూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

దర్శిలో..

దర్శి డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుండి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. అన్నీ రెవెన్యూ గ్రామాల్లో జనవరి 8 వరకు ఈ సదస్సులు జరుగుతాయని చెప్పారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. క్లిష్టమైన సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు పరిష్కరిస్తామని చెప్పారు. ఈ అవ కాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీ ల్దార్ కోరారు.

దొనకొండలో..

దొనకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్రవారం నుంచి గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రమాదేవి స్పష్టం చేశారు. 6వ తేది తెల్లబాడు, 7న వద్దిపాడు, 9న కలివెలపల్లి, 10న సంగాపురం, 11న వెం కటాపురం, 12న బాదాపురం, 13న వివిపురం, ఒబ్బాపు రం, 16న ఎర్రబాలెంలో జరుగుతాయని చెప్పారు.

17న గుడిపాడు, 18న నరసింహ నాయునిపాలెం, 19న చందవరం, బట్టిపాడు, 20న కొచ్చెర్లకోట, 21న పోలేపల్లి, 23న రామాపురం, 24న మల్లంపేట, 26న మంగినపూడి, 27న భూమనపల్లి, 28న పి.కభంపాడు, 30న పెద్దన్నపా లెం, లక్ష్మీనారాయణపురం, 31న ఆరవల్లిపాడు గ్రామ సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే, జనవరి 2న అనంతవరం, 3న ఇండ్ల చెరువు, పోచమక్కపల్లి, 4న రాగమక్కపల్లి, 6న రుద్రసముద్రం, 7న సిద్దాయిపాలెం, 8న పి.లక్ష్మీపురంలో జరుగుతాయని తెలిపారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.



ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు అపార్ కష్టాలు

- ఆధార్‌లో సవరణలకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

పామూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అపార్ (ఆటోమేటేడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజస్ట్రీ) కోసం విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉద యం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కోసం పడుతున్న అగచాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. నూతన జాతీయ విద్యావిధా నంలో భాగంగా విద్యార్థులకు అపార్ గుర్తింపు సంఖ్యను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఐడీ కేటాయించాలని సూచించింది. అకడమిక్ పురోగతి అంచనాకు ఇది ఉపయోగపడుతుందని తెలిపింది.

పామూరు మండలంలో వందకు పైగా పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లోని రిజిస్టర్లు, ఆధార్ వివరాలకు సరిపోకపోవడంతో కార్డుల జారీలో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పని పూర్తిచేయకపోతే హెచ్‌ఎంలను బాధ్యులు చేస్తామని విద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో వారంతా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారు. మండలంలోని దాదిరెడ్డిపల్లి, నుచ్చుపొద సచివాలయాల్లో మాత్రమే ఆధార్ కేంద్రం ఉంది. విద్యార్థులందరూ ఈ కేంద్రానికి వెళ్లి తమ ఆధార్‌లో సవరణలు చేయించుకొంటున్నారు. పామూరు లాంటి పెద్ద సెంటర్‌లో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 780 మంది విద్యార్థుల ఆధార్‌ల్లో సవరణలు చేయాల్సి ఉండగా ఇప్పటికీ 460 మందికి మాత్రమే పూర్తయ్యాయి. సర్వర్ సమస్యతో రోజుకు 25 నుంచి 30 వరకు మాత్రమే సవరణలు చేస్తున్నట్లు ఆధార్ నిర్వాహకులు తెలుపుతున్నారు. స్కూల్ సర్టిఫికెట్‌లో ఒకలాగ, ఆధార్‌లో మరోలా, పుట్టినతేది సర్టిఫికెట్‌లో ఇంకోవిధంగా తేదీలు ఉండటంతో సమస్యగా మారింది. ఒక అక్షరం తేడాగా ఉన్న ఆధార్ మార్చుకోవాల్సిందేనని చెబుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారే తప్ప కార్యరూపం దాల్చడంలేదు. అన్ని సక్రమంగా ఉంటేనే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఫీజులు కట్టించుకొంటామని స్కూల్, కళాశాల యాజమాన్యాలు చెబుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

- ముమ్మరంగా అవగాహన సదస్సులు

దర్శి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో ప్రజలు చిక్కుకోకుండా కాపాడేందుకు పోలీసు అధికారులు గత కొన్ని రోజులుగా చర్యలు తీసుకుంటున్నారు. అందులోభాగంగా ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహించి అన్నీవర్గాల ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. డీఎస్పీ బిలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీఐ వై.రామారావు, ఎస్సై ఎం.మురళీ తదితరులు నియోజకవర్గంలో అనేకచోట్ల విద్యార్థులు, వ్యాపారులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల వలపన్ని ఎలా మోసం చేస్తారో సానుకూలంగా వివరించి వారి జోలికి వెళ్లకుండా సూచిస్తున్నారు. ప్రధానంగా యువత, విద్యార్థులు అపోహలకు పోయి సైబర్ నేరగాళ్ల బారిన పడి జీవితాలు నష్టం చేసుకుంటున్న విషయాలను ఉదాహరణలతో వివరించి విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు అందుకోవాలని హితబోధ చేస్తున్నారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలతో ఎంతోమంది యువకులు జీవితాలు బలి చేసుకుంటున్నారని ఆవైపు వెళ్లవద్దని సూచిస్తున్నారు.

వ్యాపారులు వస్తువులకు భద్రత ఏర్పాటుచేసుకోవాలని అన్నీ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తు న్నారు. పేకాట, గంజాయి విక్రయాలు వంటి నేరపూరిత చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. వరుసగా అవగాహన సదస్సుల ద్వారా సమాజంలో జరుగుతున్న సంఘ టనలు వివరిస్తుండటంతో ప్రజల్లో, విద్యార్థుల్లో చైతన్యం వస్తుందనే భావన కల్గుతుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్తు పదార్థాల సరఫరాపై ఉక్కుపాదం మోపటంతో అందుకనుగుణంగా అధికారులు నడుచుకుంటున్నారు. ఇదేవిధంగా అధికా రులు ముక్కుసూటిగా వ్యవహరిస్తే చాలావరకు అసాంఘిక కార్యకలా పాలు నియంత్రించే అవకాశం ఉంది.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ, పాల్గొన్న సీఐ రామారావు(ఫైల్)

మురికికూపంగా పెద్దన్నపల్లి



పెద్దన్నపల్లిలో బురదమయమైన ప్రధానరోడ్డు

పీసీపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దపాడు పంచాయతీలో గల పెద్దన్నపల్లి గ్రామం మురికికూపంగా మారింది. దాదాపు ఒకటిన్నర దశాబ్దం క్రితం గ్రామంలోని ప్రధాన రోడ్డును సీసీరోడ్డుగా నిర్మించినా ఇంతవరకు మురుగు కాల్వలు నిర్మించలేదు. దీంతో ఇళ్లల్లోని వాడుకనీరుతో పాటు వర్షం పడిన సమయంలో నీరంతా రహదారిపై నిలిచిపోతుంది. తలకొండపాడు, పాలేటిపల్లి, కొష్టాలు, చిరుకూరివారిపల్లి తదితర గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం మండలకేంద్రమైన పీసీపల్లికి వెళ్లాలంటే పెద్దన్నపల్లిలోని ఈ ప్రధానమార్గం నుండే వెళ్లాలి. రోడ్డంతా మురుగుతో చిత్తడిగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా నివాసం ఉండే ప్రజలు దుర్వాసనతో పడరాని పాట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావు ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం మండలంలోని రావిగుంటపల్లి గ్రామ సచివాలయంలో సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఈ సదస్సులో పాసు పుస్తకాలు, అడంగల్ సవరణ, సర్వే హద్దులు చూపించడం, దారుల ఆక్రమణ, ఖాతా నెంబర్లలో మార్పులు, చేర్పులు, భూ ఆక్రమణ గురించి, సాగు చేసుకొనే భూ వివరాలు, భూవివాదాలు, రీ సర్వేలో తలెత్తిన సమస్యలు, తదితర అన్నిరకాల రెవిన్యూ సమస్యలపై గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

పంటల మార్పిడి తప్పనిసరిగా చేయాలి



మాట్లాడుతున్న ఏవో ఫరూక్

ముండ్లమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది పంట మార్పిడి చేసి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రధాన పంటలు సాగుచేసే 45 రోజుల ముందు పచ్చి రొట్టె ఎరువులు వేసి దమ్ము చేసుకున్నట్లయితే భూసారం, పంట దిగుబడి పెరుగుతుందన్నారు. పచ్చి రొట్టె ఎరువులు వేసి భూమిని కప్పి ఉంచటం వల్ల కలుపు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ మేదరమెట్ల వేణుగోపాల్, వీఏఏ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రమేష్

కురిచేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వాడకం తగ్గించి పశువుల ఎరువులు, జీవన ఎరువులను ఉపయోగించాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధానాధికారి డాక్టర్ జి.రమేష్ రైతులకు సూచించారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ముఖ్యంగా రైతులు పచ్చిరొట్టె ఎరువులు వేసుకొని భూమిలో కలియదున్నాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.మానస, నాగభూషణం, ఆత్మ బీటీఎం జీహెచ్ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

వర్షంతో పంటలకు నష్టం



పెదఉల్లగల్లులో వర్షానికి నేలకొరిగిన వరి

ముండ్లమూరు, డిసెంబరు 5: మండలంలో బుధవారం రాత్రి, గురువారం కురిసిన అకాల వర్షానికి వివిధ పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్ట పడి సాగు చేసిన పంటలు నీటి పాలయ్యాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. మండలంలోని పెద ఉల్లగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు, సింగనపాలెం, లక్ష్మీనగర్, కమ్మవారిపాలెం, వేముల, పులిపాడు, చింతలపూడి గ్రామాల్లోని రైతులు వ్యవసాయ బోర్ల కింద వరి పంట సాగు చేశారు. కొన్ని గ్రామాల్లో పైరును కోశారు. మరికొన్ని గ్రామాల్లో పంట కోసే దశలో ఉండగా ఒక్కసారిగా వర్షం రావటంతో వరి ఓదెలు తడిచిపోయాయి. పంట పూర్తిగా కొన్ని గ్రామాల్లో నేలమట్టం అయింది. చేతికి అందివచ్చిన పంట వర్షార్పణం అవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మొక్కజొన్న, పొగాకు, మిరప పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో వర్షపు నీరు నిలబడంతో పంటలు ఉరకెత్తే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షం రైతులకు కోలుకోలేని నష్టం తెచ్చింది.

పామూరు గ్రంథాలయానికి ఆదరణ కరువు

పామూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పామూరులో గల గ్రంథాలయానికి ఆదరణ కొరవడింది. పట్టణంలోని పొట్టి శ్రీరాములు వీధిలో 45 సంవత్సరాల క్రితం అద్దె భవనంలో శాఖ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఒకప్పుడు వందలాది మంది పాఠకులతో సందడిగా ఉండే గ్రంథాలయం నేడు వెలవెలపోతున్నది.

గతంలో గ్రామ పంచాయతీలే గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలు తీసుకొని అద్దెలు చెల్లించేవారు. గత 15 సంవత్సరాల నుంచి అద్దె చెల్లించక పోవడం, భవనం శిథిలావస్థకు చేరడం, భవన యజమాని పలుమార్లు ఖాళీ చేయాలని కోరడం, చివరకు కోర్టు లీగల్ నోటీసులు సైతం జారీ చేసింది. దీనికితోడు పూర్తి స్థాయిలో గ్రంథపాలకుడు లేకపోవడంతో తలుపులు తెరిచే నాథుడే కరువయ్యారు. గతంలో వారానికి రెండు రోజులు గ్రంథాలయాన్ని తెరిచే వారు. ప్రస్తుతం సీఎస్‌పురం గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కరరావు ఇన్‌చార్జి గ్రంథపాలకుడుగా వ్యవహరిస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయానికి పూర్వవైభవం తీసుకు రావాలని పాఠకులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 6 డిసెంబరు 2024





పట్టుబడిన నిందితుడు మునెయ్య, స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో పోలీసులు (ఫైల్)

రికవరీలో.. గోల్‌మాల్?

ఓ బంగారు దుకాణంలో.. పదేళ్ల క్రితం కిలోకి పైగా బంగారం.. నాలుగు కిలోల వెండి.. 3.39 లక్షలకు పైగా నగదు చోరీ జరిగింది. అయితే ఆ చోరీకి పాల్పడిన దొంగను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. కానీ అతడి నుంచి 96 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోగా అందులో 40 గ్రాములకుపైగా నాసిరకమని తేలింది. దొంగ దొరికితే అతడు చోరీ చేసిన సొత్తు ఏమైందో పోలీసులు చెప్పడంలేదు. పైగా అరకొర సొత్తును తీసు కోవాలని పోలీసులు ఆ దుకాణ యజమానిపై ఒత్తిడి తెస్తున్నారు. రికవరీలో గోల్‌మాల్ జరిగిందని అందరికీ అర్థమవుతున్నా.. ఏదోలా కేసును క్లోజ్ చే యడంపైనే పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అంతపెద్దమొత్తంలో బంగారం, వెండి, నగదు చోరీ అయితే రికవరీలో భారీ తేడా ఎలా అన్న విషయంపై పోలీసు అధికారులు కనీసం ఆలోచించడం లేద ని.. ఇందులోనే మతలబు ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలీసు ఉన్నతాధి కారులు స్పందించి ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశిస్తేనే ఈ చోరీ కేసుల రికవరీ వెనుక ఉన్న వాస్తవాలు

- దొంగ దొరికాడు.. 96 గ్రాములే స్వాధీనం
- అందులో 40 గ్రాములకు మించి నాసిరకం బంగారం
- ఏడాదిగా తీసుకునేందుకు ముందుకు రాని యజమాని
- తీసుకోవాలంటూ బంగారు దుకాణదారుడిపై

పోలీసుల ఒత్తిడి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చోరీ సొత్తు రికవరీలో అనేక అనుమానాలు.. పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. పోలీసు అధికారుల మీనమేషాలకు కారణమైన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరు మండలం ఊటుకూరుకి చెందిన బొగ్గవరపు మణికంఠ అనే వ్యక్తి అచ్చంపేటలో గంగాభవాని జ్యువెలర్స్ అనే బంగారం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. 2014 నవంబరు 29న ఆయన షాపులో చోరీ జరిగింది. దొంగలు షాపులో కిలోకి పైగా బంగారపు ఆభరణాలు, నాలుగు కిలోల వెండితో పాటు 3 లక్షల 39 వేలకుపైగా నగదు అపహరించారు. అప్పట్లో ఈ చోరీ ఘటన ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. అదేరోజు అచ్చంపేట పోలీస్‌స్టేషన్లో క్రైమ్ నెంబరు 165/2014గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా పురోగతి లేకపోవడంతో బాధితుడు మణికంఠ అనేకసార్లు అప్పటి గుంటూరు రూరల్ ఎస్పీని, రేంజ్ ఐజీని అనేక దఫాలు కలిసి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఈ క్రమంలో 2022 ఫిబ్రవరి 12న గురజాలలో ఓ దుకాణంలో షాపు పైకప్పు తొలగించి 86 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ల చోరీ జరిగింది. ఈ చోరీపై ప్రత్యేక దృష్టి సారించిన వినుకొండ, గురజాల, శావల్యాపురం, రూరల్ సీసీఎస్ పోలీసులకు 2022 మార్చి 6న శావల్యాపురం మండలం పిచ్చుకలపాలేనికి చెందిన కలుపుకూరి బాల మునెయ్య అలియాస్ బాలమణి పట్టుబడ్డాడు. నిందితుడని పోలీసులు విచారించగా సెల్‌ఫోన్ దుకాణంలో తరహాలోనే అచ్చంపేట, బాపట్ల, విజయనగరం జిల్లా కొత్తవలస తదితర ప్రాంతాల్లోని బంగారు షాపులకు పైకప్పు తొలగించి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించడంతో అరెస్టు చేశారు. దీంతో అచ్చంపేటకు చెందిన బంగారు వ్యాపారి మణికంఠను సీసీఎస్ పోలీసులు గుంటూరుకు పిలిపించి దొంగ దొరికాడని అతడి వద్ద 280 గ్రాముల బంగారం రికవరీ చేశామని, ముత్తూట్, శ్రీరామ్ ఫైనాన్స్‌లలో వెండి తాకట్టు పెట్టాడని ఆ మొత్తాన్ని రికవరీ చేసి ఇస్తామని, డబ్బు మాత్రం రికవరీ చేయలేమని చెప్పారు. అయితే దుకాణంలో 1250 గ్రాముల బంగారం చోరీకి గురైతే కేవలం 280 గ్రాములే రికవరీ చేయడం ఏమిటని వ్యాపారి మణికంఠ పోలీసుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అతడి ఆవేదనన పట్టించుకోకుండా మునెయ్యను అరెస్టు చేసినట్లు ప్రకటించి మీడియా ఎదుట హాజరు పరిచారు. అచ్చంపేట కే సు ం క ం సంబంధించి 96 గ్రాములు, బాపట్లలో ఓ షాపులో జరిగిన చోరీలో 96 గ్రాముల బంగారం, కొత్తవలసలో జరిగిన చోరీ కేసులో రెండున్నర కిలోల వెండి, గురజాల కేసులో 86 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు రికవరీ చేశామని ప్రకటించారు. దీంతో అచ్చంపేటకు చెందిన వ్యాపారి షాక్‌కు గురయ్యారు. ఆభరణాలు చూసిన వ్యాపారి మరింత ఆందోళన చెందారు. అవి అత్యంత నాసిరకమైన 15 క్యారెట్ల బంగారు ఆభరణాలని, వాటిని కరిగిస్తే 40 గ్రాములకు మించి రాదని తేల్చారు. కనీసం ముందుగా చెప్పినట్లు 280 గ్రాముల బంగారం, నాలుగుకిలోలు

(మిగతా 6వ పేజీలో..)

పోలీసుల తీరుపై అనుమానాలు..

సాధారణంగా చోరీ కేసుల్లో నగదు అపహరణకు గురైతే చేతులెత్తేయడం, ఆభరణాలు చోరీకి గురైతే కక్కించడం పోలీసులకు వెన్నతో పెట్టిన విద్య. మరి ఈ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. చోరీ జరిగి సంవత్సరాలు గడుస్తుంది కదా.. షాప్ యజమాని ఆశలు వదులుకుని ఉంటాడు.. ఎంత ఇచ్చినా దక్కిందే దక్కుదల అని తీసేసుకుంటాడు... అనుకున్నారో ఏమోగానీ పోలీసులు వ్యవహరించిన తీరు మాత్రం అలాగే ఉంది. చోరీ జరిగింది కొండంత... రికవరీ చేసింది మాత్రం కొసరంత. దీనిపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

- వైసీపీ హయాంలో ఆర్టీసీలో అడ్డగోలుగా మంజూరు
- గుంటూరు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల్లో 51 మంది..
- కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా కొనసాగుతున్న వైనం
- అక్రమ ఓడీలపై ఉన్నతాధికారులకు ఉద్యోగ సంఘ నేతల ఫిర్యాదులు

ఓడీలతో.. ఎంజాయ్



గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం.. దీర్ఘకాలిక రోగాలతో విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఓడీ (అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్) ఇస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో ఈ ఓడీలను ఇష్టం వచ్చినట్లుగా దుర్వినియోగం చేశారు. కొందరు వైసీపీ నేతల ఆదేశాలతో పలువురు ఉద్యోగులకు అధికారులు ఓడీలు ఇచ్చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పలువురు ఉద్యోగులు అక్రమ ఓడీలతో ఎంచక్కా ఎంజాయ్ చేస్తుండడంపై ఓ ఉద్యోగ సంఘ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆర్టీసీలో ఓడీల మంజూరుకు సంబంధిత జోనల్ కార్యాలయం అనుమతి తప్పనిసరి. అయితే ఈ నిబంధనను పట్టించుకోకుండా యథేచ్ఛగా అక్రమంగా ఓడీలు ఇచ్చేసినట్లు సమాచారం. ఇందులో అత్యధికంగా గుంటూరు-2 డిపోలో 24 మంది, గుంటూరు- 1 డిపోలో 9 మంది, తెనాలి డిపోలో ఏడుగురు, పొన్నూరు డిపోలో ఐదుగురు, మంగళగిరి డిపోలో ఆరుగురు మొత్తం 51 మంది ఉద్యోగులు తమ విధులను వదిలేసి అక్రమంగా ఓడీలు పొందుతూ ఎంచక్కా ఎంజాయ్ చేస్తున్నారని తెలిసింది. వీరంతా వారి సాధారణ విధులను వదిలేసి అందుకు భిన్నమైన తేలికపాటి విధుల్లో ఉన్నారు. కొందరైతే విధులకు రాకుండానే పూర్తిస్థాయిలో జీతాలు పొందుతున్నట్లు సమాచారం.

అర్హుల వినతులు బుట్టదాఖలు

మెడికల్ అన్‌ఫిట్ అయిన డ్రైవర్లు, కండక్టర్లు తిరిగి సాధారణ విధులు నిర్వహించలేక తీవ్ర అనారోగ్యం పాలైన వారు, హృద్రోగులు, క్యాన్సర్ రోగులు సాధారణ డ్యూటీలు చేయడంలో ఎంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అటువంటి బాధితులు పెద్ద ఎత్తున ఆర్టీసీలో ఉన్నారు. (మిగతా 6వ పేజీలో..)



మిర్చియార్డుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, అధికారులు

- 2 శాతానికి బదులు 4 శాతం కమీషన్ వసూలు
- జీరో, కటింగ్ బిజినెస్‌లతో యార్డు ఆదాయానికి గండి
- ఏటా రూ.100 కోట్లపైగా నష్టమని మంత్రికి నివేదించిన రైతు ప్రతినిధులు
- మిర్చియార్డుని నాశనం చేసిన వారిపై చర్యలు : అచ్చెన్నాయుడు

మిర్చియార్డులో నిలువుదోపిడీ

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డులో వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను నిలువుదోపిడీ చేశారు. దిగుమతి వ్యాపారులు 2శాతానికి బదులు 4శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. బిల్లులు రాయకుండానే సరుకుని బయటకు తరలిస్తున్న సంఘటనలు న్నాయి. వీటి వల్ల ఏటా రూ.100కోట్లకుపైగా యార్డుకు నష్టం వాటిల్లుతుంది. ఈ అక్రమాలను అరికడితే రైతుకు మేలు జరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడుకు రైతు ప్రతినిధులు తెలిపారు. యార్డులో రూ.347 కోట్ల కుంభకోణం జరిగిందని విజిలెన్స్‌తో మంత్రి గురువారం గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యా ర్డు నుంచి లావాదేవీ లు వేరే మార్కెట్లకు తరలిపోకుండా చర్య లు చేపడతామన్నా రు. మిర్చి విలువని పెంచేందుకు ఎంఎస్ ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు ఆలోచన చేస్తామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విజిలెన్స్ నివేదిక ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు జారీ చేసిన 687 కమీషన్ ఏజెంట్ల లైసెన్సులను పరిశీలించి నిబంధనల మేరకు వ్యాపారం చేయని వారిని గుర్తించి రద్దు చేస్తామన్నారు. ఈ-నామ్‌ను తప్పనిసరిగా అమలు చేస్తామని తెలిపారు. మిర్చియార్డుకు త్వరలోనే పాలకమండలి ఏర్పాటు చేస్తామన్నారు. యార్డు ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదని వేరే చోట ఏర్పాటు చేయాలని, అవసరమైతే రూ.100 కోట్లు సమీకరించి ఇస్తామని ఎగుమతి వ్యాపారులు తెలపగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రత్తిపాడులో 250 ఎకరాలకు పైగా భూమిని సేకరించి ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే రామాంజనేయులు చెప్పారు. శాసనసభ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ యార్డులోని సమస్యలను పరిష్కరించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఐపీ పెట్టిన కమిషన్ ఏజెంట్లు, వారికి అనుమతి మంజూరు చేసిన ఉద్యోగుల నుంచి రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా నగదు వసూలు చేసి రైతులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరి బుడితి రాజశేఖర్, తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, యార్డు పర్సన్ ఇన్‌చార్జి భార్గవతేజ, మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత, జేడీ శ్రీనివాసరావు, విజిలెన్స్ జేడీ రాజశేఖర్, యార్డు కార్యదర్శి ఆంజనేయులు, ఏడీ రాజాబాబు, వ్యాపార సంఘాల ప్రతినిధులు అప్పిరెడ్డి, సుధాకర్, తోట రామకృష్ణ, వెలగపూడి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు నైతిక హక్కు లేదు : అచ్చెన్నాయుడు


రైతులు గురించి మాట్లాడే నైతికహక్కు జగన్‌కు లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాశనం చేసిన వ్యవస్థని గాడిన పెడుతున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి 5 నెలలు చిల్లిగవ్వ చెల్లించకుండా, రూ.1600 కోట్ల అప్పు పెట్టిన దుర్మార్గుడని జగన్‌పై ధ్వజమెత్తారు. ఫెంగల్ తుఫానుతో తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు. అమరావతిని గాడిన పెట్టి రూ.46 వేల కోట్ల పనులను సంక్రాంతి నుంచి ప్రారంభించబోతున్నామన్నారు.

వ్యాపారం చేసేది సగం మందే

యార్డులో పేరుకు 683 మం దికి కమీషన్ ఏజంట్ లైసెన్సు లున్నా వారిలో సగం మంది కూడా వ్యాపారం చేయడం లేదని మంత్రి సమీక్షలో తేలింది. రైతులు తీసుకొస్తున్న సరుకు అంతా కొన్ని దుకాణాలకే వెళుతుం డటంతో సీజన్‌లో రద్దీ తలె త్తుతున్నదని,ధర కూడా పెరగడం లేదని వెలుగులోకి వచ్చింది. వేమెన్లపై కొంతమంది ఎగుమతి, దిగుమతి వ్యా పారుల ఫిర్యాదుతో వారు స్పందించి గణాంకాలతో సహా ఈ వివరాలను బయటకు తీశారు. దాంతో అంతా విస్తుబోయారు.

- నేటి నుంచి 33 రోజులు నిర్వహణ
- మండలంలో రోజుకో గ్రామంలో సభ
- ఈ సారైనా సమస్యలు పరిష్కారమయ్యేనా?

భూ సమస్యలపై సదస్సులు



(నరసరావుపేట, గుంటూరు, ఆంధ్రజ్యోతి)

భూ వివాదాలతో రైతులు అల్లాడుతున్నారు. సర్వే సమస్యలతో యజమానులు సతమతమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వేతో వివాదాలు, సమస్యలు మరింతగా పెరిగాయి. వాటి పరష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రీ సర్వేను నిలిపివేసింది. దీంతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రైతులు కనీసం పంట రుణాలు పొందలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయా సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. శుక్రవారం నుంచి జనవరి 8 వరకు అంటే 33 రోజుల పాటు మండల పరిధిలో రోజుకో గ్రామంలో సదస్సు నిర్వహించేలా రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు గ్రామంలోనే అధికారులు అందుబాటులో ఉండనున్నారు. మండలాల వారీగా షెడ్యూల్‌ను తహసీల్దార్లు గురువారం విడుదల చేశారు. ఏఏ గ్రామాల్లో ఏ రోజు సదస్సు జరుగుతుందో ముందుగానే తెలియజేస్తారు. సదస్సుల నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. గుంటూరు జిల్లాలో కలెక్టర్ నాగలక్ష్మి, పల్నాడులో కలెక్టర్ పీ అరుణ్‌బాబు, బాపట్లలో కలెక్టర్ వెంకటమురళి పర్యవేక్షణలో సదస్సులు జరగనున్నాయి. సంబంధిత జిల్లాల జాయింట్ కలెక్టర్ల సమన్వయంలో జరిగే సదస్సులను సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు నిర్వహిస్తారు. ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, దేవదాయ, వక్ఫ్ బోర్డు, అటవీశాఖ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సదస్సులకు హాజరు కానున్నారు. మండల స్థాయిలో సదస్సుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించారు. సదస్సుల నిర్వహణపై గ్రామాల్లో ప్రచారం చేస్తారు. షెడ్యూల్‌కు అనుగుణంగా సదస్సుల్లో ఆయా గ్రామాల్లో రైతులు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కలెక్టర్, జేసీ నియోజకవర్గంలో కనీసం ఒక సదస్సుకు హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సదస్సులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఫిర్యాదుల స్వీకరణ.. రశీదు..

రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ఆయా గ్రామాల్లో జరిగే సభల్లో బాధితుల నుంచి భూ సమస్యలపై అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తారు. గ్రామస్థాయిలో భూ వివాదాలు, 22 ఏ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలకు సంబంధిం చిన ఫిర్యాదులను స్వీకరిస్తారు. దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ లో నమోదు చేస్తారు. అనంతరం అక్కడిక క్కడే రశీదు జా రీ చేస్తారు. సమస్య తీవ్రత ఆధారంగా పరిష్కారానికి గడువు ఉంటుంది. ముందుగానే ఆ గ్రామానికి సంబంధించి రెవెన్యూ రికార్డులు అడంగల్, 22 ఏ జాబితా, 1బీ, హౌసింగ్, అసైన్డ్ ల్యాండ్, సబ్ డివిజన్, ఎఫ్ఎంబీ, మ్యాప్‌ల సమాచారం తయారు చేసి ప్రదర్శిస్తారు. గ్రామంలోని సమాచారం సరిగ్గా ఉందో లేదో ఈ రికార్డులతో రైతులు, ఇతర ల్యాండ్ యజమానులు వారి రికార్డులతో సరిచూసుకుని ఏమైనా తేడాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్తే గ్రామ సభలో అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. గ్రామ సభ జరిగే గ్రామంలో సదస్సు జరిగే రోజు ఉచితంగా ఏపీ సేవ సర్వీసులు అందించనున్నారు. రైతులెవరికైనా సమస్యలు ఉంటే ఆ రోజు వరకు ఉచితంగా సమస్యలు పరిష్కరిస్తారు. ఈ సదస్సులు భూవివాదాలను నివారించేలా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఆక్రమణలతో భూములు కోల్పోయిన బాధితులకు అండగా ఉండి న్యాయం చేస్తోందన్న భరోసా కల్పించేలా సదస్సులు ఉండనున్నాయి. రెవెన్యూ శాఖలో సంస్కరణలు అమలు చేసే దిశగా సదస్సులు జరగనున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఇటీవల రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలను స్వీకరించారు. ఆయా గ్రామాల్లో వేల సంఖ్యలో అందిన అర్జీల పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో రెవెన్యూ సదస్సులపై రైతుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ సారైనా తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఈ దిశగా రెవెన్యూ యంత్రాంగం స్పందించకుంటే సదస్సు లక్ష్యాలు నీరుగారిపోతాయని చెప్పవచ్చు.

మిల్లర్లు తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

వేమూరు, కొల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలకు రైస్‌మిల్లర్స్ అనుగుణంగా వ్యవహరించకుండా రైతులను ఇబ్బందులు పెడితే, అలాంటి మిల్లులను తక్షణమే మూసి వేయించడంతో పాటు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. గురువారం బాపట్ల జిల్లా వేమూరు మండలంలోని జంపని గ్రామంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి పార్థసారథి పర్యటించారు. కొల్లూరులోని రైతు సేవా కేంద్రం, రైస్‌మిల్లును పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న పైర్లను, తడిచిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుఫాన్ గాలులు, వర్షానికి పడిపోయిన పైర్లను నూర్పిడి చేస్తే వాటి ద్వారా మట్టి కూడా కలిసి వచ్చే అవకాశం ఉందని, అలాంటి ధాన్యానికి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయించాలని మంత్రులను జంపనిలో రైతులు కోరారు. స్పందించిన మంత్రులు వ్యవసాయ శాఖ అధికారులతో పాటు జాయింట్ ప్రకార్‌జైన్, ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ సుశీల, వ్యవసాయ శాఖ అధికారులతో స్థానికంగా ఉన్న పరిస్థితులపై చర్చించారు. మిల్లర్లు సహకరించకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోయారు. అనంతరం మంత్రి పార్థసారథి విలేకర్లతో మాట్లాడుతూ వ్యాపారులు మిల్లర్లు కుమ్మక్కై రైతులను ఇబ్బంది పెడుతున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు పక్షాన ఉండి వారికి సహకరించాలని ఆదేశించామన్నారు. 25 శాతం వరకు తేమ ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. 20 శాతం తేమ ఉన్న ధాన్యానికి మూడు కిలోలు 22 శాతానికి మించి తేమ ఉన్నా ఐదు కిలోలు మాత్రమే తరుగు చూపాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తేమ శాతాన్ని గుర్తించే విషయంలో మిల్లర్లకు సంబంధించిన ప్రతినిధిని కూడా హాజరు పరిచేలాగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. వారిద్దరి సమక్షంలో తేమ శాతాన్ని గుర్తించి రికార్డుల్లో ఇద్దరు సంతకాలు చేయించాలని తెలిపారు. అధికారుల పరిశీలన కాగానే సరుకు మిల్లర్‌కి తోలిన తర్వాత ఎలాంటి పరిశీలనలు ఉండకూడదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు అడ్డుకోలేమని అలాంటప్పుడు కలిగిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రూ.1600 కోట్ల దాకా రైతులకు డబ్బు ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం ఎగనామం పెట్టిందన్నారు. రైతులు నష్టపోకూడదనే ప్రభుత్వ తపన అధికారుల్లో కనిపించడం లేదన్నారు. మెరుగైన పనితీరుతోనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆ దిశగా అధికారులందరూ విధులు నిర్వహించాలన్నారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ, రెవెన్యూ వ్యవసాయ శాఖలతో పాటు పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది, రైతు పక్షాన ఉండి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు భరోసాగా నిలుస్తారని ఏ ఒక్క రైతు అధైర్యపడవద్దన్నారు.



జంపనిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, రవికుమార్, ఎమ్మెల్యే ఆనందబాబు

- రాష్ట్ర వ్యాప్తంగా రేపు మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌లు ప్రారంభం
- బాపట్లలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

బాపట్లరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న మెగాపేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు ప్రారంభం కానున్నాయి. బాపట్లలో ని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, సభావేదిక ఏర్పా ట్లను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య, ఏలూరి సాంబశివరావు గురువారం పరిశీలించారు. మెగా విద్యార్థుల పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు వస్తున్నందున పాఠశాల తరగతి గదులు విద్యార్థుల తల్లులకు నిర్వహించే రంగవల్లులు, తండ్రులకు నిర్వహించే ట గ్గాఫ్ వార్ పోటీల నిర్వాహణ, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి.వెంకటమురళి అడిగి తెలుసుకున్నారు. వర్షం వస్తే కార్యక్రమానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, సభావేదిక, ప్రాంగణం ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో 919 మంది విద్యార్థులు నమోదు కాగా ప్రస్తుతం 818 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని మంత్రులకు కలెక్టర్ వివరించారు. తరగతి గదుల విశాలంగా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, పీఏ సిస్టమ్ నడిపించడంలో అవాంతరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి మంత్రి ఆదేశించారు. మీడియా పాస్‌లివ్వడంలో సమస్యలు రాకుండా చూడాలన్నారు. అనంతరం విలేకరులతో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, విద్యాశాఖ హెచ్‌ఆర్‌డీ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని తెలిపారు.



రంగారావు, నాగరాజు మృతదేహాలు

మృత్యుతీగ

- విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికుల మృతి
- ఒక బోరు నుంచి మరో బోరుకు

వైరును లాగుతుండగా ప్రమాదం

కొనకనమిట్ల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 5 : కరెంటు తీగ యమపాశమైంది. ఇద్దరు కార్మికుల ఉసురుతీసింది. వారి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. ఈ ఘటన కొనకనమిట్ల మండలం చినారికట్లలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రమైన పెద్దారవీడుకు చెందిన విద్యుత్ కార్మికులు సంకుల రంగారావు, ఒంటేరు నాగరాజు, మస్తాన్, ఖాసిం, పెదనాగూర్ మీరావలి చినారికట్ల గ్రామంలో ఉన్న నిమ్మతోటలో విద్యుత్ తీగలు లాగేందుకు వచ్చారు. ఒక బోరు నుంచి మరో బోరుకు తీగను లాగేందుకు పట్టుకున్న వెంటనే ప్రమాదవశాత్తూ కరెంటు సరఫరా అవడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. గుర్తించిన నిమ్మతోట యాజమాని ఆటోలో వారిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఒంటేరు నాగరాజు (31), సంకుల రంగారావు (30) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. నాగరాజు, రంగారావులకు ఒక్కో కుమార్తె, ఒక్కో కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

జ్వర బాధితుల గుర్తింపునకు సర్వే

డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామాల్లో జ్వర బాధితులను గుర్తించేందుకు ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'వామ్మో జ్వరం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె వివరణ ఇచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతలు ఫీవర్ సర్వేను నిర్వహించామని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు 3,289 డెంగ్యూ అనుమానితులకు పరీక్ష చేయగా 326 మందికి పాజిటివ్ అని తేలిందన్నారు. మలేరియా కేసులు 23, గున్యా కేసులు ఏడు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో ప్రజలు వ్యాధులబారిన పడకుండా పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆమె చెప్పారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

ముమ్మరంగా అవగాహన సదస్సులు




మాట్లాడుతున్న డీఎస్పీ సీఐ (ఫైల్)

దర్శి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో ప్రజలు చిక్కుకోకుండా కాపాడేందుకు పోలీసు అధి కారులు గత కొన్ని రోజులుగా చర్యలు తీసుకుంటున్నారు. అందులోభాగంగా ముమ్మరంగా అవగాహప సదస్సులు నిర్వహించి అన్నీవర్గాల ప్రజలను చైతన్యవంతులను చే స్తున్నారు. డీఎస్పీ బిలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీఐ వై. రామారావు, ఎస్సై ఎం.మురళీ తదితరులు నియోజకవ ర్గంలో అనేకచోట్ల విద్యార్థులు, వ్యాపారులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల వలపన్ని ఎలా మోసం చేస్తారో సానుకూలంగా వివరించి వారి జోలికి వెళ్లకుండా సూచిస్తున్నారు. ప్రధానంగా యువత, విద్యార్థులు అపోహలకు పోయి సైబర్ నేరగాళ్ల బారిన పడి జీవితాలు నష్టం చేసుకుంటున్న విషయాలను ఉదా హరణలతో వివరించి విద్యార్థులను అప్రమత్తం చేస్తు న్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు అందుకోవాలని హిత బోధ చేస్తున్నారు. గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదా ర్థాలతో ఎంతోమంది యువకులు జీవితాలు బలి చేసు కుంటున్నారని ఆవైపు వెళ్లవద్దని సూచిస్తున్నారు. వ్యాపా రులు వస్తువులకు భద్రత ఏర్పాటు చేసుకోవాలని అన్నీ షాపుల్లో సీసీ కెమేరాలు ఏర్పాటుచేసుకోవాలని సూ చిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. పేకాట, గంజాయి విక్రయాలు వంటి నేరపూరిత చ ర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. వరుసగా అవగాహన సదస్సుల ద్వారా సమాజంలో జ రుగుతున్న సంఘటనలు వివరిస్తుండటంతో ప్రజల్లో, విద్యార్థుల్లో చైతన్యం వస్తుందనే భావన కల్గుతుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్తు పదార్థా సరఫరాపై ఉక్కుపాదం మోపటంతో అందుకను గుణంగా అధికారులు నడుచుకుంటున్నారు. ఇదేవిధంగా అధికారులు ముక్కుసూటిగా వ్యవహరిస్తే చాలావరకు అ సాంఘిక కార్యకలాపాలు నియంత్రించే అవకాశం ఉంది.

భరోసా..అవగాహనే..రక్షణ కవచం

- ఆడపిల్లలు అబలలు కాదు
- వారి అడుగులే వారిని కాపాడతాయి
- ఆపద సమయంలో 112కు కాల్ చేయండి
- ప్రతి మంగళవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహనకు ఎస్పీ ఆదేశాలు
- బాలికల సంరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు ముగ్గురూ ముఖ్యం
- కష్టమొస్తే పోలీసు వస్తారనే ధైర్యం నింపాలి
- తక్షణ చర్యలతో ఆకతాయిలకు చెక్
- ఇటీవల చీరాల్లో జరిగిన ఘటనపై వివిధ వర్గాల్లో చర్చ

ఈవ్ టీజింగ్ మళ్లీ వెర్రితలలు వేస్తోంది. దీంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఎవరికి చెప్పాలో అర్థంకాక ఒత్తిడిడి గురువుతున్నారు. ఈ క్రమంలో వారికి వారే రక్షణ కవచంలా మారాలి. అదే పరిష్కారం. అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పోలీసులు వారివెన్నంటే ఉండి సహకరించాలి. మేమున్నామన్న భరోసా, జరుగుతున్న మోసాలపై అవగాహనతో బాలికలు అప్రమత్తమై తమకు తాము కాపాడుకునేలా చూడాలి. అదే క్రమంలో పోలీస్ శాఖ తీసుకునే చర్యలతో ఆకతాయిలు, పోకిరీల ఆట కట్టడి కావాలి.



కాలేజీ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)

చీరాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్నేహం పేరుతో స్కూలు, కాలేజీ అనే తేడా లేకుండా విద్యార్థినులకు వలలు విసిరే ఆకతాయిల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈక్రమంలో బ్లాక్‌మెయిల్ చేసేవారి సంఖ్య పెరుగుతోంది. ఆ సందర్భాలు ఎదురుకాకముందే తొలిదశలోనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు, పోలీస్‌లకు చెప్పి తాము భద్రంగా ఉండగలమనే భావనను బాధిత బాలికలకు కల్పించాల్సిన బాధ్యత ఆ ముగ్గురిపైనా ఉంది. ప్రస్తుతం అది కొన్ని సందర్భాల్లో లోపిస్తుంది. దీంతో కొన్ని చేదు అనుభవాలను బాధితులు చవిచూస్తున్నారు.ఇటీవల చీరాలలో జరిగిన ఓ సంఘటన (మైనర్ బాలిక విషయంలో) చర్చనీయాంశంగా మారింది. ఒకరిని నిందించడం కంటే ముందస్తుగా జాగ్రత్త పడడం మంచిది. ఆకతాయి లు లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే పోలీస్‌కు 112కు కాల్‌చేస్తే వెంటనే వారు వస్తారు. ఆపదలో ఉన్నవారిని రక్షిస్తారు. వారి పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు ఉపయోగించుకునేవిధంగా పోలీసులు అవగహన కల్పించాలి. అయితే కొందరు విద్యార్థినులు వేసే తప్పడగులను కట్టడి చేయాల్సిన బాధ్యత కూడా ఆ ముగ్గురిపై ఉంది. అదే కీలక అంశం.

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలేవైనా

చదువుకునే వారికి ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు ఏవైనా ఒక్కటే. పక్కచూపులు చూసేవారి ప్రవృత్తి ఎక్కడైనా మారదు. అది విద్యార్థులు కావచ్చు.. విద్యార్థినులు కావచ్చును. అయితే ఎక్కువ సందర్భాల్లో ఇబ్బంది పడేది బాలికలే. అందుకు కారణం ఏంటనే మూలాలను శోధిస్తే వారు స్వతంత్రంగా తమ భావాలను కుటుంబ సభ్యులకు, వారు చదువుకుంటున్న బోధకులకు, పోలీసులకు చెప్పి సాయం పొందేందుకు ఆడపిల్లలు వెనుకడుగు వేయడమే కారణం. దీన్ని కొందరు సహ విద్యార్థులు, బయట తిరిగే పోకిరీగాళ్లు స్నేహం పేరుతో, టీజింగ్ పేరుతో దగ్గరవుతున్నారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు అప్రమత్తంగా ఉండి విద్యార్థులను పర్యవేక్షిస్తుం డడం బాధ్యత. కాదని నిర్లక్ష్యంగా ఉంటే బయట జరిగే ఘటనలకు వారూ బాధ్యులుగా ప్రశ్నలు ఎదుర్కోవలసి వస్తుంది.

ఆ ముగ్గురూ కీలక పాత్రధారులే

రెండు చేతులు కలిస్తేనే శబ్దం వచ్చేది. పిల్లలు వక్రమార్గంలోకి వెళ్లారంటే అది సంరక్షకుల వైఫల్యమే మొదటి కారణంగా చెప్పక తప్పదు. అందులో మొదటి స్థానంలో కుటుంబ సభ్యులు, రెండో స్థానంలో ఆయా విద్యా సంస్థల అధ్యాపకులు, యాజమాన్యం, మూడో స్థానంలో చట్టపరిరక్షణ బాధ్యత చేపట్టాల్సిన పోలీసులు ముగ్గురూ కీలక పాత్రధారులే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే మొదటి ఇద్దరితోనే పిల్లలు ఎక్కువ సమయం గడిపేది. తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఎదురయ్యే కొన్ని ఇబ్బందులను స్నేహ పూర్వకంగా తెలుసుకోకుండా ప్రతిదానికి నీదే తప్పు అన్నట్లు మాట్లడడంతో వారు కుటుంబ సభ్యులకు మనసులో వేదన చెప్పలేరు. అలానే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా ఏ ఆడపిల్లకయినా ప్రతికూల పరిస్థితి ఎదురైతే వారి మనస్సు లోతుల్లోకి వెళ్లి వారి బాధను అర్థం చేసుకోవాలి. ఇక పోలీస్ ఆడపిల్లను ఇబ్బంది పెట్టిన వాడు ఎంతటి వాడైనా చర్యలు తప్పవనే భయం కల్పించాలి. అది చేతల్లో కూడా చూపాలి.

112కు ఫోన్ చేస్తే తక్షణ పోలీస్ సాయం

పోలీస్ అనగానే అందరికీ గుర్తొచ్చే నెంబరు 100. అయితే ఆడపిల్లలకు సంబంధించి ఎలాంటి అపద ఉన్నా, పోకిరీల చేష్టలతో బాధపడుతున్నా వెంటనే 112కు ఫోన్ చేయాలి. వెంటనే పోలీస్ స్పందిస్తుంది. తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుంటారు. ఆకతాయిలను అరెస్ట్ చేస్తారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతారు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

మహిళా పోలీస్ పికెట్ కొనసాగుతోంది

ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇద్దరు మహిళా పోలీసులు విద్యా సంస్థల ప్రదేశాల్లో గస్తీలో ఉంటారు. అనుకోని పరిస్థితులు ఎదురైతే వారికి సహకరించేందుకు బ్లూకోట్స్ కానిస్టేబుల్స్ ఇద్దరు వారికి అందుబాటులో ఉంటారు. ఫోక్సో కేసులకు సంబంధించి కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. భవిష్యత్‌లో ప్రత్యేక కార్యాచరణతో పనిచేసేందుకు కసరత్తు చేస్తున్నాం.

\- ఎం. శ్రీనివాసరావు
సీఐ, చీరాల వన్‌టౌన్

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై నిరంతర అవగాహన

ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం విద్యాసంస్థలు, హాస్టల్స్‌లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అవి మొక్కుబడిగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ కార్యక్రమాలను విద్యార్థుల మనస్సులను తెలుసుకొని భావప్రకటనకు ప్రోత్సహించే విధంగా, అతిక్రమిస్తే చర్యలు తప్పవనే సంకేతాలు స్పష్టంగా ఉండాలి. సాయం కోరే వారి వివరాలను గోప్యంగా ఉంటాయనే భరోసా కల్పించాలి.


నాకు ఆ నెంబరు 112 అని తెలీదు

ఓ తండ్రి ఆంతరంగం

ప్రస్తుతం మారుతున్న సమాజంలో ఆడపిల్లలకు ఆపద వస్తే రక్షించుకోవడం ఎలా అనే విషయంలో పోలీస్ శాఖ పరంగా ఎవరికి ఫోన్ చేయాలి, ఆ నెంబరు ఎంత అనేది నాకు తెలియదు. ఒకటి, రెండు సార్లు పిల్లలకు చెబుదామని అనుకున్నా. తరువాత మర్చిపోయా. నేను కూడా బాధ్యతాయుతమైన ఉద్యోగం చేస్తూ కూడా ఆ నెంబరు 112 అని మదిలో లేదు. ఈ క్రమంలో విస్తృత ప్రచారం అవసరమని నేను భావిస్తున్నాని ఓ తండ్రి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఒకే వేదికపైకి తల్లిదండ్రులు, గురువులు

- రేపు ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక సమావేశాలు
- పాఠశాల, విద్యార్థి ప్రగతిపై చర్చ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై కూటమి సర్కారు దృష్టి సారించింది. అందుకోసం ఓ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్ని ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. అందుకోసం శనివారం పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాల నిర్వహణకు ఆదేశించింది. విద్యాపరమైన అంశాలను చర్చించి బడులను మరింత బలోపేతం చేయాలన్న సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాపట్ల జిల్లాలో శనివారం లాంఛనంగా ప్రారంభించనుండగా జిల్లావ్యాప్తంగా ఉన్న 2,407 ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరూ సమావేశాల్లో పాల్గొనేలా ఇప్పటికే వారికి హెచ్ఎంలు ఆహ్వానాలను పంపారు.

పాఠశాల సమగ్ర అభివృద్ధికి దిశానిర్దేశం

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ప్రత్యేక సమావేశాల్లో పలు అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్ల సమగ్రాభివృద్ధికి దిశానిర్దేశం చేయనున్నారు. ఏటా పాఠశాల స్థాయిలో ఏర్పాటుచేసే తల్లిదండ్రుల సమావేశాలకు భిన్నంగా ఈసారి నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. అందుకు అవసరమైన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. పాఠశాలల అభివృద్ధికి అవసరమైన సామగ్రి కొనుగోళ్ల బడ్జెట్, సుందరీకరణ; పర్యావరణ పరిరక్షణ, మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయుల అంతర్గత సమస్యలు, మంచినీరు ఇతర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. విద్యార్థుల ప్రగతి, వారి ఆరోగ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు అంటే శారీరక, మానసిక, కంటి సంబంధ సమస్యలు, పౌష్టికాహార లోపం వంటివి సిద్ధం చేశారు. కొన్ని చోట్ల ప్రత్యేక వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇంటి వద్ద విద్యార్థులను ఎలా పర్యవేక్షించాలి, సెల్‌ఫోన్, టీవీలు, ట్యాబ్‌లు ఇతర సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ ఎలా ఉండాలన్న అంశాలపై కూడా తల్లిదండ్రులతో చర్చించనున్నారు.

రూ.49.16లక్షలు మంజూరు

ప్రత్యేక సమావేశాల నిర్వహణకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం మంజూ రు చేసింది. జిల్లాకు రూ.49.16 లక్షలు ఇ చ్చింది. దీన్ని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేటాయించారు. మ రోవైపు పాఠశాల పూర్వ విద్యార్థులను కూడా సమావేశాలకు ఆహ్వానించారు. వారిద్వారా విద్యార్థులకు సూచనలు ఇప్పించనున్నారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అంశాలపై కూడా వారితో చర్చించనున్నారు.

పండుగ వాతావరణంలో సమావేశాలు : కలెక్టర్

విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించడంతోపాటు పేరెంట్స్‌-టీచర్ల మధ్య సంబంధాలను మరింత పెంచేందుకు శనివారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌-టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2,407 పాఠశాలల్లో చదువుతున్న 1,90,410 మంది విద్యార్థుల ఆసక్తి, ఆరోగ్య, విద్యా సంబంధ విషయాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఇస్తామన్నారు. కార్యక్రమాల్లో ప్ర జా ప్రతినిధులను కూడా భాగస్వామ్యులను చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఈవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రికవరీలో గోల్‌మాల్?

(5వ పేజీ తరువాయి)

వెండి కూడా ఇవ్వకుండా కేవలం 96 గ్రాములు రికవరీ చూపడం ఏమిటని వాపోయారు.

రూ.8 లక్షల ఖర్చు

దుకాణంలో చోరీ జరిగిన బంగారం కోసం ఇప్పటివరకు వ్యాపారి మణికంఠ ఎనిమిదేళ్లు తిరిగారు. రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేశారని సమాచారం. అయితే పోలీసులు చూపుతున్న 96 గ్రాముల నాసిరకం బంగారం తీసుకుంటే కనీసం తాను ఖర్చు పెట్టిన డబ్బులు కూడా రావని వాపోతున్నారు. ఈ బంగారాన్ని తీసుకోవాలని ఏడాదిగా పోలీసులు ఒత్తిడి తెస్తుండగా అతను ససేమిరా అంటున్నారు. ఇప్పుడు ఆ ఆభరణాలను తీసుకుంటే ఇంకా కొంతమంది చేతులు తడపాల్సి ఉంటుందని, దీంతో ఆ మొత్తం అందుకే సరిపోతుందని మణికంఠ భయపడుతున్నారు.

పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు

అచ్చంపేట భారీ కేసులో దొంగ దొరికినా పోలీసులు కేవలం 96 గ్రాములు అదీ నాసిరకం బంగారాన్ని మాత్రమే రికవరీ చూపిన ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు కూడా స్పందించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చోరీ కేసుల్లో బంగారం రికవరీలో 10 గ్రాములో.. 20 గ్రాములో రికవరీలో తేడా ఉన్నా పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. కానీ కిలోకి పైగా బంగారు ఆభరణాలు చోరీకి గురైతే కేవలం 96 గ్రాముల నాసిరకం బంగారు ఆభరణాలు చూపడం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆ 96 గ్రాముల బంగారాన్ని తీసుకునేందుకు బాధితుడు ముందుకు రాకపోయినా ఉన్నతాధికారుల్లో స్పందన లేకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రెండేళ్లుగా పోలీసులు ఆ బంగారం తీసుకెళ్లాలని, లేదంటే తామే కోర్టుకు లెటర్ పెట్టి బాక్స్‌లో వేస్తామని వ్యాపారిపై ఒత్తిడి తెస్తున్నారు. లేదంటే బంగారం తీసుకున్నట్లుగా లెటర్‌పై సంతకం చేస్తే చాలని దాన్ని తాము ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామని గతంలో కొందరు పోలీస్ అధికారులు మణికంఠను ప్రలోభ పెట్టడం గమనార్హం.

సమగ్ర విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి

అచ్చంపేట, బాపట్ల, కొత్తవలస దుకాణాల్లో జరిగిన చోరీ కేసులు అన్నింటిపైనా పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. అచ్చంపేటకు చెందిన వ్యాపారిని గుంటూరుకు పోలీసులు పిలిపించిన సమయంలో 280 గ్రాములు ఇస్తామని చెప్పారు. అయితే ఆ తర్వాత అచ్చంపేట, బాపట్ల దుకాణాల్లో జరిగిన చోరీలకు సంబంధించి రికవరీ చేసిన బంగారమంతా కూడా 192 గ్రాములే ఉండడం గమనార్హం. ముందుగా చెప్పిన 280 గ్రాములు ఏమైనట్లు అనేది కూడా మరో ప్రశ్నగా ఉంది.

ఓడీలతో.. ఎంజాయ్

(5వ పేజీ తరువాయి)

తమ పరిస్థితిని చూసి మానవత్వంతో ఓడీలు కల్పించాలని చేసిన విజ్ఞప్తులను కొందరు డిపో మేనేజర్లు బుట్టదాఖలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. అవయువాలన్నీ బాగున్న వారికి, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేని వారికి మాత్రం వైసీపీ హయాంలో ఓడీలు కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి. ఆయా డిపోల్లో డిపో మేనేజర్లకు వత్తాసు పలికే 'కట్టప్ప'లకు, వైసీపీ విధేయులకు మాత్రం అడ్డగోలుగా ఓడీలు కల్పించేశారన్న ఆరోపణలున్నాయి.

అక్రమ ఓడీలపై నోరెత్తని నాయకులు

అక్రమ ఓడీలతో ఎంజాయ్ చేస్తోన్న కొందరు యూనియన్ నాయకులు సంస్థలో సిబ్బంది పడుతోన్న సమస్యలను ప్రశ్నించకుండా మిన్నకుండిపోతున్నారన్న విమర్శలున్నాయి. డిపోల్లో సమస్యలైన టాయిలెట్స్, తాగునీరు, రెస్ట్ రూమ్స్, రన్నింగ్ టైం సమస్యలు, బస్సుల కండిషన్‌లాంటి సమస్యలు అడిగే నాథుడే కరువయ్యారు. కేవలం కొద్ది మంది మెప్పుకోసం వైసీపీ హయాంలో విచ్చలవిడిగా చేసిన అక్రమ ఓడీల వ్యవహారంపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరపాలని ఉద్యోగులు కోరుతున్నారు.

కారు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

బాపట్లరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పర్చూరు మండలం చెరుకూరు కొత్తపాలెం గ్రామానికి చెందిన కొమరగిరి వెంకయ్య (55) అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతుండగా బాపట్ల మండలం నరసాయపాలెం-కంకటపాలెం గ్రామాల మధ్యలో కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బాపట్ల రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కారులోని వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేశారు.

వర్షంతో పంటలకు నష్టం

ముండ్లమూరు, డిసెంబరు 5: మండలంలో బుధవారం రాత్రి, గురువారం కురిసిన అకాల వర్షానికి వివిధ పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్ట పడి సాగు చేసిన పంటలు నీటి పాలయ్యాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. మండలంలోని పెద ఉల్లగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు, సింగనపాలెం, లక్ష్మీనగర్, కమ్మవారిపాలెం, వేముల, పులిపాడు, చింతలపూడి గ్రామాల్లోని రైతులు వ్యవసాయ బోర్ల కింద వరి పంట సాగు చేశారు. కొన్ని గ్రామాల్లో పైరును కోశారు. మరికొన్ని గ్రామాల్లో పంట కోసే దశలో ఉండగా ఒక్కసారిగా వర్షం రావటంతో వరి ఓదెలు తడిచిపోయాయి. పంట పూర్తిగా కొన్ని గ్రామాల్లో నేలమట్టం అయింది. చేతికి అందివచ్చిన పంట వర్షార్పణం అవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- మంత్రి స్వామి ఆదేశం
- నేటి నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులపై అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. సోమవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం స్థానిక ప్రకాశం భవన్‌లో శాసనసభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మీకోసం అర్జీలలో 70నుంచి 90శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే వస్తున్నాయన్నారు. ఈనేపథ్యంలో వీటి శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ సదస్సులను ఆగస్టులోనే నిర్వహించాలనుకున్నా అధికారుల బదిలీలు, వరదల నేపథ్యంలో కొంత జాప్యం జరిగిందన్నారు. చుక్కలు, 22(ఎ) జాబితాలో ఉన్న భూములపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలను కూడా ఈ సదస్సుల ద్వారా గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భూ ఆక్రమణల నిరోధానికి పటిష్టమైన చట్టాన్ని కూడా ప్రభుత్వం తెచ్చిందన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు గ్రామాల వారీ షెడ్యూల్ కూడా రూపొందించినందున స్థానికులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

మండలానికి ఒక నోడల్ అధికారి నియామకం : కలెక్టర్

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 826 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయన్నారు. వీటిల్లో రెవెన్యూ సదస్సుల కోసం తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒకటి, డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో మరో బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాస్థాయి అధికారులను కూడా మండలాలకు ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ రెవెన్యూ సదస్సులలో అర్జీలు ఇచ్చిన ప్రజలకు అప్పటికప్పుడే రసీదు ఇవ్వడంతోపాటు అదేరోజు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే విధంగా శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు. మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వాస్తవ అసైన్డ్‌దారులకు న్యాయం చేసేందుకు ఇది మంచి అవకాశమన్నారు. సత్వర నిర్ణయం తీసుకొని బాధితుల తరఫున నిలబడాలన్నారు. మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయ భూములు దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయ్యాయని సమావేశం దృష్టికి తెచ్చారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

అక్రమాలకు పాల్పడిన అధికారులను సదస్సులకు దూరంగా ఉంచాలి : ఎమ్మెల్యే ఉగ్ర

సమావేశంలో కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ గతంలో అవకతవకలకు పాల్పడిన అధికారులను ఈ రెవెన్యూ సదస్సులకు దూరంగా ఉంచాలన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు స్థానికంగా సదస్సులు జరిగే రోజు ఉపాధి హామీ పథకం పనులు నిర్వహించకుండా ప్రజలంతా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ వాస్తవ భూయజమానులకు, వాస్తవ అసైన్డ్‌దారులకు న్యాయం చేసేలా అధికారులు పనిచేయాలని కోరారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ పుల్లల చెరువు మండలం మానేపల్లిలో కొండపోరంబోకు భూముల ఆక్రమణపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మేయర్ గంగాడ సుజాత, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్.స్వరూప్ (టీడీపీ), డీఎస్ క్రాంతికుమార్ (వైసీపీ), బి.రాజశేఖర్ (బీజేపి), రసూల్ (కాంగ్రెస్), సుదర్శనరావు (ఆప్), టి.వెంకటస్వామి (బీఎస్పీ)తో పాటు పలుశాఖల అధికారులు, రైతు సంఘాల నాయకులు, ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు వీరే..

జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులను పర్యవేక్షించేందుకు మండలానికి ఒక్కో నోడల్ అధికారిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు (అర్ధవీడు), గిద్దలూరు మునిసిపల్ కమిషనర్ డి.వెంకటదాసు (బేస్తవారపేట), డీఎస్‌వో పద్మశ్రీ (కంభం), సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా (దోర్నాల), జడ్పీ సీఈవో బి.చిరంజీవి (గిద్దలూరు), జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు (కొమరోలు), మార్కాపురం మునిసిపల్ కమిషనర్ నారాయణరావు (మార్కాపురం), మార్కెటింగ్‌శాఖ ఏడీ ఉపేంద్ర (పెద్దారవీడు), వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌డీసీ శివరామిరెడ్డి (పుల్లలచెరువు), జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్ (రాచర్ల), విజిలెన్స్ ఎస్‌డీసీ ఎ.కుమార్ (తర్లుబాడు), ఏపీఎంఐపీ పీడీ రమణ (త్రిపురాంతకం)ను ప్రత్యేకాధికారులుగా నియమించారు. వీరితోపాటు మార్కాపురం ఎస్‌డీసీ సత్యనారాయణ (పైపాలెం), కేవోఆర్‌జీపీ ఎస్‌డీసీ సునీల్‌కుమార్ (సీఎస్ పురం), హౌసింగ్ పీడీ పి.శ్రీనివాసప్రసాద్ (దర్శి), ఏపీఐఐసీ జీఎం మదన్‌మోహన్ (దొనకొండ), ఒంగోలు డీఆర్డీ ఏడీఏ వెంకటరావు (హెచ్ఎంపాడు), కనిగిరి ఏడీఏ రమణ (కనిగిరి), జిల్లా రిజిస్ట్రార్ ఎ.బాలాంజనేయులు (కొనకనమిట్ల), జిల్లా ఆడిట్ అధికారి ఎల్.శంకరనారాయణరెడ్డి (కురిచేడు), పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ రవి (మర్రిపూడి), కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రీదేవి (పీసీపల్లి), దేవదాయశాఖ ఏసీ పానకాలరావు (పామూరు), జిల్లా మైన్స్ అధికారి రాజశేఖర్ (పొదిలి), కనిగిరి డీఐవోఎస్ రాజేంద్రప్రసాద్ (పొన్నలూరు), బీపీసీఎల్ ఎస్‌డీసీ శ్రీదేవి (వెలిగండ్ల) ప్రత్యేకాధిరులుగా వ్యవహరిస్తారు. డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ (చీమకుర్తి), ఒంగోలు డీఐవోఎస్‌లు ఎన్.శ్రీనివాసరావు (కొండపి), పరిశుద్ధరావు (కొత్తపట్నం), డీఆర్‌డీఏ పీడీ వసుంధర (మద్దిపాడు), మత్స్యశాఖ అధికారి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి (ముండ్లమూరు), జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.బేబిరాణి (నాగులుప్పలపాడు), ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు (ఒంగోలు), కేఆర్‌సీసీ ఎస్‌డీసీ ఎస్.వరకుమార్ (సంతనూతలపాడు), డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు (సింగరాయకొండ), సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ (టంగుటూరు), ఐసీడీఎస్ పీడీ ఎం.మాధురి (తాళ్లూరు), ఒంగోలు డీఐవోఎస్ యు.భాస్కర్(జరుగుమల్లి) ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.


కేంద్రమంత్రి గడ్కరీకి వినతిపత్రాన్ని అందిస్తున్న ఎంపీ

ఎన్‌హెచ్ 216ని విస్తరించాలి

చీరాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీని బుధవారం ఢిల్లీలో లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్ కలసి వినతి పత్రం అందజేశారు. నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి అమరావతి ఓఆర్ఆర్‌కు ప్రత్యక్ష కనెక్టివిటీ, మచిలీపట్నం ఓడరేవు, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్, ఓడరేవు, చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమను ఎన్‌హెచ్ 16కు కలుపుతూ ఎన్‌హెచ్ 216ను నాలుగు లైన్ల రోడ్డుగా విస్తరణ ఆవశ్యతను ఆ వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఎంపీ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

నడి రోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు

డ్రైవర్ అప్రమత్తంతో తప్పిన ముప్పు


ఇంకొల్లు సినిమా హాల్ కూడలిలో నిలిచిన ఆర్టీసీ బస్సు

ఇంకొల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులు మార్గమధ్యంలో ఆగిపోతున్నాయి. దీంతో గమ్యం చేరాల్సిన ప్రయాణికులు రోడ్డు మధ్యలోనే ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల పలు రూట్లలో ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. ఒంగోలు డిపోకు చెందిన బస్సు గురువారం ఇంకొల్లు నుంచి బయలుదేరి సినిమాహాల్ కూడలికి చేరుకోగా ఒక్కసారిగా కమాన్‌కట్ట విరిగి బస్సు అదుపుతప్పింది. డ్రైవర్ జాగ్రత్తగా బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

నాడు వీఆర్వోల తప్పులు.. నేడు రైతులకు శాపాలు

» భూమి అనుభవంలో ఉన్న వారి స్థానంలో వేరే పేర్లు » నిజమైన లబ్ధిదారులకు ఆన్‌లైన్ చేయడంలో చిక్కులు
» ఏళ్ల తరబడి పరిష్కారం కాక ఇక్కట్లు » అవసరాలకు భూమి అమ్మినా స్వాధీనం చేయలేని పరిస్థితి

అద్దంకి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాటి వీఆర్వోలు చేసిన తప్పులు.. నేడు రైతులకు శాపంగా మారాయి. భూమి తమ ఆధీనంలో ఉన్నా... రెవెన్యూ రికార్డులలో మాత్రం వేరే రైతుల పేర్లు ఉండడంతో అసలు చిక్కు వచ్చింది. గతంలో కొందరు వీఆర్వోలు ఉద్దేశపూర్వకంగా .. మరి కొందరు పొరపాటున భూములను ఆన్‌లైన్ చేసే క్రమంలో అనుభవంలో ఉన్న రైతుల పేర్ల స్థానంలో వేరే రైతుల పేర్లను నమోదు చేశారు. ఎప్పుడో బ్యాంక్ రుణాలు అవసరమైనప్పుడో, అవసరాలకు భూమి వి క్రయించే క్రమంలో ఆన్‌లైన్‌లో చూసుకొని అవాక్కు అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆలస్యంగా మేల్కొన్న రైతులు హడావుడి పడుతున్నా పని జరగక ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. అద్దంకి మండలంలోనే సుమారు 25 నుంచి 30 మంది రైతులు ఈ సమస్యతో సతమతమవుతున్నారు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 100 మంది రైతులకు పైగానే ఉన్నట్లు అంచనా. అద్దంకి మండలంలోని చినకొత్తపల్లికి చెందిన మానం మురళీమోహన్‌దాస్ వెంపరాల రెవెన్యూ పరిధిలో దశాబ్ద కాలం కిందట ఎకరం భూమిని కొనుగోలు చేశారు. ఏడాది కిందట ఆ భూమిని వేరే వ్యక్తులకు అమ్మారు. తీరా ఆన్‌లైన్‌లో తన పేరుకు బదులు వేరే వారి పేర్లు ఉన్నాయి. దానిని మార్పు చేసేందుకు ఏడాదిగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇక కొంగపాడుకు చెందిన కమ్మ నాగేశ్వరరావు కు పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తి ఉంది. అయితే వైసీపీ పాలనలో ఓ నేత ఒత్తిడితో నాగేశ్వరరావుకు చెందిన భూమిలో కొంత భాగాన్ని వైసీపీ నేత సూచించిన వ్యక్తి పేరుతో అప్పటి వీఆర్వో ఆన్‌లైన్‌లో ఎక్కించారు. విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు ఇప్పటికే పదుల సంఖ్యలో అధికారులకు అర్జీలు ఇచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇలా భూ సమస్యలతో రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తూనే ఉన్నారు. అయితే జరిగిన తప్పులు, పొరపాట్లను రైతులకు రెవెన్యూ అధికారులు చెప్పకుండా కాలయాపన చేస్తున్నారు. ఆ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న రైతులు ఏమి చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు. రైతులు అర్జీలను తహసీల్దార్ కార్యాలయంలో అందిస్తే ఆన్‌లైన్‌లో పేరు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారు. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో పేరు ఉన్న రైతులు వచ్చి భూమి తమది కాదని తహసీల్దార్ సమక్షంలో సంతకాలు చేస్తే సదరు భూమిని అసలు రైతు పేరుతో తిరిగి ఆన్‌లైన్‌లో తహసీల్దార్ లాగిన్‌లో మార్పు చేస్తారు. అయితే అత్యధిక శాతం రైతులు మాత్రం భూమి తమది కాకపోయినా వచ్చి సంతకాలు చేసేందుకు ఇష్టపడడం లేదు. దీంతో సమస్య ఉత్పన్నమవుతోంది. అలాంటి పరిస్థితులలో ఆర్డీవో, జాయింట్ కలెక్టర్‌కు మాత్రమే అధికారం ఉంటుంది. ఆన్‌లైన్‌లో భూములు ఎక్కించిన తరువాత తొలగింపు, రైతుల పేర్లు మార్పు తహసీల్దార్ పరిధిలో లేకపోవడంతో ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంత దూరం రైతులు వెళ్లలేక, వెళ్లినా ఆలస్యం అయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి ప్రతి మండలంలో ప్రత్యేకంగా ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అదే సమయంలో ఉద్దేశపూర్వకంగా అధికారులు తప్పులు చేసినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో తప్పులు చేయకుండా ఉండే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఏడాదిగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదు



వెంపరాల రెవెన్యూ పరిధిలో గతంలో కొనుగోలు చేసిన ఎకరం భూమి ని కుటుంబ అవసరాల కోసం అమ్మాను. అయితే ఆన్‌లైన్‌లో వేరే రైతుల పేరుతో ఉన్నాయి. దీంతో ఇప్పటికీ పరిష్కారం కాక అమ్మిన భూమిని రిజిస్ట్రేషన్ చేసే వీలు లేకుండా పోయింది. తమ పరిధిలో లేనందున ఆర్డీవో వద్దకు వెళ్లమని చెప్తున్నారు.

- మానం మురళీమోహన్‌దాస్, రైతు, చినకొత్తపల్లి, అద్దంకి మండలం

భూమి ఆరోగ్యం అందరి బాధ్యత


మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

అద్దంకిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం ప్రపంచ భూమి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏవో కార్యాలయం వద్ద రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేసి అ వగాహన కల్పించారు. ఆయా రైతుల భూములలో ఉన్న లోపాలను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడడం వలన భూమి ఆర్యోగం దెబ్బతింటుందని, వాటిని తగ్గించాలన్నారు. భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోతున్నందున దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయన్నారు. పొలాల్లో ప్లాస్టిక్ కవర్లు ఎక్కువగా ఉంటున్నాయని, అవి భూమిలో కలవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుందని అవి లేకుండా చూసుకోవాలన్నారు. పచ్చిరొట్ట పైరు సాగు చేసి భూమిలో కలియదున్నడం వలన భూమి ఆరోగ్యంగా తయారవుతుందన్నారు.

గవినివారిపాలెం : నేలను సంరక్షించడం వలన భావితరాలకు బంగారు బాటలు ఏర్పడతాయని తద్వారా రైతులతో పాటు దేశం సస్యశ్యామలంగా ఉంటుందని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం వాణిశ్రీ అన్నారు. వ్యవసాయాధికారి సుమతి ఆధ్వర్యంలో చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంలో ప్రపంచ నేలదినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

ఎస్టీపీ ప్లాంట్‌పై స్థానికుల నిరసన

చీరాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దళితులు నివసించే ప్రాంతాలు, సమీపంలో స్కూల్ ఉన్నా కూడా మురుగు నీటి శుద్ధి కేంద్రం దండుబాట రోడ్డులో ఏర్పాటు చేయడం అన్యాయమని పలువురు దళిత సంఘాల నేతలు, స్థానికులు అన్నారు. మునిసిపల్ అధికారులు సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఎస్టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. అయితే దీనిపై అభ్యంతరం తెలుపుతూ ఇప్పటికే పలుమార్లు స్థానికులు నిరసనలు చేపట్టారు. ఈక్రమంలోనే గురువారం మరోసారి నిరసన తెలిపారు. అక్కడ డా.బిఆర్ అంబేడ్కర్ పేరుతో మునిసిపల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్పస్వామి నగరోత్సవం

వేటపాలెం,చీరాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : అణుమల్లిపేటలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నగరోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రికి భిక్ష వితరణ జరిగింది. కార్యక్రమంలో దీక్షధారులు, భక్తులు పాల్గొన్నారు.

బైకు దొంగ అరెస్టు

ఇంకొల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు, కారంచేడు మండలాల్లో ద్విచక్రవాహనం దొంగిలిస్తున్న పర్చూరు మండలం బోడవాడ గ్రామానికి చెందిన కోడూరి శ్రీనివాసరావును ఇంకొల్లు పోలీసులు గురువారం అరెస్టు చేసారు. శ్రీనివాసరావు ఇంకొల్లు ప్రాంతంలో దొంగిలించిన మూడు మోటర్‌సైకిళ్లను, కారంచేడుకు సంబంధించిన ఒక కేసులో బైక్‌ను రికవరీ చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. మండలంలోని అడ్డరోడ్డు నిందితుడు శ్రీనివాసరవును అదుపులోకి తీసుకొని పర్చూరు కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకుడు మృతి

మార్టూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు దొడ్డా వీరబ్రహ్మానందం (75) అనారోగ్య కారణంగా గురువారం మధ్యాహ్నం విద్యానగర్‌లోని స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.ఆయన మృతదేహానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల బాపయ్యతోపాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శుక్రవారం అంత్యక్రియలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చినగంజాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ శీలం రమేష్ తెలిపిన వివరాల మేరకు.. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని లారీ ఆటోని ఢీకొట్టింది. ఈ సంఘటనలో 7గురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని క్రిస్టియన్‌పేటకు చెందిన రేపూరి సుమలత (37)కు తీవ్రగాయాలు కావడంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో సుమలత చికిత్స పొందుతూ గురువారం వేకువజామున మృతి చెందింది. గుంజి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన షేక్ మస్తానీ పరిస్థితి విషమం ఉంది.

జీవనం కోల్పోయిన కుటుంబం

రోడ్డు ప్రమాదంలో సుమలత మృతి చెందడంతో కుటుంబం జీవనాధారం కోల్పోయింది. సుమలతకు భర్త పీటర్‌పాల్, ముగ్గురు కుమారులు ఉన్నారు. పీటర్‌పాల్ పెయింటర్‌గా పనిచేస్తుండగా, సుమలత రొయ్యల ఫ్యాక్టరీలో పనికి వెళ్తతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్దకుమారుడు జైశంకర్‌బాబు డిగ్రీ మొదటి సంవత్సరం, రెండవకుమారుడు జగదీష్‌బాబు ఇంటర్, మూడవ కుమారుడు పదో తరగతి చదువుతున్నారు. భార్య మృతితో కుటుంబ పోషణ ఎలా అని భర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రీయ రహదారిలో కానరాని స్వచ్ఛత

» ఎక్కడికక్కడ చెత్త వ్యర్థాలు
» కంపుతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
» పట్టించుకోని నామ్ రోడ్డు అధికారులు


కొమ్మాలపాడు వద్ద రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాలు

బల్లికురవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి వ్యర్థాలకు కేరాఫ్‌గా మారింది. ఈ రోడ్డులో పలు గ్రామాల కూడళ్లలో కొందరు వ్యర్థాలను రోడ్ల వెంబడి పడేసి వెళ్తున్నారు. దీంతో తీవ్రమైన కంపుతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రుళ్లు కొందరు కోళ్ల వ్యర్థాలను సైతం రోడ్ల మార్జిన్లలో పడవేస్తున్నారని దీంతో రోడ్ల మీద వెళ్లే ప్రజలు ముక్కు మూసుకు వెళ్లాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలోని నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కనే ఉన్న కొప్పెరపాడు, రామాంజనేయపురం, కొమ్మాలపాడు, వేల్పూరు, సంతమాగులూరు గ్రామాల పరిధిలో ఉన్న రోడ్ల వెంబడి వ్యర్థాలు పెద్ద ఎత్తున పడ వేసి ఉన్నాయి. కోళ్ల వ్యర్థాలు, ఖాళీ కొబ్బరి బొండాలను పడవేసి ఉండడంతో దుర్వాసన వస్తుందని ప్రయాణికులు అంటున్నారు. రోడ్ల వెంబడి వ్యర్థాలు పడవేసి వెళుతున్న నామ్‌రోడ్డు అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, కర్నూలు రోడ్డులో కూడా వ్యర్థాలు పెద్ద ఎత్తున పడేస్తున్నారు. రోడ్డు పక్కనే వ్యర్థాలు వేసి ఉండడంతో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. గ్రామాలలో ఎక్కడ చూసినా వ్యర్థాలు ఉండడంతో చేసేది లేక కొందు రోడ్లపై పడేస్తున్నారు. ఇలా అయితే స్వచ్ఛత ఎలా వస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పలు రాష్ట్రాల ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డు అపారిశుధ్యంగా ఉండడం చూసి వారు ముక్కున వేలేసుకుంటున్నారని, చిరు వ్యాపారులు సైతం కొందరు వారి వద్ద ఉన్న వ్యర్థాలను రోడ్ల వెంబడి పడవేస్తున్నారని వారు తెలిపారు. నామ్‌రోడ్డు అధికార్లు వెంటనే రోడ్ల వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


నామ్ రోడ్డు కొప్పెరపాడు వద్ద వేసిన కొబ్బరి బొండాలు



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర మైనారిటీసెల్ నాయకులు రజాక్

దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తాం

మార్టూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభా వంతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవం సందర్భంగా గురువారం మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు నియోజకవర్గ అధ్యక్షుడు గద్దె అశోక్ అధ్యక్షత వహించారు. అనంతరం మరో ముఖ్య అతిథి మార్టూరు పట్టణ అధ్యక్షులు కామినేని జనార్దన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు పెన్షనును రెట్టింపు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. ఎమ్మెల్యే సహకారంతో వారికి పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తొండెపు ఆదినారాయణ, నీలజోష్‌బాబు, గోగిన ఆదిశేషు, షేక్ రహమాన్, షేక్ మున్నేపల్లి కాలేషావలి పాల్గొన్నారు.

రోజూ పిల్లలను కేంద్రాలకు పంపించాలి


మాట్లాడుతున్న అంగన్వాడీ సూపర్ వైజరు పద్మజ

జె.పంగులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాలలో బాలలకు అందించే విద్య ప్రాముఖ్యతను తల్లులు గుర్తించి రోజూ కేంద్రానికి పిల్లలను పంపించాలని ముప్పవరం అంగన్‌వాడీ సెక్టారు సూపర్ వైజర్ పద్మజ అన్నారు. గురువారం మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈడే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రంలో బాలలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. తల్లులతో మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పట్ల, వారి చదువు పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు శీలక్ష్మి, అనిత, పలువురు పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

హత్యా.. ప్రమాదమా?

» అనుమానాస్పదంగా గుర్తుతెలియని వ్యక్తి మృతి
» విజయనగర్ కాలనీ వద్ద కాలువలో మృతదేహం
» అతని తలకు బలమైన గాయం
» దర్యాప్తు చేస్తున్న ఈపూరుపాలెం పోలీసులు

చీరాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయగనర్ కాలనీ సమీపంలోని ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కన్పించింది. అయితే తూటికాడకు ఇరుక్కుని మృతదేహం నీళ్లపై తేలియాడుతుండడం గమనించిన స్థానికులు ఈపూరుపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై చంద్రశేఖర్ చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరి యా వైద్యశాలకు తరలించారు. అతని తలకు బలమైన రక్త గాయం ఉంది. ఈక్రమంలో ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ కదిలే రైలులో ప్రయాణిస్తు ప్రమాదవశాత్తు జారిపడ్డాడా? లేక ఎవరైనా హతమార్చి కాలువలో పడివేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నాలుగు రోజుల కిందట ఈ ఘటన జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. అతని వివరాలు తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులలో ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు అధికారులకు చెప్పారు. ఆర్డీవో కార్యాలయంలో గురు వారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. సమస్యల పరిష్కారంలో చేపట్టాల్సిన విధి, విధానాలని పాటించాలని చెప్పారు. తహసీల్దార్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, అర్జీదారులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : చీరాల మండల పరిధిలో ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారం దిశగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. ఈక్రమంలోనే మొదటి రోజు గవినివారిపాలెం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అర్జీదారులు అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు.

పంగులూరు : రెవెన్యూ సదస్సులను ఈ నెల 10 నుంచి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సులో భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కస్తామన్నారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించే రెవెన్యూ సదస్సులలో తహసీల్దార్‌తో పాటు సర్వేయర్, వీఆర్వో, రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రతినిధి, దేవదాయ శాఖ అధికారి పాల్గొంటారని తెలిపారు.

చినగంజాం : 6వ తేదీన చినగంజాం, 10న కొత్తపాలెం, 11న మున్నంవారిపాలెం, 12న రాజుబంగారుపాలెం, 17న పల్లెపాలెం, 18న మోటుపల్లి, 19న పెదగంజాం, 20న నీలాయపాలెం, 27న సంతరావూరు, 2025 జనవరి 3న గొనసపూడి, 4న చింతగుంపల్లి, 8న కడవకుదురు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రభాకరరావు తెలిపారు.

అద్దంకి : మండలంలో జరిగే రెవెన్యూ సదస్సులను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్‌ను మార్పు చేసినట్లు తెలిపారు. శుక్రవారం మణికేశ్వరం, కొంగపాడులో, 10న వెంపరాల, 11న మైలవరం, 12న చక్రాయపాలెం, గోపాలపురం, 13న ధేనువకొండ, 17న కలవకూరు, 18న శింగరకొండపాలెం, 19 న మోదేపల్లి,నన్నూరపాడు, 20న కుంకుపాడు, 21న తిమ్మాయపాలెం,రామాయపాలెం, 24 న కొటికలపూడి, 26న బొమ్మనంపాడు, జార్లపాలెం, 27న చినకొత్తపల్లి, గోవాడ, 28 న నాగులపాడు, వెంకటాపురం, 31 దక్షిణ అద్దంకి, జనవరి 2న వేలమూరిపాడు, విప్పర్లవారిపాలెం, 3 న ఉత్తర అద్దంకి, 4 న ధర్మవరం, శంకవరప్పాడు, 7 న ఉప్పలపాడు, 8 న నరశింహపురం(గోపాలపురం)లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్టు పోస్టు ఖాళీ

» సిజేరియన్ కాన్పు కోసం పట్టణాలకు
» అందుకు రూ.30వేల ఖర్చు
» ఇబ్బందులు పడుతున్న గర్భిణులు


మార్టూరు ఆస్పత్రిలో వైద్యానికి వచ్చిన మహిళలు

మార్టూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెండుకోట్లరూపాయలకు పైగా వ్యయంతో నిర్మించిన మార్టూరులోని 30 పడకల ఆస్పత్రిలో సిజేరియన్ కాన్పులు జరగడంలేదు. ఆరు నెలల కిందట గైనకాలిజిస్టుగా ఉన్న మహిళా డాక్టర్ ఉద్యోగోన్నతిపై వెళ్లారు. అప్పటి నుంచి గర్భిణులు ప్రసవ సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. దానికి తోడు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక్క మహిళా వైద్యురాలు కూడా లేకపోవడంతో రోగులు అసంతృప్తికి గురవుతున్నారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌తోపాటు అన్ని వసరతులు ఉన్నా గైనకాలిజిస్టు లేకపోవడంతో సిజేరియన్ కాన్పులు కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సినపరిస్థితి ఏర్పడింది. మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి మండలంలోని గ్రామాలతోపాటు, యద్దనపూడి మండలంకు చెందిన ప్రజానీకం కూడా వైద్యం కోసం వస్తుంటారు. దాదాపుగా రోజూ ఆస్పత్రికి వందకు పైగా ఓపీ వస్తుందంటే అతిశయోక్తికాదు. వారిలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలు ఎక్కువగా సాధారణ వ్యాధులు, ఇతరత్రా వైద్యం కోసం వస్తుంటారు. అంతేగాకుండా గర్భిణులు కూడా వైద్య సేవలు కోసం వస్తుంటారు. రాష్ట్రానికి చెందిన వారు కాకుండా, గ్రానైట్ పరిశ్రమలలో, నూలుమిల్లుల్లో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మిక కుటుంబాలకు చెందిన వారు కూడా వైద్యం కోసం వస్తుంటారు. అయితే ప్రసవం కోసం ఆస్పత్రికి వస్తే సాధారణ కాన్పు అయితే వైద్యులు చేస్తున్నారు. అదే సిజేరియన్ (ఆపరేషన్) కాన్పు చేయాల్సివచ్చినపుడు గైనకాలిజిస్టు లేరని వారిని వెనక్కి పంపుతున్నారు. దీంతో వారు వ్యయప్రయాసలు పడి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థికంగా నష్టపోతున్నాం

ప్రైవేటు ఆస్పత్రిలో సిజేరియన్ కాన్పు జరిగితే సుమారు రూ.30వేల వరకు ఖర్చు అవుతున్నదని కుటుంబ సభ్యులు చెప్తున్నారు. మార్టూరు నుంచి సిజేరియన్ కాన్పు కోసం చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి ఎక్కువగా మహిళలు వెళుతుంటారు. ఇంకా కొంతమంది అద్దంకి, మేదరమెట్ల, నరసరావుపేట ఆసుపత్రులకు వెళుతుంటారు. వారికి 30 వేల ఖర్చు ఎంతో భారంగా ఉంటుంది. అదే గనుక మార్టూరు ఆస్పత్రిలో సిజేరియన్ కాన్పు జరిగితే అతి తక్కువ ఖర్చుతో గర్భిణులు ఇంటికి చేరుతారు. కానీ గైనికాలజిస్టు పోస్టులో కొత్త వైద్యులు ఎవరూ రాకపోవడంతో ఆస్పత్రిలో సిజేరియన్ మాటే వినబడటం లేదు. ఈ విషయమె ఆస్పత్రి సూపరింటెండెంట్ విష్ణుతేజను వివరణ కోరగా గైనకాలిజిస్టు లేని కారణంగా సిజేరియన్ కాన్పులు చేయడం లేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

శిథిలావస్థలో తరగతి గదులు
భయం గుప్పిట్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు
8

రెవెన్యూ సదస్సులకు సర్వం సన్నద్ధం

- నేటి నుంచి జనవరి 8 వరకు నిర్వహణ
- రైతులు, ప్రజల నుంచి వినతుల స్వీకరణ
- కొన్ని అక్కడికక్కడే, మరికొన్ని నిర్ణీత గడువులోగా పరిష్కారం

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులో వేస్తోంది. ఇందులోభాగంగా నేటినుంచి నెలరోజులపాటు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పూనుకుంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి గత వైసీపీ సర్కారు హయాంలో జరిగిన భూముల రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. జిల్లాలోని 329 గ్రామాలలో సభలు నిర్వహించగా వేలాదిగా రెవెన్యూ, సర్వే శాఖలకు ప్రజల నుంచి వినతులు అందాయి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రెవెన్యూ సమస్యలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటిపై ప్రజలు నెత్తినోరు మొత్తుకున్నా పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నిర్వహించిన ప్రజావేదికలో భూ సమస్యలపైనే ప్రజలు భారీగా అర్జీలు సమర్పించారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వీటిపైనే అర్జీలు అందడంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. గ్రామ, గ్రామాన సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించనున్నారు.

శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు ఈ సదస్సులు ప్రారంభమవుతాయి.

- సర్వే నెంబర్లలో మార్పులు, భూ విస్తీర్ణంలో తేడాలు, ఈ సర్వేలో తప్పులు, కబ్జాలతో ప్రజలు కోల్పోయిన భూములు, అసైన్డ్, చుక్కల భూముల వంటి వాటిపై అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు.
- రీసర్వేపై వచ్చిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం గ్రామపెద్దలు, సర్పంచ్‌ల సమక్షంలో వివరించి పరిష్కరించనున్నారు.
- రైతులు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పీజీఆర్ఎస్‌లో నమోదు చేస్తారు.
- సదస్సుల నిర్వహణకు ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని కలెక్టర్ ఆనంద్ నియమించారు.
- సదస్సులకు తహసీల్దారుపాటు భూముల విషయానికి సంబంధించిన రెవెన్యూ డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, వక్ఫ్, అటవీ అధికారులు పాల్గొంటారు. అలాగే రెవెన్యూ బృందాలన్నీ ఈ సదస్సులకు హాజరవుతాయి.

సద్వినియోగం చేసుకోవాలి : జేసీ

భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని జేసీ కార్తీక్ తెలిపారు. ప్రజలు, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులలో అందిన ఫిర్యాదులను పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి పరిష్కరించగలిగినవి అక్కడికక్కడే పరిష్కరించడంతోపాటు, మిగిలినవి ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.



విధులు భళా.. భత్యం డీలా!
6
నేడు హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం




చెరువు కాదండోయ్..
నెల్లూరు : స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ స్కూలు మైదానంలో వర్షపునీరు



తీడని వాన

- పది రోజులుగా ఎడతెరిపి లేకుండా..
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం, దెబ్బతిన్న రోడ్లు
- ప్రాజెక్టులు, చెరువులకు జలకళ
- తాజాగా అల్పపీడన హెచ్చరికలతో గుబులు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) :ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో పది రోజులు వర్షం కురుస్తూనే ఉంది. గురువారం కూడా నెల్లూరు నగరంతోపాటు మెట్టప్రాంతంలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 25.5 మిమీగా నమోదవగా, సంగంలో అత్యధికంగా 91.2 మిమీ, అత్యల్పంగా కావలి, గుడ్లూరులలో 2.2 మిమీ వర్షం పడింది. బుచ్చిలో 68.2 మి.మీ, మర్రిపాడులో 53.6, ఏఎస్‌పేటలో 50.8, నెల్లూరు అర్బన్‌లో 26.2, నెల్లూరు రూరల్‌లో 28.6 మి.మీ వర్షం పడింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన ప్రాజెక్టులతోపాటు చెరువులూ జలకళను సంతరించుకున్నాయి. మెట్టప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. అయితే, వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారాయి. అయితే, బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడుతోందని, దీనిప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలపడంతో అటు ప్రజలు, ఇటు రైతుల్లో ఆందోళన రేగుతోంది.



ఉదయగిరి రూరల్ : పిల్లాపేరు వాగులో వరద



లింగ సముద్రంలో రోడ్డుపై నిలిచిన నీరు

కందుకూరులో పొంగిన వాగులు



కందుకూరులో ఎర్రవాగు ఉధృతి

కందుకూరు (ఆంధ్రజ్యోతి) : బుధవారం రాత్రి, గురువారం ఉదయం భారీ వర్షం కురవడంతో పందివాగు, తూములేరు, మన్నేరులు ఉప్పొంగాయి. మోపాడు చెరువు పదిగేట్లు ఎత్తి నీటిని ఎర్రవాగుకు వదలడంతో కందుకూరు - కొండముడుసుపాలెం గ్రామాల మధ్య ఉగ్రరూపం దాల్చింది. దీంతో కందుకూరు నుంచి కావలి, తెట్టు, గుడ్లూరు మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సులను మధ్యాహ్నం నుంచి ఆపేశారు. ఇతర వాహన రాకపోకలూ స్తంభించాయి. అలాగే కందుకూరు నుంచి చుట్టుగుంట, ఆత్మకూరు, ఉలవపాడు మార్గంలోనూ వాగులు పొంగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే కందుకూరు పట్టణంలోని వర్షపు నీరు వెళ్లే ఎర్రవాగు పొంగటంతో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోయి లోతట్టు ప్రాంతాలలో మోకాటిలోతున నీరు చేరింది. కోటారెడ్డి నగర్, కేసరి గుంట, ఉప్పుచెరువు ప్రాంతాలతోపాటు ఆర్టీసీ బస్టాండ్‌లోనూ నీళ్లు ఆగిపోయాయి.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : గురువారం మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంట వరకు లింగసముద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో తిరుమణిశెట్టి కోటయ్య మందిరం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు, అలాగే మీసేవా కేంద్రం నుంచి కల్యాణ మండపం వరకు నీళ్లు నిలబడ్డాయి. మండలంలోని పలు గ్రామాల్లో కూడా వర్షం కురిసి అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు పొంగి పారాయి.

పెన్నా వద్దకు వెళ్లొద్దు : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : రానున్న రెండు రోజులు పెన్నా నది వద్దకు ప్రజలు ఎవరూ వెళ్లవద్దని కలెక్టర్ ఆనంద్ సూచించారు. సోమశిల ప్రాజెక్టులో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద రాకను బట్టి నీటి విడుదల ఉంటుంద న్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సుమారు 2 వేల ఎకరాల్లో నీళ్లు నిలిచాయని తెలిపారు. ఆ నీటిని తొలగించి, నష్టం అంచనాలను తేలుస్తామన్నారు.

- **సంగంలో మునిగిన వరినాట్లు**

సంగం (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి కురుసిన భారీ వర్షానికి దువ్వూరు చెరువు నిండి వంగల్లు వద్ద కలుజుపై నీళ్లు ప్రవహించాయి. వంగల్లు, మర్రిపాడు తదితర గ్రామాల్లో వరి నాట్లు మునిగిపోయాయి. ఉదయం నుంచి వర్షం లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ముంబయి హైవేపై అర్ధగంటపాటు నీటి ప్రవాహం తగ్గలేదు. ఎస్సీ బాలికల వసతి గృహం జలమయం



సంగంలో నీట మునిగిన వరినాట్లు

(మిగతా 6లో)

పండుగ వాతావరణంలో పేరెంట్-టీచర్ సమావేశాలు

తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలి

కలెక్టర్ ఆనంద్ పిలుపు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం జరిగే పేరెంట్-టీచర్ సమావేశాలను ఓ పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 2,604 పాఠశాలల్లో జరిగే ఈ సమావేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని కోరారు. అభ్యాసన వ్యవస్థలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు ముఖ్య భాగమని, పిల్లల బలాలు, బలహీనతలపై చర్చించుకోవడానికి, తద్వారా వారి ఎదుగుదలకు ఉపాయోగపడతాయని చెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక షెడ్యూల్ ప్రకారం వివిధ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఇందుకోసం అన్ని పాఠశాలల్లో నిర్వహణ కమిటీలను నియమించామన్నారు. ప్రతి పాఠశాలలో జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొనున్నట్లు తెలిపారు. పిల్లల చదువుకు సంబంధించి ప్రోగ్రస్‌కార్డులు ఇవ్వడంతోపాటు తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్‌ఆఫ్ వార్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గుర్తించిన 42 పాఠశాలల్లో ఆరోగ్యపరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డు అందజేస్తామని పేర్కొన్నారు. అందరితో సహపంక్తి భోజనాలతో సమావేశాలు ముగస్తాయన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు రూ.48 లక్షలు కేటాయించామనీ, ప్రతి మండలానికి ప్రత్యేకాధికారిని నియమించినట్లు తెలిపారు.



- **కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం**

ఈ సమావేశాలకు సంబంధించి వివిధ శాఖల సిబ్బందితో శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కంట్రోల్ రూము నడుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈఓ ఆర్.బాలాజీరావు పాల్గొన్నారు.

54 మంది కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను (పురుష) తొలగించాలన్న హైకోర్టు ఉత్తర్వులతో జిల్లాలో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మొత్తం 54 మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తూ డీఎంహెచ్‌వో పెంచలయ్య ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు 20 ఏళ్లుగా ఈ హెల్త్ అసిస్టెంట్లు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్నారు. 2002, 2006 సంవత్సరాలలో వీరంతా డీఎస్‌సీ (డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ) పరీక్ష రాసి 179 మంది ఉద్యోగాల్లో చేరారు. అయితే 2012లో జీవో (మిగతా 6లో)

ఎఫ్‌డీఆర్ పనుల్లో కొనసాగుతున్న దోపిడీ

- మూడేళ్ల క్రితం పనులకు ఇంకా బిల్లులు
- ఇటీవల సంగంలో వెలుగుచూసిన బాగోతం
- తాజాగా కోవూరు సెక్షన్‌లో బట్టబయలు
- వైట్‌నర్‌తో క్యూసీ సర్టిఫికెట్ ట్యాంపరింగ్
- బిల్లు వెనక్కు పంపిన పీఏవో
- 'ఇరిగేషన్'లో ఇంకెన్ని ఉన్నాయో!?

నెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారినా ఎఫ్‌డీఆర్ (ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్) పనుల్లో దోపిడీ మాత్రం ఆగడం లేదు. ఎప్పుడో మూడేళ్ల క్రితం ఎఫ్‌డీఆర్ ముసుగులో మొదలైన అక్రమాల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. లెక్కకు మించి నాడు అనుమతులు మంజూరు చేయడం మొదలు.. గడువు ముగిసినా బిల్లులు పెడుతుండడం వరకూ అడుగడుగునా ఉల్లంఘనలు జరుగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులే ఇందులో కీలకంగా వ్యవహరించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో నాడు అధికారుల అక్రమ వ్యవహారాలు బట్టబయలయ్యాయి. అయితే తాజాగా కోవూరు సెక్షన్‌లో మారో వ్యవహారం వెలుగులోకి రావడంతో ఇరిగేషన్ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2021-22 నాటి ఎఫ్‌డీఆర్ వర్కుకు ఇటీవల బిల్లు అప్‌లోడ్ చేశారు. ఇలా అప్‌లోడ్ చేయడమే పెద్ద తప్పయితే.. ఈ వర్కుకు ట్యాంపరింగ్ చేసిన క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌ను జత చేయడం మరో పెద్ద తప్పు. బుచ్చి సబ్ డివిజన్ నుంచి రూ.10 లక్షలు విలువ చేసే ఈ బిల్లు సెంట్రల్ డివిజన్‌కు రావడం.. అక్కడ పరిశీలించకనే అప్‌లోడ్ చేయడం జరిగిపోయాయి. అయితే ఈ బిల్లు పే అండ్ అకౌంట్స్ (పీఏవో) అధికారి వద్దకు వెళ్లాక బ్రేక్ పడింది. బిల్లు మంజూరు సమయంలో పీఏవో క్యూసీ సర్టిఫికెట్‌ను పరిశీలించగా అసలు బాగోతం బయటపడింది. నిబంధనల ప్రకారం క్యూసీ సర్టిఫికెట్‌లో కొట్టివేతలు, దిద్దుబాటులు ఉండకూడదు. కానీ ఈ బిల్లు విషయంలో ఏకంగా వైట్‌నర్‌తో చెరిపేసి దానిపైన కొత్తగా వర్కు, బిల్లు వివరాలు రాసి ఉన్నారు. ఒకసారి క్యూసీ అధికారులు ఒక వర్కుకు సర్టిఫికెట్ ఇచ్చాక, దానిని మార్చే అధికారం ఇతర అధికారులకు లేదు. కానీ వర్కు వివరాలు, అగ్రిమెంట్ వ్యాల్యూ, ఎస్టిమేషన్ వ్యాల్యూ ఫైనల్ బిల్ కాలమ్స్ అన్నింటిలోనూ వైట్‌నర్‌తో చెరిపి వేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. నిజంగా క్యూసీ అధికారులు ఆ సర్టిఫికెట్‌ను ఈ వర్కుకే ఇచ్చారా..? లేక మరో వర్కుకు ఇచ్చిన సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేసి ఈ వర్కుకు ఉపయోగించారా..? అన్నది తేలాల్సి ఉంది. అన్నిటికన్నా ప్రధానంగా ఎప్పుడో మూడేళ్ల క్రితం వర్కుకు ఇప్పుడు బిల్లు ఎలా పెట్టారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ బిల్లు పీఏవో నుంచి రిటర్న్ అయ్యింది కాబట్టి బయటకొచ్చింది. మరి బయటకు రాని బిల్లులు ఇంకెన్ని ఉన్నాయోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.



వైట్‌నర్‌తో వివరాలు చెరిపేసి దానిపై మళ్లీ వివరాలు రాసిన క్యూసీ సర్టిఫికెట్

- **మొదటి నుంచీ దోపిడీనే!**

వైసీపీ ప్రభుత్వంలో ఎఫ్‌డీఆర్ ముసుగులో భారీ దోపిడీ జరిగింది. ఎప్పుడూ లేని విధంగా ఒక్క 2021-22లోనే సుమారు రూ.232 కోట్లు విలువైన వర్కులను ఎఫ్‌డీఆర్ కింద కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి అప్పటి ఎమ్మెల్యేలు మంజూరు చేయించారు. వరదలు, వర్షాల మూలంగా దెబ్బతిన్న పనులకు మాత్రమే ఎఫ్‌డీఆర్ కింద అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇష్టమొచ్చినట్లు మంజూరు చేశారు. ఇందులో సింహభాగం మట్టి పనులే కావడం గమనార్హం. నిబంధనల ప్రకారం రూ.5 లక్షలు దాటితే టెండర్లు పిలవాల్సి ఉన్నా నాడు ఎమ్మెల్యేల ఒత్తిళ్లతో అధికారులు రూ.10 లక్షల చొప్పున వర్కులను విభజించి నామినేషన్ పద్ధతిలో వైసీపీ నేతలకు కట్టబెట్టారు. అయితే చాలా పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకున్నారన్న ఆరోపణలు మొదటి నుంచీ వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే అత్యవసరంగా చేయాల్సిన ఎఫ్‌డీఆర్ పనులను సంవత్సరాల తరబడి చేస్తూనే ఉన్నారు. నాడు మంజూరైన వర్కుల్లో సుమారు రూ.10 కోట్ల విలువైన వర్కులు చేయలేదు. అందులో ఒక్క బుచ్చి సబ్ డివిజన్ పరిధిలోనే సుమారు 6 కోట్ల వరకూ ఉంటాయని అంచనా. అయితే నాడు పనులు చేయని వర్కులకు అప్పట్లోనే పనులు చేసినట్లుగా చూపించి ఇప్పుడు బిల్లులు పెట్టుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఇరిగేషన్ శాఖలో ప్రచారం జరుగుతోంది. కొందరు అధికారులు పాత తేదీలతో బిల్లులు రికార్డు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల సంగంలో జరిగింది కూడా ఇదేనని చెప్పుకుంటున్నారు. తాజాగా కోవూరు సెక్షన్‌లో మరోసారి ఇటువంటి వ్యవహారం బయటపడడం చర్చనీయాంశంగా మారింది. కాగా దీనిపై సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా కోవూరు సెక్షన్‌లోని బిల్లును పీఏవో రిటర్న్ చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ వర్కుకు సంబంధించిన క్యూసీ సర్టిఫికెట్‌లో కొట్టివేతలు ఉండడంతో మళ్లీ కొత్తగా క్యూసీ సర్టిఫికెట్ తీసుకుంటున్నట్లు చెప్పారు. అసలు ఈ నంబర్ కలిగిన క్యూసీ సర్టిఫికెట్ ఏ వర్కుకు ఇచ్చారన్న విషయాన్ని క్వాలిటీ కంట్రోల్ ఈఈ ధనుంజయ్‌ను అడగ్గా ఆయన సమాధానం కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

పచ్చళ్ల తయారీలో శిక్షణ

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం గ్రామాల మహిళా సంఘాలకు అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్, అదానీ ఫౌండేషన్, కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, పోలేరమ్మ తల్లి, మహిళా సంఘం, తిరుమలేశ్ స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో గురువారం మసాలా ప్యాకేజింగ్, మార్కెటింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ మాట్లాడుతూ ఈ శిక్షణ మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో, ఆర్థిక అవకాశాలను అన్వేషించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. శిక్షణ పొందిన మహిళల రోజువారీ జీవితాల్లో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ వేణు గోపాల్, అదాని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ హెడ్ కల్యాణ్, కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈవో వెంకటేష్, అదాని ఫౌండేషన్ హెచ్ఓడీ రమేష్‌బాబు, కో ఆర్డినేటర్‌లు మురళీ, షాహుల్, హమీద్, అరుణ్ పాల్గొన్నారు.



క్రిస్మస్ సన్నాహాలు మొదలు

క్రిస్మస్ పండుగకు జిల్లాలో సన్నాహాలు మొదలయ్యాయి. ఏటా నవంబరు 25 నుంచి జనవరి 1వతేదీ వరకు జిల్లా అంతా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటారు. క్రైస్తవుల ఇళ్లు, చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో వివిధ ఆకృతుల్లో చిన్నా, పెద్దా క్రిస్మస్ చెట్లు, నక్షత్రాలు ఏర్పాటు చేసి క్రీస్తు జననానికి స్వాగతం పలుకుతారు. నెల్లూరు నగరంలో పదేళ్లుగా ఐక్య సింహపురి క్రిస్మస్ వేడుకలు, సింహపురి క్యారెల్స్ నిర్వహిస్తున్నారు. చర్చిల్లో ప్రతీ రోజు ఒక గంట బైబిల్ పఠనం, ప్రార్థనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సామూహి కంగా భక్తిగీతాలాపన, నాటకాలు ప్రదర్శిస్తారు. పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవుల ఇళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా, క్రిస్మస్ సందర్భంగా దుకాణాల్లో వివిధ రంగుల స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, బాల ఏసు జననం బొమ్మలు, అలంకరణ వస్తువులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే వీటి ధరలు గతేడాదికన్నా దాదాపు 25శాతం పెరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)







కొండలను కమ్మేసిన మేఘాలు

పచ్చని అందం.. పరవశింపజేసే సోయగం!

ఆకాశాన్ని తాకినట్టు కనిపించే కొండలు. కనుచూపు మేర పచ్చదనం.. రాళ్ల మధ్య పారే సెలయేళ్ల సోయగం.. భూమిపైకి విహారానికి వచ్చినట్టు కనిపించే మేఘాల సమూహాలతో వెలుగొండ అందాలు చూపరులను ఆహ్లాద పరుస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెలుగొండ అడవులు పచ్చదనం సంతరించు కోవడంతోపాటు కొండకోనల్లో పారే సెలయేళ్లు, పక్షుల కిలకిల రావాలు, ఆహ్లాదకర వాతావరణంతో ప్రతిఒక్కరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆయా దృశ్యాలను ప్రజలు కనులారా తిలకించి తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)



వెలుగొండ అడవిలో సెలయేళ్ల సోయగం



దుర్గంపై జాలువారుతున్న సల్లాపేట్ జలపాతం

తీడని వాన

(5వ పేజీ తరువాయి)

కావడంతో విద్యార్థినులు అవస్థలు పడ్డారు.

● అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిప్రవహించాయి. పొలాల్లో వర్షపు నీరు చేరుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగుల ఉధృతితో ఆయా గ్రామాలకు రాకపోకలు కొంతమేర స్తంభించాయి. ఉదయగిరి ఆనకట్ట నిండుకుండలా మారి అలుగు పారుతోంది. వారం రోజులపాటు కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రహదారులు బురదమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● సీతారామపురం (ఆంధ్రజ్యోతి) : రంగనాయుడు పల్లిలోని మర్రిఊట్ల రిజర్వాయర్ నిండి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వైపు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎంపీడీవో భాస్కర్, ఈవోపీ ఆర్డీ భార్గవి వాగును పరిశీలించి, ప్రజలను అప్రమత్తం చేశారు.

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. బుధవారం 9,578 క్యూసెక్కులు కొనసాగగా గురువారం నాటికి 13,313 క్యూసెక్కులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 71.761 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, కండలేరుకు 2,000, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **రాళ్లపాడులో 19.2 అడుగులకు..**

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 19.2 అడుగులకు చేరింది. మన్నేరు నుంచి, సోమశిల ఉత్తర కాలువ నుంచి 200 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. మరో 10 అంగుళాల నీరు చేరితే ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20 అడుగులకు చేరినట్టు అవుతుంది. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య ప్రాజెక్టును సందర్శించారు.

● **గండిపాళెంలో..**

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : గండిపాళెం జలాశయంలో నీటిమట్టం 16.5 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కె.చంద్రమౌళి తెలిపారు. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జలాశయంలోకి 833 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు ఆయన తెలిపారు.



కందుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నీరు



సంగం : వసతిగృహంలో వర్షపునీరు



కందుకూరు : మోపాడు చెరువు నుంచి పది గేట్లు ఎత్తడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



సీతారామపురం : నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

54 మంది కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు

(5వ పేజీ తరువాయి)

నెం.273 ప్రకారం 125 మంది మాత్రమే వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లుగా ఉండాలని మిగిలిన వాళ్లను తొలగించాలని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 54 మంది తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ 2013లో హైకోర్టును ఆశ్రయించారు. వీరిని తాత్కాలికంగా విధుల్లో తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అనేక వాయిదాల అనంతరం హైకోర్టు తాజా ఆదేశాలు జారీ చేస్తూ నిబంధనల మేరకు ఎక్కువగా ఉన్న హెల్త్ అసిస్టెంట్లను విధుల తొలగించాలని ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో 54 మందిని తొలగిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎంహెచ్‌వో పెంచలయ్య తెలిపారు.

విధులు భళా.. భత్యం డీలా!

ఒంటిపై పోలీసు దుస్తులు ధరించి నేర నియంత్రణతోపాటు ప్రజలకు సేవ చేయాలన్న ఉత్సాహంతో ఎంతోమంది శ్రమిస్తారు. తమ లక్ష్యం నెరవేరని సమయంలో హోంగార్డు ఉద్యోగాల కోసం ప్రయత్నించి విజేతలుగా నిలిచి ఒంటిపై ఖాకీ యూనిఫాం వేసుకుంటారు. పోలీసులకు ధీటుగా సేవలందిస్తుంటారు. అయితే, వాస్తవరూపేణా హోంగార్డులు అంటే పోలీస్ శాఖలోనే కాదు.. సమాజంలోనే చిన్నచూపే ఎదురవుతోంది. ఏళ్ల తరబడి ప్రజలకు సేవలు అందించే హోంగార్డులు చివరకు ఉద్యోగ విరమణ సమయంలో ఆర్థిక భద్రత లేకుండా, పింఛను సౌకర్యం లేకనే వెను తిరుగుతున్నారు. తమ సమస్యల పరిష్కారంపై పాలకులు ఉత్తుత్తి హామీలు ఇచ్చి చేతులు దులుపుకో వడం తప్ప చేసేందేమీ లేదని హోంగార్డులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

● పోలీసులతో సమానంగా హోంగార్డుల సేవలు
● అయినా అన్నింటా చిన్నచేపే!
● ఆర్థిక భద్రత, పింఛన్ల కోసం ఎదురుచూపు
● నెరవేరని పాలకుల హామీలు
● వైసీపీ హయాంలో ఏకంగా అసోసియేషనే రద్దు
● నేడు 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం

బ్రిటిష్ పాలన నుంచి దేశం విముక్తి పొందుతున్న సమయం లో 1946 డిసెంబరు 6వ తేదీన సమా జంలో అలజడులను శాంతియుతంగా అదుపు చేసేందుకు, ఇతర సేవలు అందిం చేందుకు స్వచ్ఛంద సమూహంగా ఓ వ్యవస్థ ఏర్ప డింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఇలాంటి బృందాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో పని చేశాయి. దేశంలో పెరిగిన సమస్యలు, పోలీసులకు పెరిగిన భారం వల్ల స్వచ్ఛంద సేవ చేస్తున్న బృందాలపై ప్రభుత్వం దృష్టి సారిం చింది. 1962 చైనా యుద్ధం తర్వాత సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసు శాఖకు పని భారం పెరిగిన నేపథ్యంలో స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న బృందాలను హోంగార్డులుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశిం చింది. అలా 1963లో హోంగార్డు వ్యవస్థ ఆవిర్భవించింది.

జిల్లాలో 721 మంది...

జిల్లాలో 721 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. 587 మంది పోలీస్ విభాగంలో ఉండగా, వీరిలో 72 మంది మహిళలు ఉన్నారు. 134 మంది డిప్యూ టేషన్‌పై మెరైన్ పోలీసు అంతర్గత భద్రత, జెన్‌కో, ఎఫ్‌సీఐ, జైలు, ఆర్టీవో, అగ్నిమాపక దళంలో విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులతో సమానంగా మన్ననలు పొందుతూ విధులు నిర్వహిస్తు న్నారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, అంటువ్యాధుల వంటి అత్యవసర పరిస్థితులు, మత సామరస్యాన్ని కాపాడటం, ఆర్థిక, సామాజిక, సంక్షేమ కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం వంటి విధులను హోంగార్డులు నిర్వహిస్తున్నారు.

● **8 మంది మృత్యువాత**

ఈ సంవత్సరం విధులు నిర్వహిస్తూ 8మంది హోంగార్డులు మృతి చెందారు. మార్చి 31వ తేదీన వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వి వెంకటేశ్వర్లు, మే 20వ తేదీన ఆత్మకూరు స్టేషన్‌లో జి హరిప్రసాద్, జూన్ 22న వెంకటగిరి స్టేషన్‌లో టి సురేష్, సెప్టెంబరు 6న బీడి టీమ్‌కు చెందిన పి బాల సుబ్రహ్మణ్యం, అదే నెల 8న ఇందుకూరుపేట స్టేషన్‌లో పనిచేసే షేక్ తాజుద్దీన్, 11న ఎస్ఆర్ పురం స్టేషన్‌లో పనిచేసే షస్రక్ అబ్దుల్ ఖాదర్, అక్టోబరు 27న బుచ్చి స్టేషన్‌లో తాల్లూరు లక్ష్మయ్య, అదే నెలలో 28వ తేదీన బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో పనిచేసే వి నాగేంద్ర ప్రసాద్ మృతి చెందారు.

● **వైసీపీ పాలనలో నిర్లక్ష్యం**

గత వైసీపీ ప్రభుత్వంలో పోస్టులు భర్తీ జరగకపోగా హోమ్‌గార్డుల సమస్యల పరిష్కారంపై ప్రశ్నిస్తున్నారని ఆ అసోసియేషన్‌నే రద్దు చేశారు. వేతనంతో కూడిన రెండు రోజుల సెలవులు అంటున్నా జిల్లాలో అవి పెద్దగా అమలు కావడం లేదు. గత ప్రభుత్వంలో ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత తదితర సమస్యలపై అనేకమార్లు వినతిపత్రాలు అందజేసినా ఏ ఒక్కటీ అమలుకు నోచు కోలేదు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేసిన సమ యంలో హోమ్‌గార్డులు ఆయన్ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వీటిపై లోకేష్ సానుకూ లంగా స్పందించడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై హోంగా ర్డులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు. కాగా, హోంగార్డు వ్యవ స్థాపక దినోత్స వం సందర్భంగా శుక్రవారం నెల్లూరు లోని పోలీస్ కవాతు మైదానంలో విడుకల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు.



అందుతున్న సంక్షేమాలివే!

● హోంగార్డులు మరణించిన సమయంలో జిల్లాలో ఉన్న హోంగార్డులందరూ ఒకరోజు వేతనాన్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ విధానం తొలుత మన జిల్లా నుంచి ఆరంభమై ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోంది.
● ప్రమాదవశాత్తు హోంగార్డు మృతి చెందితే రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తోంది.
● విధులో ఉండి చనిపోయిన హోంగార్డుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇస్తారు.
● హోంగార్డులందరికీ యాక్సిస్ బ్యాంక్‌లో ఖాతాలు ఓపెన్ చేయించారు. ఈ అకౌంట్ తీసుకొన్న వారు ప్రమాదంలో మరణించి సమయంలో రూ.30 లక్షల ఇన్సూరెన్స్ వస్తుంది.
● హోంగార్డులకు రోజుకు రూ.710 చొప్పున నెలకు రూ. 21,300 జీతంగా అందుతోంది.

ఆస్ట్రాలజీలో అవార్డుల పంట!

ఎంతటి పెద్దంటి పెళ్లి సంబంధం అదృష్టంగా లభించిన జాతాకాలతో కూడిన జ్యోతిష్యం చూడకుండా ముందడుగు వేయలేం. రూపాయి రూపాయి కష్టపడి సంపాదిం చుకుని నిర్మించాలనుకున్న అందాల భవనాన్ని వాస్తులేకుండా కట్టుకోలేం. నిత్య జీవితంలో ఏ పని మొదలు పెట్టాలన్న ముహూర్తం చూశాకే అడుగు ముందు కేస్తాం. ఈ మూడు విషయాలలో ఎంతటి వారైన శాస్త్రోక్తంగా వెళ్లాల్సిందే. జ్యోతిష్యం, ముహూర్త శాస్త్రంలో డాక్టరేట్, పీజీ చేసిన రామచంద్రుని లక్ష్మీ శ్రీనివాసశర్మ దేశవ్యాప్తంగా అనేక సంస్థల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. నెల్లూరురూరల్ మండలం అల్లీపురం ఆంజనేయస్వామి ఆలయంలో సామాన్య పూజారిగా పని చేస్తూ అటు అర్చక, ఇటు పౌరహిత్యంలో రాణిస్తున్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

● జ్యోతిష్యంలో డాక్టరేట్, ముహూర్త శాస్త్రంలో ఎంఏ
● వాస్తు, జ్యోతిష్యంలో మరో పీజీ
● ఎన్నో అవార్డులు ప్రశంసలు లక్ష్మీశ్రీనివాసశర్మ సొంతం

ప్రకాశం జిల్లా బొట్లగూడూరుకు చెందిన శ్రీనివాసశర్మ ప్రాథమిక విద్య అనంతరం బుచ్చిరెడ్డిపాళెంకు తల్లిదండ్రులతో కలిసి వృత్తిరీత్యా పౌరోహిత్యం చేస్తూ అల్లీపురం వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజారిగా కొనసాగుతున్నారు. హైదరాబాద్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిష్య శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2019లో డాక్టరేట్ కూడా అందుకున్నారు.



పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న లక్ష్మీ శ్రీనివాసశర్మ

ముహూర్త శాస్త్రంలో ఎంఏ, వాస్తు, జ్యోతిష్య శాస్త్రంలో పీజీ కూడా పూర్తి చేశారు. బహిరంగ వేదికలపై మహామహులతో తలపడి అనేక సంస్థల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. 2016లో తిరుగురు వారుల్ జ్యోతిష్య వెల్ఫేర్ అసోసియేషన్ వారు చిత్తూరులో అందించిన 'జ్యోతిష్య మమణి', 'జ్యోతిష్య మణి' అవార్డు లను అందుకున్నారు. 2023లో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సత్యసాయి సేవ పురస్కారం, ఈ ఏడాది అదే సంస్థ 'విశిష్ట సేవరత్న' అవార్డు ప్రదానం చేసింది.

● **రామకృష్ణ శాస్త్రీ చేతులుమీదుగా...**

2022లో హైదరాబాద్‌లో జ్యోతిష్య భారతం మహా సమ్మేళనం పేరుతో గ్లోబల్ అకాడమి ఆఫ్ ఆస్ట్రాల జికల్ సైన్స్, పరాశర అకాడమీ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్స్ సంస్థలు సంయుక్తంగా త్యాగరాయ గాన సభ వేదికపై శృంగేరి శారద పీఠం ఆస్థాన సిద్ధాంతి డాక్టర్ శంకరమంచి రామకృష్ణ శాస్త్రీ చేతులు మీదుగా 'జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్నారు. విదేశాలలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజికల్ ఫెడరేషన్ వారు లైఫ్ టైం మెంబర్ షిప్‌ను గౌరవార్థం అందచేశారు. ఇక స్థానికంగా అనేక సంస్థలు, ప్రముఖుల నుంచి లక్ష్మీశ్రీనివాసశర్మ ప్రశంసలు అందుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి జ్యోతిష్య విభాగంలో రాష్ట్రంలోని తొలిగా లక్ష్మీశ్రీనివాసశర్మ డాక్టరేట్ పొందారు.

వ్యాపార ఉద్దేశమే లేదు

నేను నేర్చుకున్న వృత్తిని వీలైనంత వరకు సమాజానికి ఉపయోగపెట్టడమే నా లక్ష్యం. జ్యోతిష్యం, వాస్తు, ముహూర్త శాస్త్రాలకు మంచి గిరాకీ ఉన్నా నాకు వ్యాపారం చేయడం ఇష్టంలేదు. వీలైనంత వరకు అందరికీ మంచి జరగాలన్నదే నా ఉద్దేశం.

- డాక్టర్ రామచంద్రుని లక్ష్మీశ్రీనివాసశర్మ

చంద్రబాబు పాలనలో ప్రగతి పథంలో రాష్ట్రం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్


విలేకరులతో మాట్లాడుతున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో ప్రగతి పథంలో నడుస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ అన్నారు. గురువారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే పరిశ్రమల ఏర్పాటుకు రూ.4.87 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఉదయగిరి నియోజకవర్గాన్ని పారిశ్రామికవాడగా అభివృద్ధి చేసి వలసల నివారణకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నందానీ, ఉప్పుటూరి పెదవెంకటయ్య, మస్తాన్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూములు పంచకపోతే ఉద్యమిస్తాం

● సీపీఐ జిల్లా నేత దామా



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య

కావలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రియల్ ఎస్టేట్ వారి ఆక్రమణలో 120ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని అధికారులు చెబుతున్న దానికన్నా అదనంగానే ఉందని ఆభూమిని సంక్రాంతిలోపు స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. ఈ విషయంపై గురువారం ఆయన కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆక్రమించుకున్న భూములను పేదలకు పంపిణీ చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పేదలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు నివాసస్థలాలు ఇస్తామని చెప్పారని తెలిపారు. ఇళ్లు నిర్మించు కునేందుకు ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 5లక్షలు మంజూరు చేసి ఇసుక, సిమెంటు, ఐరన్‌ను రాయితీ ధరలకు అందించాలని కోరారు. అర్హులైన పేదలు సచివాలయాలలో నివాస స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో సీపీఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కే. నాగరాజు, చేవూరు కొడయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలకు 50శాతం సబ్సిడీ

కలువాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నర్సరీలు ఏర్పాటు చేసుకునే రైతులకు యూనిట్ విలువలో 50శాతం ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీ అందించనున్నట్లు కలువాయి మండల ఉద్యానవన శాఖ అధికారి మిథిలా తెలిపారు. రూ. 15లక్షలు యూనిట్ విలువ గల నర్సరీని రైతులు ఏర్పాటుచేసుకుంటే దానికి రూ.7.5లక్షలు సబ్సిడీ వస్తుందని చెప్పారు. అలాగే 60అడుగుల పొడవు, 40అడుగుల వెడల్పుతో కలెక్షన్ సెంటర్ నిర్మించుకునే రైతులకు రూ.6లక్షలు, సోలార్ కోల్డ్ రూం ఏర్పాటు చేసుకునే వారికి రూ.5.25లక్షలు సబ్సిడీ ఉంటుందని ఆమె వివరించారు. అవసరమైన రైతులు వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

● సంగం : రక్షిత వ్యవసాయ పథకం కింద షెడ్‌నెట్, పాలిహౌస్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందని, కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని హార్టికల్చర్ అధికారి లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్‌నెట్ నిర్మాణానికి ఎకరాకు రూ. 38.4 లక్షలు, పాలిహౌస్ నిర్మాణానికి రూ. 37.4 లక్షల నిధులు మంజూరవుతాయన్నారు. అందులో 50 శాతం రాయితీ ఉద్యానశాఖ ద్వారా ఇవ్వడం జరుగుతుందని కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మెగా పీటీఎం సమావేశం విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆత్మకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ, మండలంలోని ప్రతి పాఠశాలలో ఈ నెల 7వ తేదీన జరిగే మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం విజయంతం చేయాలని ఎంపీడీవో కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలలకు నోడల్ అధికారులుగా నియమించబడ్డ మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల, డిజిటల్ అసిస్టెంట్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పనితీరును మరింత మెరుగుపరచడానికి ప్రజల భాగస్వామ్యం కల్పించి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించడం జరుగుతోందని, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా తగు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. నోడల్ అధికారులుగా నియమించబడ్డ మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు తప్పక హాజరు కావాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో క్లాప్ మిత్రుల ద్వారా శానిటేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, పాఠశాల నోడల్ అధికారులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపుపై హర్షం

లింగసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సర్వే నంబరు 79లోని ఏ 18.80 సెంట్ల గ్రామ కంఠం భూములను 22-బి నిషేధిత భూముల జాబితా నుండి తొలగించడంపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు టీడీపీ నాయకులు అడపా రంగయ్య, జి ప్రసాద్, చిన కొండయ్య, ముసలయ్యలు గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గ్రామ కంఠం కింద ఈ భూములను ఏడేళ్ల కిందట అధికారులు, సిబ్బంది 22-బిలో చేర్చడంతో ఈ సర్వే నంబరులోని నివాసాల వారు స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరగక పోవడంతో అమ్ముకోలేక, కొనలేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ భూములకు విముక్తి కలిగించడంతో గ్రామ ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారని వారు తెలిపారు.

ఫసల్‌బీమాపై రైతులకు అవగాహన


వలేటివారిపాలెం: మాట్లాడుతున్న ఏఓ హేమంత్‌భరత్‌కుమార్

వలేటివారిపాలెం, డిసెబరు 5 (ఆంధ్రజ్యోతి): పోకూరు రామాలయంలో గురు వారం ఏఓ హేమంత్ భరత్‌కుమార్ ఫస ల్‌బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఓ హేమత్ భరత్‌కుమార్ మాట్లాడారు. పంటలకు బీమా చేయించుకుంటే తుపాను, కరువు, అకాల వర్షాలతో కలిగే ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. కౌలు రైతు లకు కూడా ఈ బీమా సౌకర్యం వర్తిస్తుం దన్నారు. ఈనెల 15వ తేదీలోపు బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టాటా ఏఐజి ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి రామరాజు, ఉద్యానవన సహాయకులు భాషా పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై శిక్షణ

● ఉలవపాడు : మామిడిలో పూతదశలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై గురువారం ఉలవపాడు రైతుసేవా కేంద్రంలో రైతులకు శిక్షణ ఇచ్చినట్లు మండల ఉద్యాన అధికారి జ్యోతి తెలిపారు. డిసెంబర్ మూడోవారం నుంచి పూతలు వచ్చే అవకాశం ఉన్నందున తేమతో కూడిన వాతావరణంలో మామిడిలో బూడిద తెగులు వచ్చే అవకాశం ఉన్నందున ఒక లీటర్ నీటికి 5గ్రామల పోగిటాషియం బైకార్బోనేట్ కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐసీ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి వెంకట్రావు, ఉద్యాన సహాయకులు కే శ్రీనివాసులు, స్థానిక మామిడి రైతులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తరగతి గదులు

భయం గుప్పెట్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు


శిథిలావస్థలో తరగతి గదులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఉపాధ్యాయులు విశ్రాంతి తీసుకునే గదులు సైతం పురాతనమైనవి కావడంతో ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. దీనికితోడు పాఠశాలలో 498 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి తగ్గట్టుగా గదులు లేకపోవడంతో ఒకే గదిలో పదుల సంఖ్యలో విద్యార్థులు కూర్చోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల దుస్థితిని చూసి గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా రూ.1.50 కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. అయితే ఆ గదుల నిర్మాణం నిధుల లేమితో అసంపూర్తిగా మిగిలిపోవడంతో శిథిల భవనాల్లోనే భయం నీడన బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలి : ఫ్యాప్టో


ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల దాడిలో మృతి చెందిన రాయచోటి పట్టణంలో కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన హెచ్ఎంల సమావేశంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలలో గుట్కా, గంజాయి వంటి విష సంస్కృతిని ప్రభుత్వం అరికట్టాలని, బాధిత ఉపాధ్యాయ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు శివప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు అంకయ్య ఖాదర్‌బాషా, నరేంద్రరెడ్డి, హరికృష్ణ, సుధాకర్, కొండయ్య, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం: మండలంలోని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నిరసన చేపట్టారు. రాయచోటిలో విద్యార్థుల దాడిలో మరణించిన ఉపాధ్యాయుని మృతికి సంతాపం తెలిపి విచారం వ్యక్తం చేశారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మండల విద్యా శాఖాధికారి 2 ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కష్టమైనా ఇష్టంగా చదివితేనే భవిష్యత్తు : ఎమ్మెల్యే దగుమాటి

● రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో పాలీ టెక్‌ఫెస్ట్ ప్రారంభం


విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి

కావలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కష్టమైనా ఇష్టంగా చదువుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి చేతులు మీదుగా పాలీ టెక్‌ఫెస్ట్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, పాలిటెక్నిక్ కళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ ప్రియ పాల్గొన్నారు. అనంతరం - ఆర్‌జేడీ నిర్మల్ కుమార్ ప్రియ మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి ప్రాజెక్టులు చేయడం వలన ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహద పడతాయన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, లెక్చరర్లు ఇలాంటి కార్యక్రమాలతో ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం మెకానికల్, సివిల్, కంప్యూటర్ ఇంజనీర్ మొదలైన వివిధ ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల నుండి పాల్గొన్న 170 మంది విద్యార్థులు 56 విన్నూతన ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, టీడీపీ నాయకుడు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనారు.

వెంగమాంబకు పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారికి పల్లకీ సేవను గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పల్లకీసేవ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధ్యాయుల నిరసన


ఎంఈవో-2కు మెమోరాండం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు.

కలువాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు కలువాయిలో గురువారం పాఠశాలల పనివేళల పెంపు, 100రోజుల యాక్షన్ ప్లాన్, అపార్ నమోదు, 10శాతం సెలవుల నిర్ణయాలపై ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవో-2 శేషగిరిరావుకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

చేజర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేజర్లలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో మస్తానయ్య, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయురాలు హైమావతి పాల్గొని మాట్లాడుతూ భవిత సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టి మస్తాన్ వలి, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కావలి రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): అన్నగారిపాలెం అటవీ ప్రాంతంలోని కోడి పందేల స్థావరంపై గురువారం సీఐ రాజేశ్వరరావు ఆదేశాలతో ఎస్ఐలు బాజీబాబు, తిరుమల రెడ్డి, బాలక్రిష్ణ దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.7,250 నగదు, 5 కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి బుధవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మంత్రాలయ శ్రీగురురాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులతో కలిశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సీఎం చంద్రబాబును ఆశీర్వదించి రాజధాని నిర్మాణానికి రూ.50లక్షలు విరాళం అందజేశారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పీఠాధిపతికి కృతజ్ఞతలు తెలిపారు.

టీవీఎస్ ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

● కావలి టౌన్: టీవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ క్యాలెండర్‌ను గురువారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేను ట్రస్ట్ సభ్యులు సత్కరించి పూలమొక్కను బహూకరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ గాదిరెడ్డి హరనాథ్, కోశాధికారి వేములపాటి మాధవ, పాల్గొన్నారు.

వంటేరు కుటుంబానికి పరామర్శ

● బిట్రగుంట : ముంగమూరు టీడీపీ నాయకుడు యన్నాబత్తిన్న వెంకటేశ్వర్లు బావ వంటేరు శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దేవరాళ్ళ సుబ్రమణ్యం యాదవ్, స్థానిక టీడీపీ నేతలు మాలేపాటి నాగే శ్వరావు, ముంతాల వెంకటేశ్వర్లు, ఎల్.సుధీరబాబు, వెంకటేశ్వర్లురెడ్డి, గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, తిరివీధి ప్రసాద్, డాకా శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

సురేంద్ర మృతి బాధాకరం : బొల్లినేని

కలిగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు బీవీ రామారావు రెండో కుమారుడు, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బొల్లినేని సురేంద్ర ఆకస్మిక మృతి తమను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలుగుదేశం జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తెలిపారు. పెద్దపాడులో గురువారం సురేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సురేంద్ర కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ పిలునిచ్చిన కార్యక్రమాల్లో సురేంద్ర చురుగా పాల్గొనేవాడన్నారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు ఎంవీ రామిరెడ్డి, ఊసా మాల్యాద్రి, మహేష్, మొక్కా హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ


హాస్టల్‌లో భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో


సీతారామపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్, బీసీ బాలుర హాస్టల్‌ని గురువారం ఎంపీడీవో భాస్కర్, ఈఓపీఆర్డీ భార్గవి తనిఖీ చేశారు. హాస్టళ్లలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం హాస్టల్ రికార్డులను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి వార్డెన్‌లకు సూచనలు చేశారు. అనంతరం సింగారెడ్డిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి, సమయపాలన పాటించాలని వారిని హెచ్చరించారు. అలాగే మండల స్థాయిలో జరుగుతున్న హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు.

ఆరోగ్యవంతమైన నేలతోనే ఆహార ఉత్పత్తి సాధ్యం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మనిషి జీవనానికి మట్టి మూలాధారమని, ఆరోగ్యవంతైన నేల ఉన్నప్పుడే ప్రపంచ వ్యాప్తంగా జనాభాను పోషించడానికి కావల్సిన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేల సంరక్షణ-పర్యవేక్షణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేలపై పోర దెబ్బ తింటుందని, ఇది ఆహార భద్రతపై ప్రమాద ఘంటికలు మోగిస్తుందన్నారు. నేల మనకు స్వచ్ఛమైన నీటిని, జీవవైవిధ్యాన్ని అందిస్తుందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సూర్య, గోపికృష్ణ, సునీత, రమేష్, దుర్గాప్రసాద్, కిషన్‌తేజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం



దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలో ఓ కారు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కారులో ఉదయగిరి నుంచి ఆత్మకూరు వెళుతుండగా నందిపాడు గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న మోటార్‌బైక్‌ను తప్పించబోయి కారు రోడ్డు మార్జిన్ దిగి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలని ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దుర్గంపల్లి, స్థానిక ఎస్‌బీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి రిజిస్టర్లు పరిశీలించారు.

పరివర్తన సేవలకు ప్రశంసలు

కావలి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పరివర్తన స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ రహమాన్‌కు నెహ్రూ యువకేంద్రం సభ్యులు గురువారం ప్రశంసాపత్రంతో సత్కరించారు. నెల్లూరులోని నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో ప్రపంచ వాలీంటీర్ల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో కేంద్రం జిల్లా యువజన అధికారి మహేంద్ర రెడ్డి, యువజన సర్వీసుల శాఖ ఇన్‌చార్జ్ సీఈవో శ్రీనివాసరావు, సూపరింటిండెంట్ అహ్మద్ గయాజ్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని సూపర్‌వైజర్ షేక్ షాను సూచించారు. గురువారం మండలంలోని రెడ్లదిన్నె ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యకర్తలు చార్టులను ప్రదర్శిస్తూ ఆటపాటలతో విద్యాబోధన చేయడంతోపాటు కేంద్రాల నిర్వాహణలో సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె జయమ్మ భోగ్యం సరస్వతి, జీ ప్రమీల, కె ప్రభావతి, పీ అన్నపూర్ణ, డీ సుభాషిణి, కె విజయమ్మ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి, కుళాయి పన్నుల డిజిటలైజేషన్

● రాధామాధవి, డివిజనల్ పంచాయతీ అధికారి



కావలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో కూడా ఇంటి, కొళాయి పన్నులను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు కావలి డివిజన్ పంచాయతీ అధికారిణి రాధామాదవి తెలిపారు. ఇలా చేయడం వల్ల పంచా యతీ పన్నులు అన్నీ ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయని ఎలాంటి అవక తవకలకు ఆస్కారం ఉండద న్నారు. జమా ఖర్చులు ఖచ్చితంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇంటి పన్నులతో పాటు, 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల అభివృద్ధికి వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు.

? ఇంటి పన్నుల డిజిటలైజేషన్ పనులు ఎంత వరకు చేపట్టారు.

! డివిజన్‌లోని 10 మండలాల్లోని పంచాయతీల్లో 92 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తిచేశాం.

? ఇంటి పన్నుల డిజిటలైజేషన్‌లో కొందరు జాప్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

! పన్నులు డిజిటలైజేషన్‌లో కొందరు జాప్యం చేయడంతో కావలి, వింజమూరు, దగదర్తి మండలాల ఈవోపీఆర్డీలకు మెమోలు ఇచ్చాం.

? మెమోలు ఇచ్చిన తర్వాత పనుల్లో వేగం పెరిగిందా.

! మెమోలు ఇవ్వగానే వారు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చి పనుల్లో వేగం పెంచారు.

న్యూస్ బాక్స్

డ్రైనేజీ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

గుడ్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పొట్లూరులో జరుగుతున్న పైప్‌లైన్, డ్రైనేజి పనులను గురువారం ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కార్యదర్శి సీహెచ్ లక్ష్మిలత, వెల్‌ఫేర్ అసిస్టెంట్ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

13 మద్యం సీసాల స్వాధీనం

బిట్రగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనధికారంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కావలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. గురువారం ఆయన సుందరగిరివారి కండ్రికలో పెనుమాల మహేశ్వరి, భర్త మాల్యాద్రి ఇంట్లో 13మద్యం బాటిళ్లను గుర్తించామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని మహిళను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. దాడులో ఎక్సైజ్ ఎస్ఐ ఎం.దేవిక, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

క్రీడా పరికరాల వితరణ

ఏఎస్ పేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కావలి ఎడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు గురువారం క్రీడా పరికరాలను బహూకరించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు మద్దూరి తిరుపతయ్య, గోళ్ళ వెంకటేశ్వర్లు, నాగినేని మస్తానయ్య, వివేకానంద, మన్నం మురళి తదితరులు విద్యార్థులకు క్రీడా పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ ముప్పూరి ధనమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంగం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురం, మర్రిపాడు 11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ నూతన లైన్ పనులు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 9-15 నుంచి 2-15 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిస్కం ఏఈ మన్మధరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల రైతులకు త్రీఫేస్ వ్యవసాయం కరెంట్ ఉదయం 4-15 నుంచి 9-15 గంటల వరకు, మధ్యాహ్నం 2-15 నుంచి 6-15 గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇళ్లలోకి వర్షపు నీరు

వలేటివారిపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోకూరు చెరువు నిండి అలుగు పారి దిగువనున్న ఎస్సీ కాలనీలోని ఇళ్లలోకి వర్షం నీరు వచ్చి చేరుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎగువ నుండి వరద ఉధృతి తగ్గేవరకూ ఇళ్ల ముందు నిలబడిన వరద నీరు పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రిన్స్ యూత్ సేవలకు ప్రశంసలు

దగదర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం శ్రీరామాపురం పంచాయతీకి చెందిన ప్రిన్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇండ్ల కృష్ణయ్య సేవలను గుర్తిస్తూ నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం జిల్లా ఆఫీసర్ మహీంద్రరెడ్డి గురువారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడారు. ప్రపంచ వాలంటీర్ల దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం చేపట్టారు.